


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

ఆటో కార్మికులకు త్వరలో సంక్షేమ బోర్డు
మానవీయ కోణంలో సమస్యలు పరిష్కారం డిప్యూటీ సిఎం భట్టి

10 నుంచి 18 వరకు బతుకమ్మ వేడుకలు 03

సంపుటి 29, సంచిక: 105 | ఆదివారం | 04-10-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

## రుసుము చెల్లిస్తే రిజిస్ట్రేషన్లు



● నాలా అనుమతి లేకుండా నివాస వినియోగంలోకి వచ్చిన పట్టా భూములపై ప్రభుత్వం నిర్ణయం ● 22ఎ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మరో కీలక అడుగు

ప్రజాపక్షం/హైదరాబాద్

22ఎ పరిధిలో చిక్కుకుని రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన నాలా పూర్తికాని నివాస పట్టా భూముల సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం మరో పరిష్కార మార్గాన్ని తీసుకొచ్చింది. వ్యవసాయ భూములుగా నమోదై అనంతరం నివాస వినియోగంలోకి వచ్చినప్పటికీ నాలా ప్రక్రియ పూర్తికాక రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన అర్హత ఉన్న భూములకు నాలా, ఇతర ప్రభుత్వ రుసుములు చెల్లించిన తర్వాత రిజిస్ట్రేషన్లు చేపట్టేలా జిల్లా కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సంక్లిష్ట భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నాలా ప్రక్రియ తరువాయి 12లో

## మహిళలు, పిల్లల రక్షణకు అత్యంత ప్రాధాన్యం

● డిజిటల్ వేదికలపై చిన్నారుల రక్షణ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం ● ఎన్ఎఎల్ఎస్ఎ దక్షిణాది ప్రాంతీయ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్

పిల్లలు ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ నేరాలకు గురికాకుండా వారికి అవసరమైన భద్రత, సంరక్షణ కోసం న్యాయ సేవల ప్రాధికార సంస్థ (టిజిఎల్ఎస్ఎ) సూచనలు, కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతునిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. డిజిటల్ వేదికలపై పిల్లల రక్షణ కోసం వ్యవస్థలను బలోపేతం చేయడానికి న్యాయసేవల సంస్థలు చేస్తున్న మంచి కార్యక్రమాలను ప్రతి గ్రామానికి చేరేలా ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందని చెప్పారు. మహిళలు, పిల్లల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. "జాతీయ న్యాయ సేవా ప్రాధికార సంస్థ (ఎన్ఎఎల్ఎస్ఎ) ఆధ్వర్యంలో డిజిటల్ వేదికలపై పిల్లలకు రక్షణ, సులభంగా న్యాయం అందించడం – ఆన్‌లైన్ లైంగిక వేధింపులను అరికట్టడం, పిల్లలకు అనుకూలమైన న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడం" అనే ఇతివృత్తంపై దక్షిణాది ప్రాంతీయ సదస్సు హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సదస్సులో కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘువాల్, సుప్రీం కోర్టు న్యాయమూర్తి, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎన్ఎఎల్ఎస్ఎ) ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ విక్రమ్ నాథ్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ ఆర్.మహదేవన్, జస్టిస్ అలోక్ అరాధే, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్యాట్రన్‌ఇన్‌చీఫ్, జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తరువాయి 8లో




## అదరం... బెదరం

### జంతర్ మంతర్ వద్ద రెండవ రోజూ ఉద్రిక్తత

● జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్ ● ఎంపి కపిల్ సిబల్, ప్రశాంత్‌భూషణ్, యోగేంద్ర యాదవ్, సుప్రీంకోర్టు న్యాయవాదులు, విద్యార్థి, పౌరసమాజ సంఘాల నేతల నిరసన ప్రదర్శన ● అడ్డుకున్న పోలీసులు : అదుపులో 150 మంది నిరసనకారులు




**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద రెండవ రోజు శనివారం కూడా నిరసనలు వెల్లువెత్తాయి. కేంద్ర ఎన్నికలు ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ విపక్ష నేతలు, విద్యార్థులు, యువజన సంఘాలు శుక్రవారం జంతర్‌మంతర్ వద్ద పెద్ద ఎత్తున గళం విప్పారు. ఆయనకు వ్యతిరేకంగా నినదించారు. అయితే నిరసనలకు అనుమతి లేదని నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. 1000 మందికిపైగా నాయకులు, యువజన, విద్యార్థి సంఘాల నాయకులను అదుపులోకి తీసుకున్నారు. అయినా అదరకుండా బెదరకుండా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా, ఆయన రాజీనామాను డిమాండ్ చేస్తూ పటేల్ చౌక్ నుంచి జంతర్ మంతర్ వైపు శనివారం కూడా ర్యాలీగా బయలుదేరారు. ఈ నేపథ్యంలో భారీగా మోహరించిన పోలీసులు ఎఐఎస్ఎ జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా, కార్యకర్త యోగేంద్ర యాదవ్, సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, ఎఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేశ్ సీరంగరాజ్, ఢిల్లీ కన్వీనర్ అనికేత్ మద్కే సహా మరో 60 మంది ఎఐఎస్ఎఫ్ నాయకులు సహా సుమారు 150 మంది నిరసనకారులను వివిధ ప్రాంతాల్లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో నిరసనకారులకు, పోలీసులకు మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. ఈ ఘర్షణలో ఎఐఎస్ఎఫ్ కార్యకర్త సింగర్ కాసిఫ్ స్పృహతప్పి పడిపోయాడు. ఈ పాదయాత్రలో బోరా, ఇతర విద్యార్థులతో పాటు సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, నిత్యా రామకృష్ణన్, పల్లవ్ సిసోడియా, ప్రశాంత్ భూషణ్ పాల్గొన్నారని ఎఐఎస్ఎ సభ్యులు తెలిపారు. అయితే నిరసన స్థలం సమీపంలో నిరసనకారులు గుమిగూడగానే పోలీసులు తరువాయి 8లో



## అదుపుతప్పి బస్సు బోల్తా

● నలుగురు మృతి, 16 మందికి పైగా తీవ్ర గాయాలు ● వికారాబాద్ జిల్లా అనంతగిరి సమీపంలో ఘటన ● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు సంతాపం ● మృతుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా

ప్రజాపక్షం/వికారాబాద్

వికారాబాద్ జిల్లాలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అనంతగిరి గుట్ట సమీపంలో జరిగిన ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. 16 మందికిపైగా గాయాలయ్యాయి. వికారాబాద్ ధారూర్ మండల పరిధి చింతకుంట గ్రామానికి చెందిన నారాయణరెడ్డి మృతి చెందడంతో అయన అంత్యక్రియల్లో పాల్గొనడానికి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం కేసరం గ్రామం నుండి దాదాపు 45మంది తరువాయి 12లో

ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి 03
వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాన్ని గుర్తించి నియామక ప్రక్రియ మొదలుపెట్టాలి
అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన

ఏషియన్ గేమ్స్ 2026 భారత్‌కు 85 పతకాలు
21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలు – వివరాలు 9లో

కేంద్రమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు 12



## లోక్‌సభ, అసెంబ్లీలను రద్దు చేయాలి

### బ్యాలట్ పేపర్‌తో మళ్లీ ఎన్నికలు జరపాలి

● కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం కీలక వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని ఎన్నికలు చట్టవిరుద్ధమని, ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా చట్టవిరుద్ధంగా ఎన్నికైన వారేనన్నారు. బ్యాలెట్ పేపర్ల ద్వారా కొత్త ఎన్నికలు నిర్వహించాలన్నారు. 'నేడు దేశమంతా చట్టవిరుద్ధమైన ఎన్నికల ఆధారంగా నడుస్తోంది. మోదీ చట్టవిరుద్ధమైన ప్రధాని, షా చట్టవిరుద్ధమైన మంత్రి, అలాగే ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ చట్టవిరుద్ధమే. వాటన్నింటినీ రద్దు చేసి, మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి, ఆ ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల ద్వారా జరగాలి' అని ఆయన విలేకరుల సమావేశంలో ఖర్గే పేర్కొన్నారు. ఇవిఎంల దుర్వినియోగం జరుగుతోందని ఆయన ఆరోపించారు. వారి సొంత మనుషులే ఈ విషయాన్ని తరువాయి 8లో

## 'సర్'పై పోరుబాట

● 6న జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు.. 8న లోక్‌భవన్ ముట్టడి.. నవంబర్ 1న చలో ఢిల్లీ ● గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నిర్ణయం ● రాజకీయ ప్రయోజనాలకు దర్యాప్తు సంస్థలను ఉపయోగిస్తున్నారని బిజెపి సర్కార్‌పై మండిపాటు




ప్రజాపక్షం/హైదరాబాద్

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో అర్హులైన ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారని ఇండియా కూటమి నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న పరిణామాలపై నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. అక్టోబర్ 6న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు, అక్టోబర్ 8న తెలంగాణ లోక్‌భవన్ ముట్టడి, నవంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమాలు నిర్వహించాలని ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల రాష్ట్ర శాఖలు నిర్ణయించాయి. ఇండియా కూటమి పార్టీల రాష్ట్ర శాఖల సమావేశం టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన గాంధీ భవన్‌లో శనివారం జరిగింది. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ, కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎండి.అబ్బాస్, సమాజ్ వాద్ పార్టీ (ఎస్‌పి) రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ సింహాద్రి, ఆర్‌జెడి రాష్ట్ర అధ్యక్షులు పి.శోభా యాదవ్, తెలంగాణ జన సమితి (టిజెఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసయ్య, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఆశప్, బిసి జన సమితి అధ్యక్షులు తరువాయి 8లో



## బాయిలర్‌లో పేలుడు

### ఐదుగురు కార్మికులు మృతి

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ టిల్ హెల్త్ కేర్ పరిశ్రమలో ఘటన

**సత్యవేడు:** ఆంధ్రప్రదేశ్ తిరుపతి జిల్లా సత్యవేడు మండలం చెరివి గ్రామానికి సమీపంలోని శ్రీసిటీలోని టాబ్లెట్ పరిశ్రమ (టిల్ హెల్త్ కేర్) లో శనివారం ఉదయం బాయిలర్ పేలడంతో ఐదుగురు కార్మికులు మతి చెందారు. టిల్ హెల్త్ కేర్ కంపెనీలో ముఖ్యంగా టాబ్లెట్స్, క్యాప్సూల్స్, లిక్విడ్ ఓరల్స్ తదితర ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. ఈ కంపెనీలో దాదాపు 500 నుంచి వెయ్యి వరకు కార్మికులు పని చేస్తున్నారు. శనివారం ఉదయం ఎనిమిదిన్నర గంటల సమయంలో బాయిలర్ ఒక్కసారిగా పేలడంతో అక్కడ పని చేస్తున్న కార్మికులు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన ముగ్గురిలో ఇద్దరిని శ్రీసిటీ హాస్పటల్‌కు తరలించగా, మరొకరిని చెన్నై తరువాయి 12లో

## ప్రజా ఉద్యమాలకు పునాదిగా యువతరం

● స్వాతంత్రోద్యమం, సాయుధ తెలంగాణ పోరాటం, తెలంగాణ సాధనోద్యమం సహా కమ్యూనిస్టు పార్టీ సాగించిన పోరాటాల్లో ముందు నిలిచింది వారే ● టియుడబ్ల్యుజె (ఐజెయు) 'మీట్ ద ప్రెస్'లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని




ప్రజాపక్షం/ఖమ్మం

యువతరం ప్రజా ఉద్యమాలకు పునాదిగా నిలిచిందని నాటి స్వాతంత్రోద్యమం, సాయుధ తెలంగాణ పోరాటం, తెలంగాణ సాధనోద్యమం, పేదల పక్షాన కమ్యూనిస్టు పార్టీ సాగించిన అనేక పోరాటాల్లో యువతరమే ముందు నిలిచిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఇప్పుడు మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జెన్‌జీ ఉద్యమించడంతో దిమాగి నక్సల్స్ పేరుతో అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) ఆధ్వర్యంలో శనివారం 'మీట్ ద ప్రెస్' కార్యక్రమాన్ని కూనంనేనితో ఖమ్మంలో నిర్వహించారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ సమన్వయ కర్తగా వ్యవహరించారు. కూనంనేని మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ పాలనలో సమన్వయం తరువాయి 8లో



## పాక్ చిత్తు... భారత్‌దే 'గోల్డ్'

### పాకిస్థాన్‌పై హ్యాట్రిక్ విజయం.. టీ20 ఫైనల్లో తిరుగులేని భారత్

**నగోయా :** అంతర్జాతీయ టీ20ల్లో చిరకాల ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయిస్తున్న భారత్ వరస విజయాలతో హ్యాట్రిక్ కొట్టింది. ఐసీసీ తొలిసారి ప్రవేశపెట్టిన పొట్టి ప్రపంచకప్ ఫైనల్ నుంచి నేటి ఆసియా క్రీడల్లో పసిడి పోరు వరకూ రెచ్చగొట్టేలా ప్రవర్తించే పాక్‌కు ఛాంపియన్ ఆటతో మెన్ ఇన్ బ్లూ గట్టి బుద్ధి చెప్పింది. శనివారం ఆసియా క్రీడల్లో జరిగిన ఫైనల్ పోరులో శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలోని భారత్ అదిరే ఆటతో పాకిస్థాన్‌ను ఓడించి వరసగా రెండో తరువాయి 12లో




## సముద్ర గర్భంలో 57 కొత్త జాతులు!



అర్జెంటీనా తీరానికి సమీపంలోని లోతైన సముద్ర ప్రాంతాల్లో శాస్త్రవేత్తలు నిర్వహించిన పరిశోధనలో 57 కొత్త సముద్ర జీవజాతులను గుర్తించారు. వీటితో పాటు ఇంతకుముందు శాస్త్రీయంగా నమోదు కాని ఐదు కొత్త జీవ వర్గాలను (జెనెరా) కూడా కనుగొన్నారు. ఈ పరిశోధన జరిగిన ప్రాంతంలో సముద్రపు అడుగున అత్యంత లోతైన లోయలు ఉన్నాయి. ఇవి భూమిపై కనిపించే లోయలను పోలి ఉంటాయిగానీ, సముద్ర గర్భంలో వేల మీటర్ల లోతులో ఉంటాయి. కొన్ని లోయలు అమెరికాలోని ప్రసిద్ధ 'గ్రాండ్ కాన్యాన్' కంటే దాదాపు రెండింతలు లోతుగా ఉన్నాయని పరిశోధకులు చెబుతున్నారు. ఈ లోతైన ప్రాంతాల్లో సూర్యకాంతి దాదాపు చేరదు. అయినప్పటికీ అక్కడ ప్రత్యేకమైన జీవులు జీవిస్తున్నాయి. వాటిలో కొన్ని పూర్తిగా కొత్త జాతులుగా శాస్త్రవేత్తలు గుర్తించారు. మన గ్రహం గురించి మనకు తెలిసింది ఇంకా చాలా తక్కువనీ, ముఖ్యంగా సముద్ర గర్భం ఇప్పటికీ భూమిపై అత్యంత రహస్యమైన జీవావరణాల్లో ఒకటిగా ఉందని ఈ పరిశోధన స్పష్టం చేస్తున్నది.

## రెండు తలల తాబేలు పిల్ల



అమెరికాలోని కేప్ కాడ్ ప్రాంతంలోని ఒక వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి ఇటీవల ఒక అత్యంత అరుదైన తాబేలు పిల్ల చేరింది. ఇది సాధారణ తాబేలు పిల్లలా కాకుండా రెండు తలలతో పుట్టిన 'డైమండ్‌బ్యాక్ టెరాపిన్' జాతికి చెందినది. ఈ విధమైన ప్రాణులను 'బైసెఫలీ' అంటారు. ఒకే శరీరానికి రెండు తలలు ఉండటం జన్యు అభివృద్ధిలో ఏర్పడే అరుదైన అసాధారణత. రెండు తలలు ఉన్న జంతువులు ప్రకృతిలో చాలా అరుదుగా కనిపిస్తాయి. ఈ చిన్న తాబేలు బరువు అమెరికా 'నికెల్ నాణెం' బరువుకు దాదాపు సమానంగా ఉండడం మరో విశేషం. అంటే అది ఎంత చిన్నదో ఊహించుకోవచ్చు. ఇలాం టి జన్యు లోపాలుగల జంతువులు సాధారణంగా ఎక్కువకాలం జీవించవు. రెండు తలల మధ్య కదలి క, ఆహారం తీసుకోవడం వంటి విషయాల్లో సమన్వయం అవసరం కావడం ఇందుకు ఒక కారణం. అందుకే సంరక్షణ కేంద్రంలో దీనిని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

## కత్తి పట్టుకున్న పీత!



అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన ఓ విచిత్ర ఘటన సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఓ వ్యక్తి తన కుక్కతో బయటకు వెళ్లిన సమయంలో ఒక పీత కనిపించింది. అయితే ఆ పీత తన పంజాలో చిన్న కత్తిని పట్టుకున్నట్లు ఉండడంతో అతను ఆశ్చర్యపోయాడు. ఈ దృశ్యాన్ని వీడియోగా చిత్రీకరించడంతో అది ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. పీత నిజంగానే కత్తిని ఉద్దేశపూర్వకంగా పట్టుకుందా, లేక సహజంగా తన పంజాలో చిక్కుకున్న వస్తువును పట్టుకుందా అనేది స్పష్టంగా తెలియదు. పీతలు తమ పంజాలతో వస్తువులను బలంగా పట్టుకోగలిగినప్పటికీ, మనుషుల మాదిరిగా వాటిని ఉపయోగించాలనే ఉద్దేశం వాటికి ఉందని చెప్పలేం. ఇదే సమయం లో అమెరికాలోని ఇతర ప్రాంతాల్లోనూ విచిత్ర ఘటనలు చోటుచేసుకున్నాయి. ఒక కారులోకి మూడు అడుగుల పొడవైన కొండచిలువ వెళ్లడంతో దాన్ని బయటకు తీయడానికి పోలీసులు కారులోని కొన్ని భాగాలను తొలగించాల్సి వచ్చింది. మరోచోట రోడ్డుపైకి పారిపోయిన పందిని పోలీసులు వెంబడించాల్సి వచ్చింది. ఇలాంటి సంఘటనలు ప్రమాదకరమైనవైనా, వాటి విచిత్రత కారణంగా సోషల్ మీడియాలో ప్రజలను ఆకట్టుకుంటున్నాయి.

## పురాతన డిఎన్ఎ ఆనవాళ్లు!



బొద్దింకలు, చెదపురుగుల జీనోమ్‌లను విశ్లేషించిన శాస్త్రవేత్తలు ఒక ఆసక్తికరమైన విషయాన్ని కనుగొన్నారు. ఈ కీటకాల శరీరాల్లో లక్షల సంవత్సరాలుగా నివసిస్తున్న బ్యాక్టీరియా నుంచి మొదట ఉద్భవించిన వేలాది డిఎన్ఎ ఆనవా ళ్లు వాటి జన్యు పదార్థంలో ఉన్నట్లు గుర్తించారు. ఈ అధ్యయనంలో అనేక జాతులకు చెందిన బొద్దింకలు, చెదపురుగులను పరిశీలించారు. వాటి క్రోమోజోమ్‌ల లో బ్యాక్టీరియా జన్యు పదార్థం విస్తృతంగా కలిసిపోయినట్లు గుర్తించారు. సూక్ష్మ జీవులు, జంతువుల మధ్య జన్యు పదార్థం మార్పిడి గతంలో భావించిన దానికంటే చాలా సాధారణంగా జరిగి ఉండవచ్చని ఈ పరిశోధన సూచిస్తోంది. ఈ పరిణామం వెనుక ఉన్న ప్రక్రియను 'క్షితిజ సమాంతర జన్యు బదిలీ' (హారిజాంటల్ జీన్ ట్రాన్స్‌ఫర్/ హెచ్‌జిటి) అంటారు. సాధారణంగా జన్యు పదార్థం తల్లిదండ్రుల నుంచి సంతానానికి సంక్రమిస్తుంది. దీనిని 'నిలువు జన్యు బదిలీ' (వర్టికల్ జీన్ ట్రాన్స్‌ఫర్/ విజిటి) అంటారు. అయితే హెచ్‌జిటిలో ఒక జీవి నుంచి దానికి సంబంధం లేని మరో జీవికి జన్యు పదార్థం బదిలీ అవుతుంది. బొద్దింకల శరీరాల్లో కొన్ని సహజీవి (సింబయోటిక్) బ్యాక్టీరియా ప్రత్యేక కణాల్లో దీర్ఘకాలం నివసిస్తాయి. ఈ బ్యాక్టీరియా తమ ఆతిథ్య జీవి కణజాలాలతో నిరంతరం పరస్పర చర్యలు జరుపుతుంటాయి. పరిణామక్రమంలో చాలాకాలం గడిచే కొద్దీ, ఈ బ్యాక్టీరియాకు చెందిన డిఎన్ఎలోని కొన్ని భాగాలు సాధారణ జీవసంబంధ పరిమితులను దాటి కీటకం యొక్క జీనోమ్‌లో కలిసిపోయి ఉండవచ్చు. ఒకసారి ఈ డిఎన్ఎ భాగాలు కీటకం జీనోమ్‌లో భాగమైతే, వాటిలో కొన్ని క్రియారహితంగా ఉండిపోవచ్చు. మరికొన్ని మాత్రం అవి చురుకుగా మారితాయి. అలాంటి సందర్భాలలో జీవక్రియ, రోగనిరోధక వ్యవస్థ లేదా పర్యావరణానికి అనుగుణంగా మారే సామర్థ్యం వంటి లక్షణాలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఈ పరిశోధన జన్యు స్థాయిలో పరిణామాన్ని మనం అర్థం చేసుకునే విధానాన్ని మరింత విస్తరిస్తుంది.

## మరుగుజ్జు జింక



మనుషుల్లో మరగుజ్జువాళ్లు ఉంటారని తెలుసు. కానీ, ఇతర జంతువుల్లోనూ ఈ లక్షణాలు ఉంటాయనడానికి ఇదో నిదర్శనం. నాలుగు యాపిళ్లను ఒకదానిపై ఒకటి పేర్చితే ఎంత ఎత్తు ఉంటుందో, దాదాపు అంతే ఎత్తున్న జింక కల్పితం కాదు. నిజంగానే అలాంటి జంతువు ఉంది. దాని జాతి పేరు 'పుడూ'. ఈ చిన్న జింక దక్షిణ అమెరికాలోని అడవుల్లో నివసిస్తుంది. పుడూ జాతుల్లో కొన్ని చాలా చిన్నవిగా ఉంటాయి. పుడూ భుజాల వరకు కేవలం 13 నుంచి 14 అంగుళాల ఎత్తు మాత్రమే ఉంటుంది. దీని బరువు కూడా సాధారణంగా కొన్ని పౌండ్లకు మించదు. అయితే, ఇంత చిన్న పరిమాణం దాని జీవన వాతావరణంలో ఒక పెద్ద ప్రయోజనంగా మారుతుంది. దట్టమైన పొదలు, గడ్డి, ఆకుల మధ్య ఇది సులభంగా కదలగలదు. పెద్ద జింకలకు దాటడం కష్టమైన అడ్డంకులను కూడా ఇది సులభంగా అధిగమించగలదు. అయితే ఇది జీవితాంతం పిల్ల జింకలా కనిపించదు. మగ పుడూలకు చిన్న కొమ్ములు పెరుగుతాయి. చిన్న వయసులో ఉన్న పుడూల శరీరంపై తెల్లటి మచ్చలు ఉంటాయి. ఆ మచ్చలు అడవిలోని దట్టమైన వృక్షసంపద మధ్య కలిసిపోయి, మాంసాహార జంతువుల కంటపడకుండా దాక్కోవడానికి సహాయపడతాయి. అన్నింటికంటే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఇంత చిన్నగా ఉన్నప్పటికీ వీటికి జింకలకు ఉండే అన్ని లక్షణాలూ ఉంటాయి.

– బిఎస్ఎస్ మైత్రేయి

# రాజకీయ సంఘర్షణగా 'ఓట్లు చోరీ' పోరాటం

ఓటరు జాబితాల 'ప్రత్యేక ముమ్మర సవరణ' (సర్) పేరుతో ఓట్ల తొలగింపు కార్యక్రమం పెద్ద ఎత్తున చేబట్టిన భారత ఎన్నికల కమిషన్, ముఖ్యంగా దాని ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్‌పై జరుగుతున్న పోరాటం కీలకమైన దశలోకి ప్రవేశించింది. ఆయన రాజీనామా, ఆయనను పనిముట్టుగా వాడుకుంటూ తమ పార్టీ రాజకీయ ప్రయోజనాలు కాపాడుకుంటున్న, విస్తరించుకుంటున్న ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా రాజీనామాను కోరుతూ గాంధీ జయంతి రోజున దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఢిల్లీ, ముంబయిలలో ప్రారంభమైన ఆందోళన వచ్చేవారం కొనసాగటంతోపాటు, సిఇసి, సర్‌లకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో, బొంబాయి తదితర హైకోర్టుల్లో దాఖలైన కేసులు కూడా విచారణకు రానున్నాయి. ఈ ఉక్కిరిబిక్కిరి వాతావరణంలో ఎన్నికల కమిషన్ తాము తొలగించిన ఓట్లను పునఃపరిశీలించి అర్హులను తిరిగి చేర్చటం, ఎందుకు తొలగించకూడదో ఇసి నుంచి నోటీసులు అందుకున్న లక్షలాది ఓటర్లు ఎన్నికల అధికారుల చుట్టూ తిరగకుండా, అధికారులే మళ్లీ ఇంటింటికి వెళ్లి వారి సమాచారం సేకరించి అర్హులను తిరిగి చేర్చటం వగైరా ఉత్తర్వులు జారీచేసింది. సర్ పూర్తి అయిన, కొనసాగుతున్న రాష్ట్రాల్లో 13 కోట్లకు పైగా ఓటర్ల పేర్లు తొలగించటం ఎన్నికల కమిషన్ ఒంటెత్తు పోకడలపై, దాని అధికారాలపై పెద్ద ఎత్తున ఆగ్రహ వ్యక్తీకరణకు దారితీసింది. అర్హులైన (వయోపరిమితి ప్రకారం) పౌరులందరినీ ఓటర్లుగా నమోదుచేసి, రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి ప్రాణం పోయటం, ఎన్నికలు 'సజావుగా, స్వేచ్ఛగా' నిర్వహించటం ఎన్నికల కమిషన్‌కు రాజ్యాంగం ఇచ్చిన ఆదేశం. ఏకపక్షంగా ఓట్లు తొలగించే అధికారం దానికి లేదు. ఎన్నికల నిర్వహణలో గతంలో ఎన్ని లోపాలున్నా దాని నిజాయితీ, నిష్పాక్షికత ఎన్నడూ ప్రశ్నించబడలేదు. జ్ఞానేశ్ కుమార్ సిఇసిగా నియామకం మొదలు, బిహార్‌లో తొలుత 'సర్' నిర్వహించిన తీరు అతను బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపణలకు దారితీసింది. ఇక పశ్చిమ బెంగాల్ సర్ సమయంలో ప్రవేశపెట్టిన 'లాజికల్ వ్యత్యాసాలు' అనే నియమం పదుల లక్షలమంది ఓట్ల తొలగింపునకు దారితీయటంతో రాజకీయ దుమారం బయలుదేరింది. 'మేము ముందుగా తీసేస్తాం – మీరు మీ పౌరసత్వాన్ని నిరూపించుకుని ఆ తర్వాత చేరండి' అని సిఇసి తీసుకున్న వైఖరి కమిషన్ నిర్ణయం కాదని, ఆయన ఏకపక్ష ఆదేశమని తోటి కమిషనర్‌లు అభ్యంతరాలు తెలిపినట్లు బట్టబయలు కావటం అగ్గి రగిల్చింది.

రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమించిన 'సర్' ప్రక్రియను ఎండగడుతూ, జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఇండియా కూటమి తలపెట్టిన ఆందోళన కార్యక్రమంలో రాజకీయ పక్షాలతోపాటు విద్యార్థి తదితర ప్రజాసంఘాలు, పౌర సమూహాలు చేరటంతో ఆందోళన పరిధి విస్తరించింది, జిల్లా కేంద్రాల వరకు నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. నీట్ పరీక్షా పత్రాల లీకేజిపై మోదీ ప్రభుత్వానికి చెమటలు పట్టించి, విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను సాధించిన జన్ జీ ఆందోళన, సిజెపి రాజకీయ వేదికగా సిఇసి రాజీనామా డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తోంది. జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేయటమంటే అది పరోక్షంగా మోదీ, అమిత్ షా రాజీనామాకు ఒత్తిడి చేయటమే. సిజెపి జంతర్‌మంతర్ ఆందోళన తదుపరి జన్ జీ తరాన్ని బుజ్జగించేందుకు ప్రధాని మొదలు యావత్ బిజెపి నాయకత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిన నేపథ్యంలో, సిఇసికి వ్యతిరేకంగా ఆరంభమైన ఆందోళనలో జన్ జీలు పాల్గొనటం బిజెపిని కలవరపెడుతోంది. అందుకనే, జ్ఞానేశ్ కుమార్‌ను గట్టిగా సమర్థించేందుకు, ప్రతిపక్షంపై ఎదురుదాడి చేసేందుకు 14మంది బిజెపి ముఖ్యమంత్రులను, టిడిపి వంటి మిత్రపక్షాల ముఖ్యమంత్రులను బిజెపి రంగంలోకి దించింది. సాధారణంగా అయితే సిఇసి వివాదం ప్రభుత్వానికి సంబంధించింది కాదు. చట్టం, నియామకాలు వంటి అంశాలు, లేదా ఫిర్యాదులు కోర్టు ముందుకు వచ్చినపుడు ప్రభుత్వం సిఇసికి సమర్థనగా వాదిస్తుంది. కాని ఇదొక ప్రజాస్వామ్య పరిరక్షణ సమస్యగా దేశం ముందుకు రావటంతో, దానివల్ల రాజకీయంగా తమకు ఉత్పన్నమయే ప్రమాదాన్ని గ్రహించి బిజెపి సిఇసి కొమ్ముగాస్తూ, ప్రతిపక్షంపై ఎదురుదాడి చేస్తోంది.

'సర్' ప్రక్రియ రాజ్యాంగబద్ధమేనని, ఇసికి ఆ అధికారం ఉందని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అడ్డంపెట్టుకుని సిఇసి సాగించిన ఏకపక్ష నియంతృత్వ నిర్ణయాలను సమర్థించుకుంటున్నారు. ఎన్నికల కమిషనర్‌ల నియామక చట్టం సహా, ప్రజాప్రాతినిధ్య చట్టం, కమిషన్ అధికారాలను సిఇసి తప్పుగా ఉపయోగించిన తీరు వగైరాలు న్యాయ సమీక్షకు రానున్నాయి. యావత్ రాజకీయ వ్యవస్థ విశ్వాసం చూరగొని తటస్థ అంపైర్‌లాగా నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాల్సిన జ్ఞానేశ్ కుమార్ నరేంద్రమోదీ చేతిలో పనిముట్టుగా ముద్రకు గురైనాడు.

రాజ్యాంగ సంస్థల స్వయం ప్రతిపత్తిని హరించి వాటిని చేతిలోకి తీసుకుంటున్న మోదీ–షా వ్యూహంలో ఎన్నికల కమిషన్ అత్యంత ప్రాధాన్యత గలది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో అధికారాన్ని బిజెపికి కట్టబెట్టిన ఆరోపణలకు గురైన సిఇసి కొనసాగితే ఎన్నికల్లో జనాదేశం ప్రతిఫలించదన్న భయం ప్రతిపక్షాల్లో ఉంది. సర్ పేరుతో పెద్ద ఎత్తున బడుగు బలహీన వర్గాల, దళితుల, మైనారిటీల ఓట్ల తొలగింపును ఆ పథకంలో భాగంగా చూస్తున్నాయి. దీన్ని అనుమతిస్తే ఏ పార్టీ గెలుస్తుంది, ఏ పార్టీ ఓటుతుంది అనే దానికన్నా రాజ్యాంగ నిర్దేశితమైన ప్రజాస్వామిక వ్యవస్థ ద్రోహానికి గురవుతుంది. ప్రజల చైతన్యం, పోరాటమే ప్రజాస్వామ్యానికి రక్ష. ●

# రెండు గీతాలు.. జాతీయవాదం... ఒక పరిశీలన



సంజయ్ హెగ్డే
సుప్రీం కోర్టు సీనియర్ అడ్వొకేట్

గాంధీజీ పుట్టినరోజున ఆయనకు పూలమాల వేయడం ఆనవాయితీ అయినప్పటికీ, ఈ సంవత్సరం మనం ఆయన మాటలను, ఆయన జీవించిన గీతాన్ని విందాం. గణతంత్ర రాజ్యం మరో గీతం గురించి చట్టంచేసి 10 నెలలు గడిపిన తరుణంలో, జాతీయవాదం అంటే ఏమిటి, ఏదీ జాతీయవాదం కాదు అనే వైరుధ్యం ఒక పాఠంగా నిలుస్తుంది.

గణతంత్ర రాజ్యం చట్టం చేసిన గీతం వందేమాతరం. జనవరి 2026లో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, అధికారిక కార్యక్రమాలలో జాతీయ గీతంలోని ఆరు చరణాలన్నింటినీ అందరూ సావధానం(అటెన్షన్)గా నిలబడి ఆలపించాలని ఆదేశించింది. జులైలో రెండవ ఉత్తర్వు ఆరు చరణాల పూర్తి పాఠాన్ని 'అధికారిక గీతం'గా ప్రకటించి, ఆ గీతాన్ని జాతీయ గేయం కంటే ముందు ఉంచింది.

'జాతీయ గౌరవానికి అవమానాల నివారణ చట్టం–1971'ను పార్లమెంటు సవరించి, జాతీయ గీతాన్ని మొదటిసారిగా క్రిమినల్ చట్ట పరిధిలోకి తీసుకువచ్చింది. ఉద్దేశపూర్వకంగా దానిని ఆలాపించకుండా అడ్డుకున్నా, లేదా దానిని ఆలపిస్తున్న సభకు అంతరాయం కలిగించినా తాజాగా మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించబడుతుంది.

సుప్రీంకోర్టు కర్ణాటక సంగీత విద్వాంసుడు, రచయిత టి.ఎం. కృష్ణ ఈ చట్టాన్ని, ఉత్తరువులను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సెప్టెంబర్ 22న సుప్రీం కోర్టు చేపట్టింది. అయితే, కోర్టు వెంటనే ఆ కేసును తేల్చలేదు. సమాధానం చెప్పమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. అయితే, గీతానికి రెండు చరణాలు ఉండాలా లేక ఆరు ఉండాలా అని ప్రభుత్వం నిర్ణయించవచ్చు కానీ, బిజో ఇమ్మాన్యుయేల్ (మత స్వేచ్ఛ, రాజ్యాంగ సహనం, నిశ్శబ్ద అభ్యంతరం వంటి హక్కులను సమర్థించే సుప్రీం కోర్టు తీర్పు) తీర్పు ఇప్పటికీ వర్తిస్తుందని జస్టిస్ జయమాల్య బాగ్చి అన్నారు. ఒక చరణానికి గానీ, అన్ని చరణాలకు గానీ మనస్సాక్షి ప్రకారం అభ్యంతరం తెలిపే వ్యక్తి, ఆ కార్యక్రమం సందర్భంలో గౌరవంగా నిలబడి, పాడకుండా ఉన్నా, వారు ఎలాంటి క్రిమినల్ పరిణామాలను ఎదుర్కోరు అని జస్టిస్ బాగ్చి అభిప్రాయ పడ్డారు. అయితే ఆయన అభిప్రాయం ఇంకా తీర్పుగా వెలువడలేదు కానీ అది వెలువడాలని ఆశిస్తున్నాము. అదే రోజు ఉదయం జాతీయ ఏకాభిప్రాయం కోసం చేసిన విజ్ఞప్తికి సొలిసిటర్ జనరల్ సమాధానమిస్తూ నక్సలైట్ భావాలను చట్టం తయారీ ప్రక్రియ అనుసరించదన్నారు. మరో విషయం నిమిత్తం కోర్టుకు హాజరైన ఈ రచయిత, ఆలోచించడం అంటే నక్సలైట్ కావడం కాదని చెప్పారు. ఇక్కడ చర్చించిన రెండు జాతీయవాదాలను ఇది క్రోడీకరిస్తుంది కాబట్టే ఈ సంఘటనకు ప్రాముఖ్యత ఉంది. ఒకటి వాదనకు సమాధానమిస్తుంది, మరొకటి వాదించే వ్యక్తికి కొత్త పేరు పెడుతుంది.

### వందేమాతరం

ఈ గీతంలోని ఆరు చరణాలను మనం నిశితంగా పరిశీలిద్దాం. బంకిమ్ చంద్ర చటర్జీ మొదటి రెండు చరణాలను సుమారు 1875 ప్రాంతంలో, తన పత్రికలో ఖాళీని పూరించడానికి రాశారని చెబుతారు. అవి పుష్కలంగా నీరు, సమృద్ధితో, దక్షిణపు గాలులతో చల్లగా ఉండే ఒక భౌగోళిక ప్రదేశం ప్రకృతి సౌందర్యాన్ని కీర్తిస్తాయి. ఏ మతానికి చెందిన ఏ భారతీయుడైనా తన దేశం గురించి ఈ చరణాలను పాడగలరు.

తరువాత చరణాలు ఆయన రాసిన 'ఆనందమఠ్' నవలతో పాటు వచ్చాయి. అవి కొన్ని పేర్లను ప్రస్తావిస్తాయి. మాతృభూమి తన పది ఆయుధాలతో దుర్గగా, లక్ష్మిగా, సరస్వతిగా మారుతుంది. ఇది రెండు పాటలను కలిపి కుట్టినట్లు ఉంటుంది. 1905లో బెంగాల్ విభజన 'స్వదేశీ' అనే రణ నినాదాన్ని ప్రారంభించినప్పటి నుండి ఈ విభజన మన రాజకీయాల్లో కొనసాగుతూనే ఉంది.

స్వాతంత్ర్య ఉద్యమం ఈ సమస్యను నిక్కచ్చిగా పరిష్కరించింది. 1937 అక్టోబర్‌లో రాజేంద్ర ప్రసాద్ ప్రవేశపెట్టి, వల్లభ్ భాయ్ పటేల్ బలపరిచిన ఒక తీర్మానంపై, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తరువాత చరణాలపై ముస్లింలు, ఇతరుల అభ్యంతరాల ప్రామాణికతను అంగీకరించి, జాతీయ సభలకోసం మొదటి రెండు చరణాలను మాత్రమే స్వీకరించిం ది.

ఈ గీతానికి మొదట సంగీతం సమకూర్చిన రవీంద్రనాథ్ ఠాగోర్, ఈ మార్పును ఆశీర్వదించారు. ఆయన ప్రారంభ చరణాలను ప్రేమించి, ఆ తర్వాత వచ్చే మత సిద్ధాంతాన్ని తిరస్కరించారు.

భారతదేశపు మొదటి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ 1950 జనవరి 24న జన గణ మన జాతీయ గేయంగా ఉంటుందని, వందేమాతరం కూడా 'సమానంగా గౌరవించబడుతుందని' ప్రకటించారు. గౌరవం అనేది ఒక బాధ్యత కాదు. 55 సంవత్సరాల పాటు చట్టం జాతీయ జెండాను, రాజ్యాంగాన్ని, జాతీయ గీతాన్ని రక్షించి, ఉద్దేశపూర్వకంగా గీతాన్ని శిక్షా వలయం వెలుపల ఉంచింది. గీతంపై ప్రేమను ఆహ్వానించారు కానీ విధేయతను ఎన్నడూ కోరలేదు.

అంతేకాకుండా, రెండు చరణాలతో కూడిన ఈ పరిష్కారం బంకింకు ఏమాత్రం అవమానం కాదు. లక్ష శ్లోకాలున్న మహాభారతంలో ఏడు వందల శ్లోకాలే భగవద్గీత. ఠాగోర్ రచించిన ఐదు చరణాలలో మొదటిది మన జాతీయ గీతం ఒక రచనను ప్రజా ప్రయోజనానికి అనుగుణంగా మలచడం అనేది గౌరవించడమే కానీ అవమానించడం కాదు.

ఈ పరిష్కారం ఫలించింది. హిందువుగా జన్మించి ఇస్లాంను స్వీకరించిన ఎ.ఆర్.రెహమాన్ 1997లో 'వందేమాతరం' గీతాన్ని 'మా తుఝే సలామ్'గా కొత్తగా ఆవిష్కరించారు. 40 ఏళ్ల లోపు వయసున్న ఎవరినైనా 'వందేమాతరం' పాడమని అడిగితే, మీరు రెహమాన్ శైలిలోనే దాన్ని వింటారు. 1937, 1950, 1997 నాటి ఆ పరిష్కారాలనే ప్రస్తుత ఉత్తర్వులు, చట్టాలు తిరిగి తెరపైకి తెచ్చాయి. ఇప్పుడు సుప్రీం కోర్టు వాటిని సముచితంగానే తిరిగి దేశానికి, మనకు అప్పగించింది.

### మరో గీతం

బంకిమ్‌కు ఐదు శతాబ్దాల ముందు, జునాగఢ్‌కు చెందిన నరసింహ మెహతా 'అంటరానివారి' మధ్య పాటలు పాడినందుకు తన సొంత కులం చేతనే బహిష్కరించబడ్డాడు.

ఆయన 'వైష్ణవ జన తో తేనే కహియే, జే పీడ్ పరై జానే రే' (ఎవడైతే ఇతరుల బాధను తనదిగా భావిస్తాడో, అతన్నే దైవపురుషుడు అని పిలవాలి) అనే గీతాన్ని రచించాడు. ఆ గీతానికి ఎల్లలు లేవు, శత్రువు లేడు, సింహాసనం లేదు. అది ఒక మనిషిని సమీక్షిస్తుంది. ఆ మనిషి గర్వం లేకుండా సేవ చేసేవాడు, అందరికీ తలవంచి ఎవరినీ కించపరచనివాడు, మాట, చేత, ఆలోచన అనేవాటిని ఒకే దారిలో ఉంచేవాడు, అందరినీ సమాన దృష్టితో చూసేవాడు, అబద్ధం చెప్పనివాడు, తనది కాని సంపదను ముట్టుకోనివాడు, ప్రతి మహిళను గౌరవించేవాడు, మోసం, కామం, కోపం వంటివాటిని విడిచిపెట్టినవాడు.

దీనిని రాజ్యాంగం ఎదురుగా చదివితే, నరసింహ మెహతా రాజ్యాంగ పీఠిక రూపాన్ని ముందుగానే రచించి, దానికి సంగీతం సమకూర్చాడని మీకు అర్థమవుతుంది.

ఇతరుల బాధను అనుభూతి చెందడమే వ్యక్తి గౌరవాన్ని నిలబెట్టే సౌభ్రాతృత్వం. అందరికీ తలవంచడమే14 అధికరణ. అందరినీ సమానంగా చూడటమే మన లౌకికవాదం, ఇతరుల సంపదను తిరస్కరించే హస్తమే సత్యసంధత సూత్రం. అబద్ధం చెప్పని నాలుకే 51ఎ అధికరణలోని విజ్ఞానవంతుడైన పౌరుడు. గాంధీ గారు ఖురాన్, క్రైస్తవ కీర్తనలతో పాటు దీనిని సబర్మతి నుంచి తన చివరి ప్రార్థనా సభ వరకు తీసుకువెళ్లారు. వంద సంవత్సరాలలో దీని కారణంగా ఎవరూ తాము మినహాయించబడినట్లు భావించలేదు.

వందేమాతరం మీ నిలకడను పరీక్షిస్తుంది; వైష్ణవ జనతో మీ ప్రవర్తనను పరీక్షిస్తుంది. అయితే, ఇక్కడ రెండు గీతాలు, రెండు జాతీయవాదాలు ఉన్నాయి. ఒకటి మట్టిని పూజిస్తూ పౌరుడిని దానికి తలవంచమని కోరుతుంది. మరొకటి ఆత్మను నాగరికంగా తీర్చిదిద్దుతూ పౌరులను యోగ్యులుగా ఉండమని కోరుతుంది. ఒకటి ఇప్పుడు ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్‌తో వస్తుంది. మరొకదానికి ఎన్నడూ అతని అవసరం రాలేదు.

### ఒక వినయపూర్వకమైన ప్రతిపాదన

కాబట్టి, గాంధీ జయంతి సందర్భంగా ఇదొక ప్రతిపాదన. మనకు చట్టబద్ధ రక్షణ కలిగిన జాతీయ గీతం, వాడుకలో గౌరవించబడే జాతీయ గేయం ఉన్నాయి. 2026 నాటి బలప్రయోగ పద్ధతిలో కాకుండా, 1950లో అనుసరించిన సౌమ్యమైన పద్ధతి ద్వారా వైష్ణవ జనతోను మన జాతీయ ప్రార్థనగా గణతంత్ర రాజ్యం గుర్తించాలి. ఎటువంటి ఉత్తర్వులు, జరిమానాలు, నిర్బంధ హోదా ఉండకూడదు. కేవలం గుర్తింపు మాత్రమే, తప్పనిసరి నిబంధన ఏదీ ఉండకూడదు. జాతీయ గేయం పాడే చోట, కోరుకున్నవారు దీనిని కూడా పాడనీయండి.

పాఠశాల విద్యార్థులు ప్రతి భాషలోనూ దీని అర్థాన్ని నేర్చుకోవాలి. బలవంతంగా చేయించిన ప్రార్థన అసలు ప్రార్థనే కాదు. అసలు విషయం అదే. బంకిమ్ తన మూడవ చరణంలో 'సప్త కోటి కంఠ' అని లెక్కించారు. అంటే, అవిభక్త బెంగాల్ అయిన తన మాతృభూమిలోని ఏడు కోట్ల గొంతులు అని. 1905లో సరళా దేవి దానిని ముప్పై కోట్లుగా పాడారు, అప్పుడు ఆ మాతృభూమి భారతదేశంగా మారింది. నేడు మనం 140 కోట్ల మందిమి, ప్రతి కోటి కూడా చేర్పు ద్వారానే ఏర్పడింది; ఏదీ బలవంతంగా కాదు.

140 కోట్లమందితో కూడిన గాయక బృందాన్ని లాఠీతో నడిపించలేరు. అంతటి పెద్ద కచ్చేరిలో, ఆ పాట తమదేనన్న భావనను ప్రతి ఒక్కరిలోనూ కలిగించడం ద్వారా గాయకుల సంసిద్ధతను గెలుచుకోవడమే నిర్వాహకుడి(కండక్టర్) చేతిలో ఉన్న ఏకైక వాయిద్యం. అందరినీ కలుపుకోవడం అనేది అతి జాగ్రత్తపడేవారికి ఇచ్చే రాయితీ కాదు. అది మెరుగైన బాణీ. మనమందరం ఒకే విధంగా పూజలు చేయాలని రాజ్యాంగం కోరదు. మనం 140 కోట్ల మందిమి సమాన పౌరులుగా ఉండాలని అది కోరుతుంది. ప్రతి ఒక్కరూ మన పాటనే పాడాలని పట్టుబట్టకుండా, ప్రతి ఒక్కరూ పౌరసత్వంలో వైష్ణవ జనుడిగా మారాలని ప్రార్థించడం మనకు మేలు. సావధానం(అటెన్షన్)గా నిలబడేందుకు 90 సెకన్లు పడుతుంది. ఇతరుల బాధను అనుభవించడానికి జీవితకాలం పడుతుంది. దేశాన్ని నిర్మించేది అదేగాని సావధానంగా నిలబడటం కాదు.

*(ది హిందూ సౌజన్యంతో – 2.10.26)*

# జనం మనిషి 'చలసాని'

విప్లవం ఆయన సొంత ఊరు...ఉద్యమం ఆయన ఇంటిపేరు... సమసమాజ నిర్మాణమే ఆయన ధ్యేయం...నవ సమాజ చైతన్యమే ఆయన లక్ష్యం. నిండు నూరేళ్ల వయసులోనూ పేదప్రజల అభ్యున్నతే ఆయన తలంపు. సహృదయత, నిరాడంబరత, వినమ్రత ఈ మూడు స్వాభావిక లక్షణాలకు కమ్యూనిస్టు నిబద్ధత తోడైతే ఎలా ఉంటుందో చెప్పడానికి చక్కనైనా ఉదాహరణే ఆయన. ఆయన ఎవరోకాదు రెండు తెలుగు రాష్ట్రాలలో అత్యంత సీనియర్ కమ్యూనిస్టు చలసాని జగన్నాథరావు. భూమి కోసం, భుక్తి కోసం, శ్రమ జీవుల అభ్యున్నతి కోసం నూరేళ్ల జీవితంలో ఎనిమిది దశాబ్దాలకుపైగా అవిశ్రాంతంగా పోరాడిన ఉత్తమ కమ్యూనిస్టు. చిత్తశుద్ధి, నిబద్ధత, నిస్వార్థతకు ఆయన నమూనా. ఆయనది అత్యంత సాధారణమైన జీవన శైలి, నిరాడంబరతకు మారు పేరు. ఆయన వ్యక్తిత్వం భావితరాలకు ఆదర్శప్రాయం, స్ఫూర్తిదాయకం. కమ్యూనిస్టు నైతిక విలువలకు ఆయన సజీవమైన నిలువుటద్దం. అట్టడుగు వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన కృషి, ఆచరించిన కమ్యూనిస్టు నైతిక విలువలు నేటి తరానికి పునరుత్తేజం కలిగిస్తాయి. భూస్వామ్య వ్యవస్థ భూస్థాపితం కావాలి. దోపిడీ పీడన పీచమణచాలి. సమసమాజాన్ని సృష్టించే విప్లవం వర్ధిల్లాలి అన్న దృఢసంకల్పంతో చలసాని జగన్నాథరావు మొక్కవోని దీక్షతో పనిచేశారు. పల్లెల్లో ఫ్యూడల్ రాక్షసత్వాన్ని అంతంచేయాలి...పేద ప్రజలు, రైతులకు అండగా నిలబడాలన్నదే ఆయన లక్ష్యం, ఆ లక్ష్య సాధనకు అలుపెరగని పోరు సల్పారు. నేడు ఉమ్మడి కృష్ణా జిల్లా ముఖ్యంగా నూజివీడు ప్రాంతం, ఇతర ప్రాంతాలలో వేలాది మంది సొంత గూడులో నివసిస్తున్నారంటే, బంజరు, అటవీబంజరు, పోడు భూములను సాగుచేసుకుంటున్నారంటే ఆ అవిశ్రాంత పోరాట ఫలితమే. 1948–51 మధ్య అజ్ఞాత జీవితం గడిపి సాయుధ దళంలో సభ్యునిగా ఉన్నారు. అనేకసార్లు తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.



మహత్తర పోరాట చరిత్ర కలిగిన చలసాని జగన్నాథరావు త్వరలో 100 ఏళ్లు పూర్తి చేసుకోనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శత వసంతోత్సవం అక్టోబరు 4 (ఆదివారం) నూజివీడు లో జరుగుతున్న సందర్భంగా "మంచి కమ్యూనిస్టు ఎలా ఉండాలి అంటే జగన్నాథరావులా" అనేలా ఆచరణవాదిగా నిలిచిన ఆ విప్లవకారుడి గురించి క్లుప్తంగా తెలుసుకుం దాం.

**జీవిత విశేషాలు:** భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిన 17మాసాల తరువాత ఆయన జన్మించారు. నూజివీడు తాలూకా అన్నవరం శివారు వెంకటాద్రి పురం గ్రామంలో చలసాని వెంకట్రామయ్య, వెంకట నర్సమ్మ 7వ సంతానంగా 1927లో చలసాని జగన్నాథ రావు జన్మించారు. వీరిది వ్యవసాయ కుటుంబం. తన రెండో సోదరుడు స్వాతంత్ర్య సమరయోధుడు చలసాని రాజగోపాలరావు స్ఫూర్తితో చలసాని జగన్నాథరావు 1946 ఏప్రిల్ 24న నూజివీడు తాలూకా అన్నవరం గ్రామ శాఖలో పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఆయన పార్టీ సభ్యత్వం స్వీకరించి ఇప్పటికి 80 సంవత్సరాల 5 మాసాలు గడిచింది. నూరేళ్ల వయస్సులో సైతం ఈయన క్రమం తప్పకుండా విశాలాంధ్ర పత్రిక చదువుతారు. విశాలాంధ్ర పుట్టిన 1952 నుంచి విశాలాంధ్ర పత్రిక చందాదారులు. కమ్యూనిస్టు పార్టీ అన్నవరం గ్రామ శాఖ కార్యదర్శితో ప్రారంభించి, తాలూకా పార్టీ కార్యదర్శిగా, జిల్లా కార్యవర్గ, కార్యదర్శివర్గ సభ్యునిగా, పాతికేళ్ల పాటు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యునిగా, కొంతకాలం రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శిగాను జగన్నాథరావు పనిచేశారు. కృష్ణా జిల్లా రైతు సంఘం అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర రైతు సంఘంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. జగన్నాథరావు తాను కమ్యూనిస్టుగా పార్టీకి అంకితం కావటమే కాకుండా తన భార్య, పిల్లలను సైతం పార్టీ హోల్‌టైమర్లుగా తీర్చిదిద్దారు. ఆయన భార్య చలసాని జయప్రద కొద్ది సంవత్సరాల క్రితం మృతి చెందారు. అయన ప్రస్తుతం నూజివీడు పట్టణంలోని వారి స్వగృహంలో పెద్ద కుమారుడు, కమ్యూనిజం మాసపత్రిక సంపాదకుడు చలసాని వెంకట రామారావు, కృష్ణ తులసి దంపతుల సంరక్షణలో ఉన్నారు.

**భూమి కోసం – భుక్తి కోసం:** అంటరానితనం, పెత్తందార్ల రాజ్యం, దళితులు గ్రామంలోకి రాకుండా కట్టడి చేసే, వూరు బావుల్లో నీళ్ల తెచ్చుకోనివ్వకపోవడానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో పాల్గొన్నారు. కొన్ని గ్రామాలలో మొఖాసాదార్లదే పెత్తనం. వారు చెప్పిందే వేదం. గ్రామంలో హరిజనులు చెప్పులతో వెళ్లరాదు. చుట్ట తాగటం, తలగుడ్డ చుట్టుకోవటం కూడా నేరమే. రైతుల దొడ్లలోని చింత, మునగ చెట్లపైన హక్కు మోఖాసాదార్లదే. ఫలసాయం వారే తీసుకువెళ్లేవారు. మోఖాసాదార్ల కచేరీ ముందు ఎవరు గొడుగు, చెప్పులు వేసుకువెళ్లకూడదు. వారి పొలం తడిస్తేనే రైతుల పొలాలకు నీళ్లు ఇచ్చేవారు. వారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి జీవించాలి అనే ధోరణిని తీవ్రంగా ప్రతిఘటించారు. నిర్బంధ శిస్తు వసూళ్లను వ్యతిరేకించారు. ఫ్యూడల్ జమిందారుల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నూజివీడు ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ 'దున్నేవాడికే భూమి' నినాదంతో భూమి కోసం భుక్తి కోసం ఉద్యమాలను ప్రారంభించింది. 1955 నుంచి సీపీఐ అగ్రనాయకులు అమరజీవి దాసరి నాగభూషణరావు నేతృత్వంలో సాగిన భూమి పంపిణీ కార్యక్రమాలన్నింటిలో జగన్నాథరావు అగ్రభాగంలో నిలిచారు. ఈ భూమి పంపిణీ కార్యక్రమం 1962 నుంచి దశాబ్దాల కాలం పాటు నిరంతరాయంగా కొనసాగింది. ఈ క్రమంలో తాలూకా పార్టీ జగన్నాథరావు నేతత్వంలో 20 వేలకు పైగా ఎకరాల బంజరు భూములను పేదలకు పంపిణీ చేసి, అందులో రెండు దఫాలుగా 14 వేల ఎకరాలకు పట్టాలు సాధించారు. ఈ పోరాటంలో రోజుల తరబడి సత్యాగ్రహాలు నిర్వహించారు, ఈ క్రమంలో అనేకసార్లు అరెస్టులు, లాఠీ చార్జీలు జరిగాయి. దిగవల్లి ఖండ్రికలోఎలమర్రు ఎస్టేట్ ఈనాం భూముల కౌలుదార్ల పోరాటాన్ని ప్రారంభించి 50 ఎకరాల భూమి పంపిణీ చేశారు. దాసరితోసహా అనేకమందిపై కేసులు పెట్టినా చివరకు జమీందారు రాజీకి వచ్చి భూమిని పేదలకు వదిలివేశారు. తాలూకాలోని సుమారు 50కి పైగా గ్రామాలలో 25 వేల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేశారు. ఈ భూముల గుండా నాగార్జునసాగర్ నీళ్లు సైతం నేడు పారుతున్నాయి.

సిపిఐ పంచిపెట్టిన భూముల ద్వారా నేడు పేద రైతులు ఒక్కో గ్రామంలో కోట్ల రూపాయల ఆదా యం పొందుతున్నారు. బంజరు భూముల పోరాటం ద్వారా కమ్యూనిస్టు పార్టీ వేలాది కూలి కుటుంబాలను రైతులుగా మార్చింది. తొలి రోజుల్లో జమీందారీ, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు, రెండవ దశలో బంజరు భూముల పంపిణీ, అదనపు శిస్తు వ్యతిరేక సత్యాగ్రహ పోరాటం, తరువాత 1980 దశకంలో చెట్టు పట్టాల సాధనకై ఉద్యమం, 1990వ దశకంలో వన సంరక్షణ సమితులకై బంజరు పోరాటం నడిచిం ది.

మోదుమూడి మురళీకృష్ణ

# మెట్రో, ఆర్‌టిసి కామన్ పాస్‌తో నగర ప్రయాణం ఈజీ

**'సీమ్‌లెస్' ప్రయాణాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యం : డిప్యూటీ సిఎం భట్టి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో ప్రజా రవాణాను మరింత సౌకర్యవంతంగా మార్చే లక్ష్యంతో మెట్రో ఆర్‌టిసి సేవలను అనుసంధానం చేస్తూ ప్రవేశపెట్టిన కామన్ పాస్ వినియోగాన్ని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్వయంగా పరిశీలించారు. బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు మెట్రోలో, అక్కడి నుంచి సెక్రటేరియట్ వరకు ఆర్‌టిసి బస్సులో మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రయాణించారు. ప్రయాణ సమయంలో ప్రయాణికులతో మాట్లాడిన భట్టి విక్రమార్క.. కామన్ పాస్ వినియోగం, మెట్రో నుంచి బస్సుకు మారే సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రయాణ సౌకర్యంపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఒకే పాస్‌తో మెట్రో, ఆర్‌టిసి సేవలను వినియోగించుకోవడం వల్ల సమయం, శ్రమ ఆదా అవుతోందని ప్రయాణికులు తెలిపారు.

**భవిష్యత్‌లో ఆటోలు, ఊబర్ వంటి రవాణా సేవల అనుసంధానం..**

కామన్ పాస్ విధానం ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. మెట్రో నుంచి దిగిన తర్వాత ఇల్లు, కార్యాలయం లేదా ఇతర గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఆర్‌టిసి బస్సు సేవలు అందుబాటులో ఉండటంతో ప్రయాణం సులభతరమవుతుందన్నారు. ప్రజా రవాణాలోని వివిధ మార్గాలను అనుసంధానం చేసి 'సీమ్‌లెస్' ప్రయాణాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భవిష్యత్‌లో ఆటోలు, ఊబర్ వంటి ఇతర రవాణా సేవలను కూడా అనుసంధానించే దిశగా ఆలోచిస్తున్నట్లు చెప్పారు.

**ప్రజా రవాణాను బలోపేతం చేస్తాం : మంత్రి పొన్నం ప్రభాకర్**

ఆర్‌టిసి మెట్రో కామన్ పాస్‌తో ప్రయాణికులకు సమయం, శ్రమతో పాటు ఖర్చు కూడా ఆదా అవుతుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు ప్రజా రవాణాను బలోపేతం చేయడం కీలకమన్నారు. ప్రయాణికుల నుంచి వచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకుని కామన్ పాస్ సేవలను మరింత మెరుగుపరుస్తామని చెప్పారు. డిప్యూటీ సిఎంతో కలిసి మంత్రులు వివేక్ వెంకటస్వామి, మహ్మద్ అజారుద్దీన్, ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీగణేష్, నవీన్ యాదవ్, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు ఎన్.వి.ఎస్.రెడ్డి, మెట్రో ఎండి సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండి బి.అజిత్‌రెడ్డి, ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డి తదితరులు ప్రయాణించారు.

# ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉస్మానియా ఆసుపత్రి, వరంగల్ సూపర్ స్పెషాలిటీ, ఎల్‌బి నగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఆసుపత్రులకు సంబంధించి వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాలను గుర్తించి నియామక ప్రక్రియను కూడా మొదలుపెట్టాలని చెప్పారు. రాష్ట్రంలో విద్య, వైద్యానికి సంబంధించిన క్షేత్రస్థాయి పరిస్థితులపై ముఖ్యమంత్రి జూబ్లీహిల్స్ నివాసంలో సిఎంఒ అధికారులతో జరిగిన సమావేశంలో పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆసుపత్రుల నిర్మాణం, వాటి పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి సిబ్బంది కొరత లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. నిర్మాణాలు పూర్తయ్యేనాటికి ఆసుపత్రుల్లో అవసరమైన అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేసి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని చెప్పారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూడాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, ఆసుపత్రులను విధిగా సందర్శించాలని స్పష్టం చేశారు. జిల్లా స్థాయిలో ప్రతి వారం వీటిపై సమీక్ష నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాలల్లో అవసరమైన చోట మరమ్మతు పనులను చేపట్టాలని తెలిపారు. డిసెంబర్‌లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపైనా సమావేశంలో చర్చించారు. సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పెట్టుబడుల విషయంలో పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. త్వరలోనే ఏర్పాట్లను పరిశీలిస్తానని సిఎం స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపి వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె.రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రాష్ట్ర డిజిపి సి.వి.ఆనంద్‌తో పాటు సిఎంఒ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తికి తుది కసరత్తు

- జలాశయ పనులు 98 శాతం పూర్తి
- అనుమతులు, భూసేకరణ, కాలువలపై ప్రత్యేక దృష్టి
- రూ.1,343.59 కోట్లు ఖర్చు..
- మరో రూ.114.389 కోట్లు అవసరం : మంత్రి ఉత్తమ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి వచ్చే సాగు సీజన్‌లో రైతులకు నీరందించేలా పనులను వేగవంతం చేయాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టు ద్వారా 1.06 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు చర్యలు వేగవంతం చేయాలని ఉత్తమ్ సూచించారు. జలాశయ నిర్మాణ పనులు దాదాపు 98 శాతం పూర్తయ్యాయని, ఇప్పటివరకు రూ.1,343.59 కోట్లు ఖర్చు కాగా, పూర్తి చేసేందుకు మరో రూ.114.389 కోట్లు అవసరమని అధికారులు తెలిపారు. జలాశయానికి అవసరమైన 3,870 ఎకరాల్లో 3,850 ఎకరాలు సేకరించినట్లు మంత్రి వెల్లడించారు. మిగిలిన భూసేకరణ, పరిహారం, పునరావాస సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. పర్యావరణ అనుమతుల అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉత్తమ్ సూచించారు. అక్టోబర్ 8న జరగనున్న పర్యావరణ అనుమతి ప్రతిపాదన పరిశీలనకు అవసరమైన పత్రాలను సిద్ధం చేయాలని, అక్టోబర్ 16న ఎన్‌జిటిలో జరిగే విచారణకు తాజా రికార్డులు సమర్పించాలని ఆదేశించారు. జలాశయం పూర్తయినంత మాత్రాన సరిపోదని, రైతుల పొలాలకు నీరు చేరేందుకు ప్రధాన, పంపిణీ కాలువల పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. కాలువల భూసేకరణ, అంచనాలు, టెండర్లకు స్పష్టమైన గడువులు నిర్ణయించాలని సూచించారు. పనుల్లో ఆర్థిక, పరిపాలన, న్యాయపరమైన అడ్డంకులు ఉంటే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. సమీక్షలో మహబూబాబాద్ ఎంపి బలరాం నాయక్, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ. శ్రీధర్, భూసేకరణపునరావాస కమిషనర్ శివకుమార్ నాయుడు, ఇఎన్‌సిలు రమేష్‌బాబు, మధుసూదన్ రావు, జాయింట్ సెక్రటరీ కె.శ్రీనివాస్‌తో పాటు సంబంధిత జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

# శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికుల ఐక్య సమరం

**హక్కుల పరిరక్షణకు పోరాటాలు ఉధృతం చేయాలి : ఎం.నరసింహ**




**ప్రజాపక్షం/హైదరాబాద్:** శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికవర్గం ఐక్యంగా పోరాడాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత పరిరక్షణ కోసం పోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (డబ్ల్యుఎఫ్‌టియు) 81వ వార్షికోత్సవం(అంతర్జాతీయ పోరాట దినోత్సవం) సందర్భంగా ఎఐటియుసి, సిఐటియు, ఎఐయుటియుసి ఆధ్వర్యంలో శనివారం నారాయణగూడ చౌరస్తా వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించి, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎం.నరసింహ మాట్లాడుతూ 1945 అక్టోబర్ 3న ఏర్పాటైన డబ్ల్యుఎఫ్‌టియు ప్రపంచ శాంతి, కార్మికుల ఐక్యత, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతోందని తెలిపారు. 'హైర్ అండ్ ఫైర్' విధానంతో ఉద్యోగ భద్రత లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించి, కార్మికులకు ఉపాధి, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

డబ్ల్యుఎఫ్‌టియు పిలుపు స్ఫూర్తితో కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించాలని, ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ పోరాటాలకు సన్నద్ధం కావాలని ఎం.నరసింహ కోరారు. సిఐటియు ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పాటు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్నా.. వాటిని పెట్టుబడిదారులు తమ ప్రయోజనాలకు వినియోగించుకుంటూ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటిత ఉద్యమాలే మార్గమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు బి. వెంకటేష్, ఉపాధ్యక్షులు ఎం.ప్రవీణ్ కుమార్, కార్యదర్శి హసీనా బేగం, జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, అధ్యక్షులు బొడ్డుపల్లి కిషన్, నాయకులు సిహెచ్.శ్రీనివాస్, ఎన్. శ్రీకాంత్, కొమరెల్లి బాబు, ఎ.పార్వతి, జి.నర్సయ్య, రవి కిషోర్, ఉమర్ ఖాన్, సిఐటియు నుండి జె.వెంకటేష్, భూపాల్, విజయలక్ష్మి, కుమారస్వామి, దశరత్, ఎఐయుటియుసి నుండి భరత్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

# ప్రతిభకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదు

**ఉచిత ఆన్‌లైన్ కోచింగ్‌తో నిరుద్యోగ యువత కలలు సాకారం : మంత్రి పొంగులేటి**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని నిరుద్యోగ యువత కలలను సాకారం చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా నాణ్యమైన కోచింగ్‌కు దూరం కాకూడదనే ఉద్దేశంతో పిఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక్కో అభ్యర్థికి సుమారు రూ.40 వేల విలువైన ఆన్‌లైన్ కోచింగ్ యాక్సెస్‌ను ఉచితంగా అందించనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న ప్రతిభావంతులైన యువతలో చాలామంది కోచింగ్ ఫీజులు, హాస్టల్ ఖర్చులు భరించే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారని, తమ గ్రామాలు, పట్టణాల్లోనే ఉంటూ ప్రముఖ కోచింగ్ సంస్థల ద్వారా శిక్షణ పొందే అవకాశం కల్పించాలని నిరుద్యోగ జెఎసి నాయకులు మంత్రిని కోరారు. వారి విజ్ఞప్తిపై వెంటనే స్పందించిన మంత్రి, ప్రతిభ ఆర్థిక పరిస్థితుల కారణంగా వెనుకబడకూడదనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగాల అభ్యర్థుల్లో ఆదరణ పొందిన ఆర్‌సి ఎగ్జామ్స్ కోచింగ్ సంస్థకు చెందిన ఆన్‌లైన్ క్లాసులు, మాక్ టెస్టుల యాక్సెస్‌ను పిఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ నెల 28వ తేదీ నుంచి ఈ సదుపాయాన్ని ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో ఎస్‌ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం పిఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నామని, అదే తరహా కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలన్న నిరుద్యోగ యువత విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పారు. ఈ ఆన్‌లైన్ కోర్సులో ఎస్‌ఐ, కానిస్టేబుల్, గ్రూప్1 ప్రిలిమ్స్, గ్రూప్2, గ్రూప్3, గ్రూప్4, పంచాయతీ కార్యదర్శి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, రైల్వేతో పాటు ఇతర పోటీ పరీక్షలకు సంబంధించిన జనరల్ స్టడీస్ పాఠాలు, ప్రాక్టీస్ టెస్టులు అందుబాటులో ఉంటాయన్నారు. ఒకసారి నమోదు చేసుకున్న అభ్యర్థులకు తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఐదు వేలకుపైగా వీడియో పాఠాలు ఏడాది పాటు అందుబాటులో ఉండేలా డిజిటల్ వేదికను రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తృతంగా అమలు చేసే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి, అవసరమైన కార్యాచరణ చేపడతామన్నారు. తమ విజ్ఞప్తికి వెంటనే స్పందించి ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించేందుకు ముందుకొచ్చిన మంత్రికి నిరుద్యోగ జెఎసి నాయకులు వంశీ, చెర్రీ ప్రవీణ్, తేజావత్ ప్రవీణ్, శిరీష కృతజ్ఞతలు తెలిపారు.

# తల్లి, ఇద్దరు పిల్లలు బావిలో దూకి ఆత్మహత్య



**ప్రజాపక్షం /పూడూర్ :** కుటుంబ కలహాలతో తల్లి ఇద్దరు పిల్లలతో కలిసి బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన వికారాబాద్ జిల్లా పూడూర్ మండలం సోమన్‌గుర్తి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసు రెస్క్యూ టీం ఫైర్ సిబ్బంది మృతదేహాలను బయటకు తీశారు. మాటుగూడెం గ్రామానికి చెందిన తల్లి మమత, కుమారుడు సాకేత్ (8), కూతురు జనశ్రీ 4లుగా గుర్తించారు. కుటుంబ కలహలతో ఇంట్లో నుండి తల్లి గారి ఇంటికి నారాయణపూర్ గ్రామానికి వెళ్లి వస్తానని బయలుదేరిన మమత బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. ఈ ఆత్మహత్యకు కారణం కుటుంబ కలహాలా లేక ఇంకేమైనా ఇబ్బందులతో ఇలా జరిగిందా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాలను పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# గురుకులాల్లో విద్యా ప్రమాణాలతో పాటు మౌలిక వసతుల బలోపేతం

- యూనిఫామ్‌లు, షూస్, పుస్తకాలు సకాలంలో అందాలి
- శానిటేషన్, భద్రత, తాగునీటిపై ప్రత్యేక దృష్టి
- ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక కార్యాచరణ: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్‌టి గురుకులాలు, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలతో పాటు మౌలిక వసతులను బలోపేతం చేయాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించే యూనిఫామ్‌లు, షూస్, పుస్తకాలు తదితర సామగ్రిని ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో అందించాలని స్పష్టం చేశారు. సచివాలయంలో శనివారం గురుకులాలు, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో పిఎంయు ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లాలకు చేరిన సామగ్రి విద్యార్థులకు చేరేలా చర్యలు తీసుకోవాలని, సరఫరాలో ఎక్కడైనా సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని సూచించారు. ప్రతి పనికి గడువు, బాధ్యుడైన అధికారిని నిర్దేశించి పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. పెద్ద క్యాంపస్‌లలో పారిశుద్ధ్య సిబ్బంది సంఖ్యను పరిశీలించి అవసరమైన మేరకు సిబ్బందిని పెంచాలని మంత్రి సూచించారు. విద్యార్థుల సంఖ్య, స్థానిక అవసరాలకు అనుగుణంగా తరగతి గదులు, వంటశాలలు, తాగునీరు, ఆర్‌ఒ ప్లాంట్లు, వాషింగ్ సదుపాయాలు, శానిటేషన్ తదితర అంశాలతో సమగ్ర మౌలిక వసతుల ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన చోట్ల భద్రతా సిబ్బంది, పోలీసు సమన్వయం, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్, డిజిటల్ లెర్నింగ్ వనరులు, అదనపు కోచింగ్‌తో పాటు పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై మార్గదర్శనం అందించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. సమీక్షలో ఎస్‌సి గురుకులాల కార్యదర్శి రవి గుగులోతు, ఎస్‌టి గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి , ఆశ్రమ పాఠశాలల డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి, ఎస్‌సి స్టడీ సర్కిల్ డైరెక్టర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 10 నుండి 18 వరకు ఘనంగా బతుకమ్మ వేడుకలు

**ఏర్పాట్లపై సిఎస్ సంజయ్ జాజు సమీక్ష**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణా సంస్కృతిలో ప్రత్యేకత గాంచిన బతుకమ్మ పూల పండగను ఈనెల 10 వ తేదీ నుండి 18వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) సంజయ్ జాజు వెల్లడించారు. ఈనెల 10 నుండి 18వ తేదీ వరకు నిర్వహించే బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై శనివారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సిఎస్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ ఈనెల 18వ తేదీన సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని ట్యాంక్ బండ్‌పై వేలాది మంది మహిళలచే సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని అత్యంత వైభంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగాగల అమరవీరుల స్మారక కేంద్రం నుండి వేలాది మంది మతహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారని, వీరితో పాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసే ప్రత్యేక వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు.

**పండగ శోభలా రాజధాని నగరం ముస్తాబు**

ఈ బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని పండగ శోభ వచ్చేలా రాజధాని నగరంలోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాకుండా పలు జంక్షన్ల కేంద్రాల వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించాలని సిఎస్ ఆదేశించారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్‌పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుండి పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశమున్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సిఎం ఆదేశించారు. ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్‌లో ఉన్న బతుకమ్మ ఘాట్ తోపాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచ్‌ఎండిఎ, జిహెచ్‌ఎంసి అధికారులను సిఎస్ ఆదేశించారు. సాయంత్రం 5 నుండి రాత్రి 10 గంటల మధ్య ట్యాంకు బండ్‌పై బతుకమ్మ ఉత్సవాలు జరుగుతున్నందున ట్రాఫిక్ మళ్ళింపు, బారికేడింగ్, కనీస సౌకర్యాల ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు. అమరవీరుల స్మారక కేంద్రం నుండి ట్యాంక్ బండ్ వరకు ప్రత్యేకంగా బారికేడింగ్, లైటింగ్ సౌకర్యాలను కల్పించాలని సూచించారు. బతుకమ్మ జరిగే పది రోజుల పాటు రవీంద్ర భారతిలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నందున అక్కడ కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని టూరిజం కేంద్రాలు, ప్రముఖ ప్రాంతాల్లోనూ బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలని అన్నారు.

**బతుకమ్మ ఉత్సవాల ప్రత్యేక లోగో**

బతుకమ్మ ఉత్సవాలను ప్రతిబింబించేలా ఈ సారి ప్రత్యేక లోగోను రూపొందిస్తున్నామని సిఎస్ వెల్లడించారు. డిసెంబర్‌లో జరుగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను కూడా ఈ లోగోలో తెలియచేసే విధంగా రూపొందించనున్నట్టు తెలిపారు. సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి వాణి ప్రసాద్, హైదరాబాద్ సిపి వి.సి. సజ్జనార్, పంచాయితీ రాజ్ కమిషనర్ దివ్య, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఆర్‌టిసి ఎం.డి. నాగిరెడ్డి, మల్కాజిగిరి సిపి బి.సుమతి, జాయింట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్), హైదరాబాద్ జోయెల్ డేవిస్, స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ ముకుంద రెడ్డి, హార్టికల్చర్ కమిషనర్ షేక్ యాస్మీన్ బాషా, జలమండలి ఎండి అశోక్ రెడ్డి, టూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్, శిల్పారామం, సంస్కృతిక శాఖ డైరెక్టర్ ఎ.నర్సింహారెడ్డి, ప్రత్యేక అధికారి కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.


**మరిపెడ మున్సిపాలిటీ కార్యాలయం**

E1/MRPD/MPLTY/EPROC-5/2026-27, Dt: 05.10.2026

01) ఇ-ప్రొక్యూర్‌మెంట్ మొత్తం పనుల సంఖ్య : 01 పనులు,
02) పనుల రకం : బతుకమ్మ పండుగ ఏర్పాట్లు,
03) బిడ్ల ప్రారంభం & ముగింపు : 05.10.2026 మ.03.00గం.ల నుండి 08.10.2026 ఉ.10.30గం.ల వరకు,
04) ప్రైస్ బిడ్ ప్రారంభ తేది : 08.10.2026 మ.03.00గం.లకు, **మొత్తం విలువ:** రూ.04.00లక్షలు.
సంప్రదించవలసిన వారి పేరు, చిరునామా: మరిపెడ మున్సిపాలిటీ. మొబైల్ నెం. 9573160839 మరియు www.tender.telangana.gov.in

సం/- కమిషనర్, మరిపెడ మున్సిపాలిటీ.
DIPR R.O. No. : 11087-PP/CL/ADVT/2026-27, Date: 03-10-2026

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం - పర్కాల**
హనుమకొండ జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

ఫైల్ నెం. E1/107/7/MCP/2026 తేది: 03.10.2026

ఇ-ప్రొక్యూర్‌మెంట్ కొరకు టెండర్ నోటీసు:

| పనులు: వివిధ గ్రాంట్ల కింద 11 నెంబర్ల పనులు, రూ.59.00లక్షలు | |
|---|---|
| బిడ్ల డౌన్‌లోడింగ్ ప్రారంభం | 05.10.2026 సా.4.30గం.ల నుండి, |
| బిడ్ల డౌన్‌లోడింగ్ ముగింపు | 08.10.2026 సా.5.00గం.ల వరకు, |
| బిడ్లు తెరుచు తేది మరియు సమయం | 08.10.2026 సా.5.30గం.లకు. |

మరిన్ని ఇ-ప్రొక్యూర్‌మెంట్ పనుల వివరాలకు @ ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ www.tender.telangana.gov.in (ఫోన్ నెం. 9490143574)లో చూడవచ్చు. ఎటువంటి కారణం లేకుండా టెండర్‌ను రద్దు చేసే హక్కు కమిషనర్‌కు కలదు.

సం/- కమిషనర్, మున్సిపల్ కౌన్సిల్, పర్కాల.
DIPR R.O. No. : 11084-PP/CL/ADVT/2026-27, Date: 03-10-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-23 & సర్కిల్-24
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్ స్వీకరణకు ప్రారంభ తేది /ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| 48/EE-23 & 24/RJRNZ/ GHMC/2026-27 | (14) సంఖ్యల పని | రూ. 25.015 లక్షలు | డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 05.10.2026 మ.12.00గం.ల నుండి. బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది: 08.10.2026 మ.12.00గం.ల వరకు | శ్రీ బి.నరేందర్ గౌడ్, ఇఇ, సర్కిల్-23 & సర్కిల్-24, ఆర్‌జెఎన్‌ఆర్‌జెడ్, జిహెచ్‌ఎంసి, ఫూల్‌బాగ్, హైదరాబాద్. ఫోన్ నెం. 9989930608 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.tender.eprocurement.gov.in, ఇ-మెయిల్: eec23.chandrayangutta@gmail.com లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-23, చాంద్రాయణగుట్ట & సర్కిల్-24, జంగంమెట్/ ఆర్‌జెఎన్‌ఆర్/జిహెచ్‌ఎంసి
DIPR R.O. No. : 11118-PP/CL/ADVT/2026-27, Date: 03-10-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ::**
సర్కిల్-17, జల్పల్లి.

తేది: 03.10.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| టెండర్ నోటీసు NIT No. 14/ EEC-17/ JLPY/ GHMC/ 2026-27, తేది: 03.10. 2026 | 02 పనుల కోసం జిహెచ్‌ఎంసి, జల్పల్లి సర్కిల్-17 పరిధిలో బతుకమ్మ మరియు దసరా పండుగ-2026 సందర్భంగా దుర్గామాత నిమజ్జనానికి క్రేన్ ఏర్పాటు మరియు ఇతర సౌకర్యాల కల్పన... అలాగే, దసరా / బతుకమ్మ పండుగ-2026 సందర్భంగా జిహెచ్‌ఎంసి, శంషాబాద్ జోన్, జల్పల్లి సర్కిల్-17 పరిధిలోని వివిధ డివిజన్‌లలో గల చెరువులు, ప్రధాన రహదారులు మరియు బతుకమ్మ ఘాట్ల వద్ద తాత్కాలిక విద్యుత్ దీపాల (లైటింగ్) ఏర్పాటు. | రూ. 5.15 లక్షలు | 08.10.2026 మ.3.00 గం.ల వరకు | శ్రీ కె. శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జల్పల్లి సర్కిల్-17, జిహెచ్‌ఎంసి |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.Tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, జల్పల్లి, జిహెచ్‌ఎంసి
DIPR R.O. No. : 11136-PP/CL/ADVT/2026-27, Date: 03-10-2026

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
ఆదివారం
04-10-2026
www.prajapaksham.in




## 'అనురాగ్' అంతర్జాతీయంలోకి అడుగు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** అంతర్జాతీయ విద్యా, పరిశోధనా రంగాల్లో భాగస్వామ్యాలను విస్తరిస్తూ అనురాగ్ యూనివర్సిటీ మరో కీలక ముందడుగు వేసింది. థాయ్‌లాండ్ బ్యాంకాక్‌కు చెందిన షినవత్రా యూనివర్సిటీతో అవగాహన ఒప్పందంతో ఇరు విశ్వవిద్యాలయాల మధ్య సంయుక్త పరిశోధనలు విద్యార్థులు అధ్యాపకుల మార్పిడి అంతర్జాతీయ విద్యా సహకారం ప్రపంచస్థాయి. అభ్యసన అవకాశాలు విస్తరించనున్నాయి. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ కృత్రిమ మేధస్సు యంత్ర అభ్యసన విభాగాధిపతి డా.వి.మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు. అంతర్జాతీయ విద్యా సంస్థలతో భాగస్వామ్యాలను పెంపొందించడం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులకు ప్రపంచస్థాయి విద్యా,పరిశోధనా అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం కుదిరినట్లు విశ్వవిద్యాలయ ప్రతినిధులు తెలిపారు.



## గంగి శంకర్‌కు ఎదులాబాద్ ఎస్సీసెల్ పగ్గాలు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగంలో సంస్థాగత నియామకాలు ఊపందుకున్నాయి. ఇందులో భాగంగా మేడ్చల్ నియోజకవర్గంలోని ఎదులాబాద్ 7వ డివిజన్ ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా గంగి శంకర్ నియమితులయ్యారు.ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం మేడ్చల్ జిల్లా చైర్మన్ కవలి చంద్రయ్య సెప్టెంబర్ 20న నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ బలోపేతానికి గంగి శంకర్ చేస్తున్న సేవలు, అంకితభావాన్ని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపారు. కొత్త బాధ్యతల్లో ఎదులాబాద్ 7వ డివిజన్‌లో ఎస్సీ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తు సంస్థాగత కార్యక్రమాలను విస్తరించాలని కవలి చంద్రయ్య ఆకాంక్షించారు. దీంతో గంగి శంకర్‌పై కీలక బాధ్యతలు పడినట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.



## ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్‌కు ఘన సన్మానం

**ప్రజాపక్షం / కూకట్‌పల్లి :** జనసేన పార్టీ రాష్ట్ర జాయింట్ కమిటీ కన్వీనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్‌ను మోతీనగర్ జనసేన నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. కూకట్‌పల్లి కెపిహెచ్‌బి 5వ ఫేజ్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్‌కు నాయకులు పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతానికి ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ చేస్తున్న కృషి, పట్టుదల పార్టీ నాయకులు, కార్యకర్తలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని మోతీనగర్ జనసేన నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ జనసేన పార్టీని రాష్ట్ర వ్యాప్తంగా మరింత బలోపేతం చేసేందుకు జాయింట్ కమిటీ విస్తృతంగా పనిచేస్తుందని తెలిపారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై జనసేనలో చేరేందుకు ఆసక్తి చూపుతున్న నాయకులను గుర్తించి ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. పార్టీ బలోపేతానికి మోతీనగర్ నాయకులు, జన సైనికులు తమవంతు సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోతీనగర్ జనసేన నాయకులు బడే విశ్వేశ్వరరావు, ప్రభు చైతన్య ఆరేటి, మిరియాల చిట్టిబాబు, అలపర్తి విజయ్, కాగితాల వెంకటేశ్వరరావు, విజయ్, ఆల్విన్, కాలనీకి చెందిన దామెర్ల రామచంద్రరావు, జయప్రకాశ్ నారాయణ, బొప్పన మోహన్, తదితర జనసైనికులు, మహిళలు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** 31 అక్టోబర్ 2023 నాటికి డిగ్రీ, డిప్లొమా లేదా డిగ్రీతో సమానమైన విద్యార్హత కలిగిన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫారం18 ద్వారా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నవాబుపేట్ తహసీల్దార్ జి. బుచ్చయ్య సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేశామని, ప్రస్తుతం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దన్నారు. గతంలో ఓటరుగా నమోదై ఓటువేసిన వారు కూడా ప్రస్తుత ఓటరు జాబితాలో నమోదు కోసం ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సందేహాలు, అభ్యంతరాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత సిబ్బందిని సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. డిగ్రీ, డిప్లొమా లేదా సమాన మైన విద్యార్హత కలిగిన అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం చేయకుండా ఫారం18 ద్వారా దరఖాస్తు చేసుకుని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ బుచ్చయ్య పేర్కొన్నారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



**ప్రజాపక్షం/వర్ధపల్లి:** గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం దమ్మాయిగూడకు చెందిన బొమ్మని అశోక్(22) నాగపూర్ నుంచి ఎంజిబిఎస్ బస్టాండ్ మీదుగా ఇసిఐఎల్ బస్టాండ్‌కు గంజాయి తీసుకుని వస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు నిఘా ఏర్పాటు చేసి నిందితుని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 1 కిలో 50 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేసి న్యాయస్థానం ముందు హాజరు పర్చగా మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. దర్యాప్తు అధికారి ఎస్. సుధాకర్‌రెడ్డి, ఎస్.సాయిలు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ వెంకటేష్,సాహెబ్ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతుందని ఆయన తెలిపారు.

### చెరువులు, నాలాలు, రహదారుల అభివృద్ధి పనులకు..

# ఎంఎంసి స్థాయీసంఘం ఆమోదముద్ర

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) పరిధిలో నగర మౌలిక వసతుల కల్పన, నాలాలు, డ్రైనేజీల వ్యర్థాల నిర్వహణ లక్ష్యంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తార్నాకలోని ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో శనివారం మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్ అధ్యక్షతన 8వ సాధారణ స్థాయీసంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.



**రూ.97.50 కోట్లతో మోడల్ రహదారి నిర్మాణం**

పట్టణ మౌలిక వసతులను బలోపేతం చేసే దిశగా పటేల్ నగర్ ఎస్‌టిపి నుంచి డిమార్ట్ వరకు 36 మీటర్ల వెడల్పుతో రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ (ఆర్‌డిపి) కింద ఫేజ్1 రహదారి విస్తరణకు హెచ్‌సిటిఐ (హెచ్‌సిటీ) నిధుల నుంచి 2026–27 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.97.50 కోట్ల పరిపాలనా అనుమతులకు కమిటీ ఆమోదం తెలిపింది.

**నాలాల అభివృద్ధి, రూ.60 కోట్లతో చెరువుల పునరుద్ధరణ**

నగరంలో ముంపు నివారణకు పెద్ద చెరువు (కుంట్లూర్) నుంచి బూదాన్ కాలనీ మీదుగా పసుమాముల చెరువు వరకు డ్రైనేజీ వ్యవస్థ పునర్నిర్మాణం, భూసేకరణ, నాలా అభివృద్ధి ప్రణాళిక(ఎస్ఎన్‌డిపి) ప్రతిపాదనలను పరిశీలించారు. అలాగే ఎస్ఎడిపి రెండవ దశ ద్వారా నాసిన్ చెరువు నుంచి కొమటివాని కుంట వరకు వర్షపు నీటి డ్రెయిన్ నిర్మాణాలు చేపట్టనున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా బోడుప్పల్ సర్కిల్లోని చింతల్ చెరువు సంరక్షణకు రూ.20 కోట్లు, ఘట్‌కేసర్ సర్కిల్‌లోని రాంపల్లి చెరువు సమగ్ర పునరుద్ధరణకు రూ.40కోట్ల పరిపాలనా అనుమతుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.

**క్రీడలు, పెంపుడు జంతువుల సంరక్షణకు ప్రత్యేక ప్రాజెక్టులు**

ప్రజా సౌకర్యాల విస్తరణలో భాగంగా సైనిక్‌పురిలోని ఖాళీ స్థలంలో రూ.2.85కోట్లతో డాగ్ పార్క్, పెట్ఫోల్క్ గ్రూమింగ్ పాడ్స్ పైలట్ ప్రాజెక్ట్ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. బండ బావి ప్రాంతంలో అధునాతన మల్టీపర్పస్ అవుట్‌డోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటును పరిశీలించారు. నాగారం డివిజన్‌లో పారిశుద్ధ్య మౌలిక వసతుల కోసం రూ.4.95 కోట్లతో కాంపౌండ్ వాల్స్, రూ.2.95కోట్లతో యుజిడి నిర్మాణ ప్రతిపాదనలను ఆమోదించారు. పర్యావరణ జీవ వైవిధ్య సంరక్షణ కోసం 'బయోడైవర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీ'ని ఏర్పాటు చేసి, పీపుల్స్ బయోడైవర్సిటీ రిజిస్టర్ రూపకల్పన చేయనున్నారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్లు సంచిత్ గంగ్వార్, వికాస్ మహతో, అదనపు కమిషనర్లు సి.ఎన్.రఘు ప్రసాద్, వేణు గోపాల్, చీఫ్ సిటీ ప్లానర్ బి.ప్రదీప్ కుమార్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ తిప్పర్తి సరిత రెడ్డి, చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్, కార్యదర్శి రజనీ, వెటర్నరీ డైరక్టర్ శ్రీనివాస్ రెడ్డి, యుబిడి డైరక్టర్ సునంద, ఎస్ఇలు రమేష్ బాబు, నాగేందర్, రోహిణి, చీఫ్ ఫైనాన్స్ అడ్వైజర్ వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## 'సర్' ఓటరు జాబితా పరిశీలన



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** మూసాపేట డివిజన్ మోతీనగర్‌లోని వార్డు కార్యాలయంలో శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎస్ఐఆర్ ఓటరు జాబితా పరిశీలన, నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్ఐఆర్‌లో ప్రక్రియలో భాగంగా నోటీసులు అందిన ప్రతి ఓటరు వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని, అర్హత ఉన్న ఏ ఒక్క ఓటు హక్కును కోల్పోకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బిఎల్ఒలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన వివరాలు, పత్రాల విషయంలో సహకరించాలని సూచించారు. ఓటు ప్రతి పౌరుడికి ముఖ్యమైన హక్కు అని, ప్రజలు కూడా ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా కొంత సమయం కేటాయించి తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని కోరారు. అనంతరం మోతీనగర్‌లో మహిళల కోరిక మేరకు కబీర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. మోతీనగర్‌లో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులపై అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రామారావు నగర్ నుంచి కబీర్‌నగర్ వరకు కొనసాగుతున్న నాలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, మోతీనగర్‌లో చేపట్టాల్సిన డివైడర్ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ పనులను వెంటనే చేపట్టి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, జోసఫ్, తిరుపతి, రాజ్‌కుమార్‌గౌడ్, ఉదయ్ వినోద్, వెంకట్‌రెడ్డి, మోహన్ రెడ్డి, తదితరులు వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## డివిజన్ సమస్యలు పరిష్కరించండి : మన్నెరాజు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** సాయిబాబా నగర్ డివిజన్‌లో సమస్యలను పరిష్కరించాలని కోరు తూ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజనని మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నెరాజు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మన్నెరాజు మాట్లాడుతూ సాయిబాబా నగర్ డివిజన్‌లో శానిటేషన్ వ్యవస్థను మెరుగుపరచాలని, సిమెంటు రోడ్లు, పార్కుల్లో వసతుల కల్పనకి కావాల్సిన నిధుల ను కేటాయించి సమస్యలను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు అందించడమే బాధ్యత

బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** అభివృద్ధి ఓ వైపు సంక్షేమం మరో వైపు ప్రజలకు అందించడమే తమ బాధ్యత అని బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం, మహదేవపురంలో రూ.82.70 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు, బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే కెపి వివేకానంద శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ మహదేవపురంలోని షిరిడి హిల్స్ కాలనీలో ఇప్పటికే సిమెంటు రోడ్లు, బిటి రోడ్లు, పార్కుల అభివృద్ధికి, రోడ్డు మధ్య డివైడర్ల ఏర్పాటు వంటి మౌలిక వసతుల కల్పన కోసం ఎనభై శాతం పనులను పూర్తి చేశామని, మిగిలిపోయిన పనులను త్వరలోనే పూర్తి చేయిస్తానని పేర్కొన్నారు. డివిజన్‌లోని అన్ని కాలనీలలో మౌలిక వసతులను అభివృద్ధిలో భాగంగా పన్నెండేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి తాగు నీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ, రోడ్ల నిర్మాణం, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధి తదితర అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశానని, రాబోవు కాలంలో మహదేవపురం డివిజన్‌లోని అన్ని కాలనీలలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించేందుకు తనవంతు సహకారం ఎల్లప్పుడు అందిస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో నాయకులు రమేశ్, సత్యబాబు, బాలకిషన్, పివిఆర్ యశస్వి,మధుసూదన్,తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

మాజీ ఎంఎల్‌సి రాములు నాయక్, డిసిసి తోటకూర వజ్రేష్‌యాదవ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ఆర్‌టిసి కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంద ని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని మాజి ఎంఎల్‌సి రాములు నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌లు అన్నారు. శనివారం శామీర్‌పేట డివిజన్ హకింపేట డిపోలో జిల్లా ఆర్టిఎ మెంబర్, హకింపేట డిపో గౌరవ అధ్యక్షుడు బీమిడి జైపాల్‌రెడ్డితో కలిసి టిజిఎస్‌ఆర్టిసి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించిన తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టిడబ్ల్యూ యు) అభ్యర్థులకు మద్దతు ఇచ్చి బాణం గుర్తు కు ఓటు వేయాలని కార్మికులను కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్‌టిసి కార్మికులకు అనేక హామీలు ఇచ్చినా వాటిలో చాల వరకు అమలు కాలేదని విమర్శించారు. ఉద్యమ సమయంలో కార్మికుల మద్దతు తీసుకుని తెలంగాణ ఏర్పడిన అనంతరం యూనియన్ వ్యవస్థపై ఆంక్షలు విధించారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, మేడ్చల్ డివిజన్ అధ్యక్షులు నాగరాజు, హకింపేట డిపో అధ్యక్షులు తులసిరాం, సెక్రటరి పవన్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## 10 గ్రాముల గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం /మర్పల్లి:** వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పలి మండల పరిధిలో గంజాయితో ఓ వ్యక్తి ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అబ్దుల్ రహమన్ వెంచర్ సమీపంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండాన్ని గమనించిన మర్పల్లి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని తనఖీ చేయగా సదరు వ్యక్తి వద్ద 10గ్రాముల ఎండి గంజాయి లభించడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు మర్పల్లి అబ్దుల్ రావుప్ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా ,విక్రయాలు,వినియోగంపై నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## విషాదాంతంగా ముగిసిన అదృశ్య ఘటన

హత్యకు గురైనట్లు పోలీసుల గుర్తింపు

**ప్రజాపక్షం/కుల్కచర్ల:** కుల్కచర్ల మండల పరిధిలోని చెల్లాపూర్ కు చెందిన అమృత (34) అదృశ్య మైన ఘటన విషాదాంతంగా మారిం ది. ఆమె హత్యకు గురైనట్లు పోలీసులు గుర్తించారు. ఈ హత్య ఆమెతో సంబంధం ఉన్న మంగలి ఆనంద్ హత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. అమృత భర్త మృతి చెందిన అనంతరం అదే గ్రామానికి చెందిన మంగలి ఆనంద్ ఆమెకు పరిచయం ఏర్పడింది. గత నెల 18న అమృత ఫోన్ చేసి ఆనంద్‌ను దోమ మండలం కొత్తపల్లికి పిలిచింది. అనంతరం ఇద్దరూ కలిసి మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్ మండలం వెన్నచేడు చెరువు వద్దకు వెళ్లా రు. అక్కడ అమృతకు సంబంధించిన బంగారం విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో అమృతను వదిలించుకోవాలనే ఉద్దేశంతో ఆమె చీర కొంగుతో గొంతు బిగించి హత్య చేసినట్లు విచారణలో ఆనంద్ అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. హత్య అనంతరం మృతదేహంపై డీజిల్ పోసి తగలబెట్టేందుకు ప్రయత్నించినప్పటికీ పూర్తిగా కాలకపోవడంతో గోనె సంచుల్లో కుక్కి నారాయణపేట జిల్లా కృష్ణా నది వద్దకు తీసుకెళ్లి పడేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహా న్ని గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసిన పోలీసులు ఆనంద్ను విచారించగా హత్యకు సంబంధించిన వివరాలు వెల్లడైనట్లు తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఎస్ఐ రమేష్ కుమార్ తెలిపారు.



## దురాక్రమణలు, కబ్జాలపై ఉపేక్షించొద్దు

ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** కాలనీల్లో ఫుట్‌పాత్‌లపై ఉన్న అనధికార నిర్మాణాలు, దురాక్రమణలతో పాటు రహదారులను ఆక్రమించుకొని నిర్మించిన ర్యాంపులను వెంటనే తొలగించి ప్రజల రాకపోకలకు సుగమం చేయాలని ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. శనివారం హబ్సిగూడ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి వీధి దీపాల నిర్వహణ, సిఅండ్ డి వ్యర్థాల నిర్వహణ, పార్కింగ్ తదితర అంశాలను పరిశీలించారు. ప్రజలకు ఎక్కడా ఎలాంటి అంతరాయ లేకుండా రాకపోకలు చేసే విధంగా చూడాలన్నారు. రోడ్లు, విద్యుత్ స్థంభాలు, బహిరంగ ప్రదేశాల్లో వాణిజ్య సంబంధిత పోస్టర్లు, బ్యానర్లను తొలగించాలన్నారు. నిర్మాణ సంబంధ వ్యర్థ సామగ్రి ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చూడాలన్నారు. ప్లాంటేషన్ లేకుండా ఖాళీగా ఉన్న ప్లాంటర్ బాక్సులను తొలగించి సరైన చోట వినియోగపడేలా చర్యలు చేపట్టాలన్నారు. రవీంద్రనగర్‌లోని సెయింట్ జోసఫ్ స్కూల్ సమీపంలో అనధికారికంగా వాహనాల పార్కింగ్ వల్ల ఏర్పడుతున్న సమస్యల పరిష్కారానికి ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకొని క్రమబద్ధీకరించాలని ఆదేశించారు.

## చట్టబద్ధత పరిధిలోనే సరోగసి దరఖాస్తులు

డిఎంహెచ్ఒ డా.ఆనంద్



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** సరోగసిలో అక్రమాలు, దుర్వినియోగం, వాణిజ్య ప్రయోజనాలకు తావులేకుండా చట్టాన్ని కఠినంగా అమలు చేస్తామని, అవసరమైన అర్హత కల్గిన దంపతులకు పూర్తి వైద్య, చట్టపరమైన పరిశీలనల అనంతరమే ఆమోదిస్తూ ధృవీకరణ పత్రాలు జారీ చేస్తామని డిఎంహెచ్ఒ డా.ఆనంద్ తెలిపారు. సరోగసి ప్రక్రియకు సంబంధించి వైద్యపరమైన అవసరాలు, చట్టబద్దత, పారదర్శకత, నైతిక ప్రమాణాలకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా సరోగసి దరఖాస్తులను పరిశీలిస్తామన్నారు. డిఎంహెచ్ఒ ఆధ్వర్యంలో గైనకాలజిస్టు డాక్టర్ మాధవీలత, శిశు వైద్య నిపుణుడు డాక్టర్ శివకిరణ్‌లతో కల్సి సరోగసి దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు.తమ కార్యాలయానికి వచ్చిన మూడు సరోగసి దరఖాస్తుల్లో మూడింటిపై ఆమోదం తెలిపి ధృవీకరణ పత్రాలను అందచేసారు. గర్భధారణకు సంబంధించిన వైద్య సమస్యలు, గర్భాన్ని మోసే సామర్థ్యం, ప్రత్యామ్నాయ మార్గాల అవకాశాలపై నిపుణుల అభిప్రాయాల అనంతరం పారదర్శకంగా సరోగసి దరఖాస్తులపై నిర్ణయాలు తీసుకొంటామని డిఎంహెచ్ఓ తెలిపారు.



## వక్ఫ్ పరిరక్షణ కమిటీ సభ్యుడిగా అడ్వొకేట్ హుస్సేన్‌కు ఘన సన్మానం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా వక్ఫ్ పరిరక్షణ, సమన్వయ కమిటీ సభ్యుడిగా అడ్వొకేట్ హుస్సేన్ నియమితులైన సందర్భంగా శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట్‌లోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో అభినందన, సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిపిసిసి వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ హాజరై అడ్వొకేట్ హుస్సేన్‌ను ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, సంబంధిత అంశాల సమన్వయంలో అడ్వొకేట్ హుస్సేన్ తన బాధ్యతలను చట్టపరమైన పరిధిలో నిజాయితీ, నిబద్ధత, పారదర్శకతతో నిర్వహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పారెడ్డి, బ్లాక్, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ముస్లిం మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తాండూరు ఎంసిహెచ్ ఆసుపత్రిలో మృత్యుఘోష

వైద్యుల నిర్లక్ష్యానికి బలైన మరో చిన్నారి



**ప్రజాపక్షం/తాండూరు:** వికారాబాద్ జిల్లాలో వైద్యం గాలిలో దీపంగా మారింది. వరుస ఘటనలు వైద్యుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారాయి. రెండు రోజుల క్రితమే పచ్చిబాలింత, నవజాత శిశువు మృతి ఘటన మరువక ముందే తాజాగా మరో చిన్నారికి వైద్యం అందక మృత్యువాత పడింది. వికారాబాద్ జిల్లా తాండూరులోని మాత శిశు జిల్లా ఆసుపత్రిలో వైద్య నిర్లక్ష్యానికి మృత్యుఘోష కొనసాగుతుంది. మరో పక్క ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పోరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలు అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించిన అధికారులలో మాత్రం మార్పు రావడం లేదు. తాజాగా జిల్లా ఆసుపత్రిలో శనివారం మరో చిన్నారి సమయానికి వైద్యం అందక మృత్యువాత పడింది.పెద్దేముల్ మండల పరిధి రుక్మాపూర్ గ్రామానికి చెందిన చిన్నారి ఆహన్యా(6) అనారోగ్యానికి గురికావడంతో తాండూరులోని మాత శిశు జిల్లా ఆసుపత్రికి తీసుకచ్చారు. అక్కడ పరీక్షించిన వైద్యులు చిన్నారి కోలుకుంటుందని ఏమి భయపడాల్సిన అవసరం లేదని చెప్పారని తెలిపారు. ఆ తరువాత ఉన్నట్టుండి సాయంత్రం చిన్నారి పరిస్థితి విషమించిందని ఇక్కడ వైద్యం అందించలేమని హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు సూచించారని ఆవేదన వ్యక్తం చేశారు. అంబులెన్స్ సిద్ధం కాగా చిన్నారి మృతి చెందినట్లు తెలిపారు.

## ఉరేసుకొని యువకుడి మృతి



**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఉద్యోగవేటలో జర్మనీకి వెళ్ళి మూడు నెలల తర్వాత వచ్చిన ఓ యువకుడు అదే రోజు సాయంత్రానికల్లా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఉదంతం ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. ఫిర్యాదస్తుడైన రామంతాపూర్‌లోని బాలకృష్ణనగర్ ప్రాంతంలో నివసించే మహబూబాబాద్ జిల్లా నెల్లికుదూర్ గ్రామానికి చెందిన ఫిర్యాదస్తుడు మల్లేశం గౌడ్ పోలీసులకు అందించిన ఫిర్యాదు వివరాలిలా ఉన్నాయి. ఫిర్యాదస్తుడి పెద్ద కుమారుడు విద్యాసాగర్ శుక్రవారం జర్మనీకి మూడు నెలల క్రితం ఉద్యోగం కోసమని వెళ్లి శుక్రవారం తెల్లవారు జామున హైదరాబాద్ చేరుకొన్నాడు. అతడిని బాలకృష్ణానగర్‌లోని ఇంట్లో విడిచి పెట్టి తండ్రి స్వగ్రామానికి వెళ్లి సాయంత్రం అదే రోజు రాత్రి ఇంటికి తిరిగి వచ్చాడు. గదిలో చూడగా విద్యుత్ వైరు సాయంతో ఉరేసుకొని విగతజీవిగా ఉన్న విద్యాసాగర్ కనిపించాడు. ఈ మేరకు అందిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పరిశుభ్రమైన వాతావరణంతోనే ప్రజారోగ్యం



ప్రజాపక్షం/షాద్‌నగర్: పరిశుభ్రమైన వాతావరణంతోనే ప్రజారోగ్యం మెరుగు పడుతుందని.. వార్డు పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని 18వ వార్డు కౌన్సిలర్ జమాల్పూర్ సంతోషి చందులాల్ అన్నారు. శనివారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో కౌన్సిలర్ జమాల్పూర్ సంతోషి చందులాల్ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టారు. వార్డులోని వివిధ కాలనీల్లో పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ జమాల్పూర్ సంతోషి చందులాల్ మాట్లాడుతూ ఇంటితోపాటు పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా పెట్టుకునేందుకు ప్రజలందరు కృషి చేయాలని ఆకాంక్షించారు. వ్యాధులను నియంత్రించాలంటే పరిశుభ్రమైన వాతావరణంలో ప్రజలందరు జీవించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్త కుండీల్లోనే వేసి మున్సిపాలిటీకి సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చౌలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, కట్టె చంద్రశేఖర్ అప్పి, శేఖర్, వరప్రసాద్, ఆనంద్ గౌడ్, పోటుభాయ్, రాములు, శ్రావణ్‌చారి, మాజిద్ భాయ్‌లు పాల్గొన్నారు.

## యువత క్రీడల పట్ల శ్రద్ధ వహించాలి



ప్రజాపక్షం/కొందుర్గు: యువత క్రీడల పట్ల శ్రద్ధ వహించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. శనివారం కొందుర్గు మండల కేంద్రంలో కేకే మాస్టర్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి మొదటి కరాటే టోర్నమెంట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు, యువత క్రీడల పట్ల శ్రద్ధ చూపించాలని, విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. బాలికలు ఆత్మరక్షణ కోసం కరాటే విద్యను నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, యువత క్రీడల పట్ల శ్రద్ధ వహించి తమ యొక్క ఫిట్నెస్‌లను అభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ జిల్లెల రమేష్, కొందుర్గు సర్పంచ్ చౌడపురం ప్రభాకర్, వార్డు సభ్యుడు శ్రీకాంత్, గుడిసె పద్మారావు, మాలకుంట్ల ప్రవీణ్, సచిన్‌లు పాల్గొన్నారు.

## ఇంటింటికి తాగునీరు అందించడమే లక్ష్యం




ప్రజాపక్షం/షాద్‌నగర్: ఇంటింటికి తాగునీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు 22వ వార్డు కౌన్సిలర్ నడికూడ అనిత రఘునాథ్ యాదవ్ వివరించారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో మిషన్ భగీరథ పైపులైన్లను ఇంటింటికి అంధించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్ మాట్లాడుతూ 22వ వార్డులోని కాలనీల్లో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, నీటి సమస్యను తీర్చేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి పైపులైన్ కనెక్షన్ ఇవ్వడంతోపాటు మంచినీటిని అంధించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తాగునీటి కష్టాలు రాకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు సహకరించేందుకు ప్రజలందరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నడికూడ రఘునాథ్ యాదవ్, నాగరాజు, రవీందర్, పవన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## బిసిల ఐక్యత, సామాజిక న్యాయ సాధన కోసం కృషి చేయాలి : రవి



ప్రజాపక్షం/షాద్‌నగర్: బిసిల ఐక్యత, సామాజిక న్యాయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి విభాగం తాలుకా చైర్మన్ జాంగారి రవి అన్నారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎస్‌సి విభాగం నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాంగారి రవి మాట్లాడుతూ బిసిల జనాభా, ప్రాతిపదికన న్యాయమైన వాటా, హక్కులు సాధించేందుకు నిర్వహిస్తున్న సభకు కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి విభాగం నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. షాద్‌నగర్ డివిజన్‌లోని ఆరు మండలాల నుండి ఎస్‌సి విభాగం కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. బిసిలకు జనాభా ప్రతిపాదికన న్యాయమైన వాటాలను కల్పించడంతో పాటు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి విభాగం తాలుకా చైర్మన్‌గా ఎన్నికైన జాంగారి రవిని చౌలపల్లి సర్పంచ్ జంగయ్య, అన్నారం సర్పంచ్ లావణ్య రామకృష్ణలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి విభాగం మండల అధ్యక్షులు చిన్న చినోళ్ల శివకుమార్, పెంటనోళ్ల ఆంజనేయులు, గోపని భీమయ్య, గునుగుర్తి రాజశేఖర్, మార్కెట్ కమిటి డైరెక్టర్ కల్లు సాయిలు, చిన్న ఎల్కిచర్ల గ్రామ పర్పంచ్ మారాటి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సింహగర్జన సభకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



ప్రజాపక్షం/షాద్‌నగర్: ఒబిసి సింహగర్జన సభకు ఎమ్మెల్యే మాల్‌రెడ్డి రంగారెడ్డిని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇబ్రహీం, ఇన్‌చార్జి బాదేపల్లి సిద్దార్థలు ఆహ్వానించారు. శనివారం ఎమ్మెల్యే మాల్‌రెడ్డి రంగారెడ్డిని కాంగ్రెస్ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి ఒబిసి సింహగర్జన సభకు ఆహ్వానిస్తూ శాలువాలతో సత్కరించారు. ఈనెల 4వ తేదిన శంషాబాద్‌లో నిర్వహించే ఒబిసి సింహగర్జన సభకు రావాలని కోరగా తప్పకుండా వస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు శ్రేణులు తెలిపారు.

# కోర్ అర్బన్ రీజియన్‌లో అమల్లోకి క్యూర్ యాక్ట్-2026

### ఆస్తి పన్ను విధానంలో కీలక మార్పులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో పట్టణ పరిపాలనకు సంబంధించి సమగ్ర చట్టపరమైన వ్యవస్థను అందుబాటులోకి తెస్తూ 'కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) యాక్ట్2026' అమల్లోకి వచ్చింది. మున్సిపల్ పరిపాలన, పన్నులు, ఆదాయం, భవన నిర్మాణ నియంత్రణ, పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం, రహదారులు, మౌలిక వసతులు, లైసెన్సింగ్ వంటి పలు కీలక అంశాలపై సమగ్ర నిబంధనలను ఈ చట్టం కలిగి ఉంది. ఈ కొత్త చట్టం ప్రకారం ఆస్తి పన్ను నిబంధనలలో పలు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. కొత్తగా అసెస్‌మెంట్ పొందే లేదా రిజిస్ట్రేషన్ అయ్యే ఆస్తుల పన్నును రెవెన్యూ (రిజిస్ట్రేషన్) శాఖ నిర్ణయించిన క్యాపిటల్ విలువ ఆధారంగానే ఖరారు చేస్తారు. కార్పొరేషన్లు స్వయంగా కొత్త రేట్లను నోటిఫై చేసే వరకు ప్రస్తుతానికి నివాస గృహాలకు 0.15 శాతం, వ్యాపార, ఇతర నివాసేతర భవనాలకు 0.75 శాతం, ఖాళీ స్థలాలకు 0.50 శాతం చొప్పున పన్ను రేట్లు వర్తిస్తాయి. ఇప్పటికే అసెస్‌మెంట్ పూర్తయిన పాత ఆస్తుల యజమానులకు ఊరట లభించింది. పాత అసెస్‌మెంట్‌ను 'బేస్ ప్రాపర్టీ టాక్స్'గా పరిగణిస్తారు. ఒకవేళ క్యాపిటల్ విలువ ఆధారంగా లెక్కించిన పన్ను ఎక్కువ ఉన్నప్పటికీ, నివాసదారులపై ఒకేసారి భారం పడకుండా వార్షిక పన్ను పెరుగుదలను గరిష్టంగా 10 శాతానికి పరిమితం చేశారు. తద్వారా దశలవారీగా కొత్త పన్ను స్థాయికి తీసుకువెళ్తారు. పాత ఆస్తులకు ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు పాత పన్నే వర్తిస్తుండగా, సవరించిన నిబంధనల ప్రకారం పెరిగే పన్ను వచ్చే ఆర్థిక సంవత్సరం, అంటే 2027 ఏప్రిల్ 1 నుండి అమలులోకి వస్తుంది. భవిష్యత్తులో రెవెన్యూ శాఖ ఆస్తుల మార్కెట్ విలువలను పెంచినప్పుడల్లా ఆస్తి పన్ను కూడా అందుకనుగుణంగా సవరించబడుతుంది.

### చిన్న ఇళ్ల యజమానులకు రాయితీలు..

చిన్న ఇళ్ల యజమానులకు చట్టంలో ప్రత్యేక రాయితీలు ప్రకటించారు. సొంత ఇల్లు ఉండి, 375 చదరపు అడుగుల కంటే తక్కువ విస్తీర్ణం కలిగిన నివాసాలకు వార్షికంగా రూ.101 నామమాత్రపు పన్నునే కొనసాగిస్తారు. అలాగే ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 30 లోపు ఏడాదికి సంబంధించిన పూర్తి పన్నును ముందస్తుగా చెల్లించే పన్ను చెల్లింపుదారులకు 5 శాతం 'ఎర్లీబర్డ్' రాయితీ అందుతుంది. అనుమతులు లేని అక్రమ నిర్మాణాలపై అధికారులు కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై ఆస్తి పన్ను ఆధారంగా 25 శాతం నుండి 300 శాతం వరకు జరిమానా విధిస్తారు. అయితే, ఈ జరిమానా చెల్లించినంత మాత్రాన సదరు అక్రమ నిర్మాణానికి క్రమబద్ధీకరణ వర్తించదని అధికారులు స్పష్టం చేశారు. కొత్తగా ఆస్తులు కొనుగోలు




చేసినవారు లేదా నిర్మాణాలు చేపట్టినవారు పన్ను అసెస్‌మెంట్ కోసం మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ స్వయం నిర్ధారణ సదుపాయాన్ని తీసుకొచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్‌ల అధికారిక వెబ్‌సైట్‌లతో పాటు 'మై క్యూర్ యాప్' ద్వారా పౌరులు తమ ఆస్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఆ సమాచారాన్ని కార్పొరేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేస్తారు. చట్టంలోని నిబంధనలను పరిగణనలోకి తీసుకొని మూడు కార్పొరేషన్ల అధికారులు ప్రస్తుతానికి క్యాపిటల్ వాల్యూలో నివాస గృహాలకు 0.15 శాతం, వ్యాపార, ఇతర భవనాలకు 0.75 శాతం, ఖాళీ స్థలాలకు 0.50 శాతంగా ఆస్తిపన్ను విధించాలని నిర్ణయించారు. ప్రత్యేకంగా నోటిఫై చేసే వరకు దీన్ని అమలు చేయనున్నారు. ఆస్తుల మార్కెట్ విలువలు మారినప్పుడల్లా ఆస్తి పన్ను కూడా అందుకనుగుణంగా మారుతుంది.

**రాయితీలు:** సొంత ఇల్లు ఉండి, 375 చదరపు అడుగుల కంటే తక్కువ వైశాల్యం ఉన్న ఇళ్లకు నామమాత్రంగా రూ.101 పన్నునే కొనసాగిస్తారు. ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి 30 తేదీ లోపు పూర్తి పన్ను చెల్లిస్తే 5 శాతం ఎర్లీబర్డ్ రాయితీ లభిస్తుంది.

### అక్రమ నిర్మాణాలపై జరిమానాలు

అనుమతులు లేని, అక్రమ నిర్మాణాలకు ఆస్తి పన్నుపై 25 శాతం నుండి 300% వరకు జరిమానా విధిస్తారు. అయితే, ఈ జరిమానా చెల్లించినంత మాత్రాన ఆ భవనానికి అక్రమ నిర్మాణ క్రమబద్ధీకరణ వర్తించదు.

### ఎప్పటి నుండి అమలులోకి వస్తుంది?

కొత్తగా రిజిస్ట్రేషన్ అయ్యే లేదా కొత్త అసెస్‌మెంట్ పొందే ఆస్తులకు వెంటనే కొత్త క్యాపిటల్ విలువ విధానం వర్తిస్తుంది. ఇప్పటికే అసెస్‌మెంట్ పూర్తయిన పాత ఆస్తులకు ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు పాత పన్నే ఉంటుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి కొత్త పన్ను విధానం అమలులోకి వస్తుంది.

### ఆన్‌లైన్ సేవలు..

మూడు కార్పొరేషన్ల పరిధిలోని కొత్త ఆస్తుల యజమానులు అసెస్‌మెంట్ కోసం మున్సిపల్ ఆఫీసులకు వెళ్లాల్సిన పనిలేకుండా, ఆన్‌లైన్ ఒఆర్‌లోనే వివరాలు నమోదుచేసుకోవచ్చు. వీటిని కార్పొరేషన్ అధికారులు తనిఖీ చేస్తారు.

## ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో బయోగ్యాస్ ప్లాంట్

'కిచెన్ టు కిచెన్' విధానం ప్రారంభించిన.. మున్సిపల్ శాఖ స్పెషల్ సిఎస్ జయేష్ రంజన్



ప్రజాపక్షం/హైదరాబాద్ : వ్యర్థాలను సమస్యగా చూడకుండా 'కిచెన్ టు కిచెన్' విధానం ద్వారా మూలస్థాయిలోనే ఇంధనంగా, ఎరువుగా మార్చాలని మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఎంఎంసి ప్రత్యేక కమిషనర్ జయేష్ రంజన్ అన్నారు. సేంద్రియ వ్యర్థాల నుంచి విలువైన వనరులను సృష్టించే దిశగా ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో శనివారం ప్రతిపాదించిన బయోగ్యాస్ ప్లాంట్‌కు జయేష్ రంజన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎస్ఐఆర్ ఐఐసిటి సాంకేతికతతో ఆక్సిలరేటెడ్ అనాలోబిక్ కంపోస్టింగ్, హైరేట్ బయోమీథనేషన్ పద్ధతుల ద్వారా తడి వ్యర్థాల నుంచి గ్యాస్, సాయిల్ కండిషనర్లను ఉత్పత్తి చేయవచ్చని అధికారులు వివరించారు. గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లు, ఫుడ్ కోర్టులలో ఇటువంటి వికేంద్రీకృత ప్లాంట్ల ఏర్పాటు ద్వారా ప్రధాన డ్రైనేజీలపై భారం తగ్గుతుందన్నారు. కెహెచ్ఎఆర్ సంస్థ సాంకేతిక సహకారంతో, స్వయం సహాయక మహిళా సంఘాల పర్యవేక్షణలో ఈ ప్లాంట్ నడవనుంది.

## 'వ్యర్థం కాదు.. వనరు'

ఏరోబిన్ సాంకేతికతతో స్థానికంగానే తడి వ్యర్థాల శుద్ధి : ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎస్.ఓ.ఆర్.టి ప్రాజెక్ట్‌లో భాగంగా పీర్జాదిగూడ సర్కిల్‌లోని స్వాంజిల్లా విల్లా ప్రతినిధులకు ప్రత్యేక 'ఏరోబిన్ హార్వెస్టింగ్ కంపోస్టర్'ను జయేష్ రంజన్ అందజేశారు. ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ మారి, స్వర్ణలత మదర్సన్ ట్రస్ట్ భాగస్వామ్యంతో బల్క్ వేస్ట్ జనరేటర్ల వద్దే తడి వ్యర్థాలను కంపోస్ట్‌గా మార్చే చర్యలు వేగవంతం చేశామన్నారు. ఈ ఏరోబిన్ పరికరం ఎటువంటి దుర్వాసన లేకుండా, తరచుగా కలపాల్సిన అవసరం లేకుండా అంతర్గత గాలి ప్రసరణ ద్వారా సహజసిద్ధంగా వంటగది వ్యర్థాలను ఆర్గానిక్ కంపోస్ట్, ద్రవ ఎరువుగా (లీచేట్) మారుస్తుంది. ప్లాస్టిక్, లోహాలు వంటి పొడి వ్యర్థాలను మినహాయించి, కేవలం తడి వ్యర్థాలను మాత్రమే ఇందులో వేయడం ద్వారా స్థానికంగానే ల్యాండ్‌స్కేపింగ్, గార్డెనింగ్‌కు అవసరమైన ఎరువు అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంఎంసి జోనల్ కమిషనర్లు సంచిత్ గంగ్వార్, వికాస్ మహతో, అదనపు కమిషనర్లు రఘు ప్రసాద్, వేణు గోపాల్, చీఫ్ సిటీ ప్లానర్ బి. ప్రదీప్ కుమార్, చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులుపాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు



ప్రజాపక్షం/కొత్తూరు: పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, చిన్నారులకు పోషక ఆహారం అంధించేందుకు కృషి చేయాలని హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు సూచించారు. శనివారం పట్టణంలోని సాయిబాబా కాలనీ అంగన్‌వాడి కేంద్రం, పటేల్ రోడ్డులో ఉన్న అంగన్‌వాడి కేంద్రాల్లో పోషన్ అభియాన్, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, కిషోర బాలికలకు పోషక ఆహార లోపాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు మాట్లాడుతూ జన్మించిన శిశువుకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇచ్చేందుకు కృషి చేయాలని, ఆరు నెలల తరువాత తల్లిపాలతోపాటు వైవిధ్యమైన అనుబంధ ఆహారం ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. ఆకు కూరలు, పప్పులు, గుడ్లు, పాలు, కూరగాయలు, పండ్లు వంటి పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని, గర్భిణీలు, వైద్యుల సూచనలు, సలహాల మేరకు ఐరన్ పోలిక యాసిడ్ వంటి సప్లమెంటు తీసుకోవాలని సూచించారు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, సురక్షితమైన నీరు, పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవడం వంటి పనులు చేయాలని పేర్కొన్నారు. చిన్న పిల్లలకు పౌష్టిక ఆహారం ఇస్తేనే శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, దాంతో వ్యాధులను నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. అన్ని రకాల కూరగాయాలను తగిన మోతాదులో తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, నిత్యం హారపాలలో కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజ లవణాలు, నీరు, పీచు పదార్థం వంటి ఆహార పదార్థాలు రెగ్యూలర్‌గా తీసుకోవడమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి వైద్యాధికారి డాక్టర్ రాధిక, ఏఎన్‌ఎం కౌసర్ భేగం, కవిత, అంగన్‌వాడి టీచర్లు ప్రసన్న, జయమ్మ, ఎల్.పద్మ, పి.భారతి, రాధా, ఆశలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులదే కీలక బాధ్యత



ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం : గ్రామావృద్ధిలో పంచాయతీ కార్యదర్శులదే కీలక బాధ్యతని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. శనివారం మంచాల మండల పరిషత్తు కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో జరిగిన సమీక్షా సమావేశానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందేటట్లు కృషి చేయటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మండలంలో వివిధ శాఖల అధికారులు ఆఫీస్‌లకే పరిమితం కాకుండ క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజలు ఎదుర్కోంటున్న తాగు నీరు, విద్యుత్తు, అండర్ డ్రైనేజీతో పాటు పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు అంకిత భావంతో విధులు నిర్వహించి గ్రామలాభివృద్ధిలో భాగస్వాములు కావలని సూచించారు. మంచాల మండలంలో రోడ్లు, మౌలిక వసతుల కల్పన కోసం సూమారు రూ.66కోట్ల నిధులు మంజూరు చేయించామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం దండేటికర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గోన్ని అర్హులైన వారికి రేషన్ కార్డులు, స్మార్ట్ కార్డులు అందచేశారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, తహాసీల్దార్, ఎంపిడిఓ, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గోన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి స్వర్ణకుమారి

వివిధ మండలాల్లో పిహెచ్‌సిల ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/రంగారెడ్డి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందేలా సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డిఎంఅండ్‌హెచ్‌ఓ)డాక్టర్ డి.స్వర్ణకుమారి సూచించారు. శనివారం జిల్లాలోని మంచాల మండలం ఆరుట్ల పిహెచ్‌సి,మాడ్గుల పిహెచ్, ఇర్విన్ పిహెచ్‌సితో పాటు యాచారం పిహెచ్‌సిలను డిఎంఅండ్‌హెచ్‌ఓ ఆకస్మికంగా సందర్శించి ఒపి, ఐపి రిజిస్టర్లు, మందుల నిల్వ, కోల్డ్ చైన్,ల్యాబ్ సేవలు,సిబ్బంది హాజరు, పారిశుద్ధ్యం,ఎన్‌సిడి,టిబి,ఇమ్యునైజేషన్ సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్‌ఓ స్వర్ణకుమారి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ, వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పిహెచ్‌సిలకు వచ్చే ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం,అవసరమైన మందులు,పరీక్షలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, వాటి ప్రయోజనాలను ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో సంబంధిత పిహెచ్‌సిల మెడికల్ ఆఫీసర్లు,హెల్త్ సూపర్‌వైజర్లు,ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు,ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నదే కాంగ్రెస్ లక్ష్యం



ప్రజాపక్షం/షాద్‌నగర్: బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, అందుకే శాసన సభలో అమోదం తెలపడం జరిగిందని ఆదివాసి కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనునాయక్ వివరించారు. శనివారం షాద్‌నగర్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ జాతీయ జనగణనలో ఒబిసి కులాల గణన చేపట్టాలని, బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బిసిలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేస్తుందని వివరించారు. బిసిల హక్కుల సాధన, జాతీయ జనగణనలో ఒబిసి కులాల గణన డిమాండ్‌ను బలంగా వినిపించేందుకు ఒబిసి సింహగర్జన సభను నిర్వహిస్తున్నట్లు, ఇందుకు ఎస్‌టిసెల్ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. బిసిలు ఐక్యంగా ఉంటేనే హక్కులను సాదించుకునేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ఈ సమావేశంలో సర్పంచులు ఆర్.బాబునాయక్, చందునాయక్, రమేష్, రాజునాయక్, ఎస్టిసెల్ మండల అధ్యక్షుడు గణేష్ నాయక్, మాజీ సర్పంచ్ మోహన్‌నాయక్, రాములునాయక్, కుమార్‌నాయక్, సంజునాయక్, సంతోష్ నాయక్, మోగ్యానాయక్, రామునాయక్ పాల్గొన్నారు.

## అర్హులైన రైతులకు న్యాయం చేయాలి

తహసీల్దార్ ఆఫీస్ ముందు గ్రామస్తులు ధర్నా

ప్రజాపక్షం/ యాచరం : అర్హులైన రైతులకు న్యాయం చేయాలని మొండిగౌరెల్లీ గ్రామస్తులు శనివారం యాచరం తహాసీల్థార్ కార్యాలయం ముందు ధర్నా చేసి అనంతరం సాగర్ రహాదారిపై రాస్తా రోకో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ యాచరం మండలం మొండిగౌరెల్లీ గ్రామ సమీపంలో నూతన పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వం సర్వే నెంబర్లుః 19,68,127లోని అసైన్డ్ భూములను తీసుకోని బాధితులకు పరిహారం అందచేస్తామని ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని అన్నారు. అయితే గ్రామంలో సుమారు 30మంది అనర్హులు అక్రమంగా పట్టా పాసు బుక్‌లు పొంది భూములను కబ్జాలో ఉన్నట్లు రెవిన్యూ రికార్డులో చూపించు కొని అన్యాయంగా పరిహారం పొందాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే నకీలిలపై సమగ్ర విచారణ చేసి అనర్హులను గుర్తించి అర్హులైన రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామంలో అనర్హులకు పరిహారం అందచేస్తే రైతుల సమక్షంలో ఆందొళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ కొలన్ రమాదేవిమల్లా రెడ్డి,ఉప సర్పంచ్ బడేకుమార్,బండమీది కృష్ణ,అంజయ్య యాదవ్, రవీందర్ గ్రామస్తులు పాల్గోన్నారు.



## నేడు ఒబిసి సింహగర్జన సభ

రంగారెడ్డి డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి: బిసి,ఒబిసి వర్గాల హక్కులు,సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యాన్ని చాటిచెప్పేలా శంషాబాద్‌లో నిర్వహించనున్న ఒబిసి సింహగర్జన బహిరంగ సభను చారిత్రాత్మకంగా విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని శంషాబాద్ మండలం గొల్లపల్లి రోడ్డులో నేడు నిర్వహించనున్న ఒబిసి సింహగర్జన సభా స్థలాన్ని డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ సభా వేదిక, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు,పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. బడుగు,బలహీన వర్గాల హక్కుల సాధనతో పాటు వారి సామాజిక, రాజకీయ ప్రాధాన్యతను చాటి చెప్పేందుకు ఒబిసి సింహగర్జన సభ కీలక వేదికగా నిలవనుందని తెలిపారు. బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ మహాసభను అందరి సమైక్య కృషితో చారిత్రాత్మకంగా విజయవంతం చేద్దామని చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు.

## హోప్ ఫౌండేషన్ 204వ అన్నదానం



ప్రజాపక్షం/మియాపూర్: హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం శనివారం 204వ వారానికి చేరుకుంది. చందానగర్, గంగా రంలోని హోప్ ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఈ 204వ అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ స్వయంగా పాల్గొని, నిరుపేదలకు, వృద్ధులకు, వికలాంగులకు స్వయంగా వడ్డించారు. దాదాపు 3200 మందికి పైగా భోజనం అందించడం విశేషం. ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. 3200 మందికి అన్నం పెట్టగలగడం మా అదృష్టం. సేవే మన ధర్మం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, వాలంటీర్లు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్‌టిఐ సదస్సుకు ఆహ్వానం



**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** అక్టోబర్ 7న రవీంద్రభారతిలో నిర్వహించనున్న ఆర్‌టిఐ యాక్ట్2005 ఆవిర్భావ దినోత్సవం, అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేయాలని మంత్రి గడ్డం వివేక్‌ను సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆహ్వానించింది. కమిటీ ప్రతినిధులు శనివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆయన్ను కలిసి ఆహ్వాన పత్రికను అందించడం జరిగింది. మంత్రిని కలిసిన వారిలో కమిటీ జాతీయ చైర్మన్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరవింద్ యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి కాశీ సతీష్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయం మహేష్ యాదవ్ తదితరులున్నారు.

## ఆతిథ్య రంగంలో క్రికెట్ జోష్



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** ప్రముఖ హాస్పిటాలిటీ విద్యా సంస్థల మధ్య క్రీడా స్ఫూర్తిని, ఐక్యతను పెంపొందించే లక్ష్యంతో రీజెన్సీ కాలేజ్ ఆఫ్ కలినరీ ఆర్ట్స్ అండ్ హోటల్ మేనేజ్మెంట్ నిర్వహించిన మూడు రోజుల ఇంటర్ కాలేజియేట్ క్రికెట్ టోర్నమెంట్ ఆర్పీఎల్ 6.0 (రీజెన్సీ ప్రీమియర్ లీగ్) ముగిసింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో వెస్టిన్ హోటల్ మేనేజ్మెంట్ కాలేజ్ ఛాంపియన్‌గా నిలిచింది. అద్భుత ప్రదర్శన కనబరిచిన వెస్టిన్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్‌కు చెందిన ఉజైర్ ఫయాజ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా రీజెన్సీ కాలేజ్ ఆఫ్ కలినరీ ఆర్ట్స్ అండ్ హోటల్ మేనేజ్మెంట్ ప్రిన్సిపాల్ పి.రమేష్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఆర్పీఎల్ 6.0 అనేది కేవలం ఒక క్రీడా టోర్నమెంట్ మాత్రమే కాదని, భవిష్యత్తు హాస్పిటాలిటీ ఐక్యత, భాగస్వామ్యం, శ్రేష్ఠతను ప్రతిబింబించే అద్భుత వేదిక అన్నారు.

## బిఆర్ఎస్ నేతలు అరెస్ట్

**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** టిమ్స్ ఆసుపత్రిని సందర్శించేందుకు యత్నించిన బిఆర్ఎస్ నేతల అరెస్ట్ వ్యవహారం విమర్శలకు తావిచ్చింది. బిఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ తలసాని సాయికిరణ్‌యాదవ్,కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పోలీసులు హౌస్ అరెస్ట్ చేయటం పట్ల నిరసన వ్యక్తం చేయడంతో బన్సీలాల్‌పేట్ డివిజన్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలోనే డివిజన్ ప్రెసిడెంట్ వెంకటేషన్ రాజు, వెంకటరమణ, లంక రాజు, సుంకపక వినయ్, గజ్జెల శీను, సురేష్, కొత్తూరు వెంకట్, మక్కల మహేష్, సాయి కృష్ణ తదితరులను గాంధీనగర్ సిఐ సురేష్ బాబు వారిని అదుపులోకి తీసుకోవడం జరిగింది.

## ప్రేమ్ వత్సాకు సన్మానం




**ప్రజాపక్షం/బేగంపేట్:** ప్రఖ్యాత హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థి, అంతర్జాతీయ ఆర్థిక దిగ్గజం ఫెయిర్ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ లిమిటెడ్ చైర్మన్ ప్రేమ్ వత్సాను శనివారం ఘనంగా సత్కరించారు. 1965 బ్యాచ్‌కు చెందిన ఆయన పాఠశాలను సందర్శించిన సందర్భంగా యాజమాన్యం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ సొసైటీ అధ్యక్షుడు గుస్తి జె.నోరియా మాట్లాడుతూ.... ప్రేమ్ వత్సా వంటి అంతర్జాతీయ స్థాయి నాయకుడికి స్వాగతం పలకడం పాఠశాలకు గర్వకారణమన్నారు.

## ఉద్యోగుల పదవీ విరమణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** జలమండలిలో పనిచేస్తున్న ఎనిమిది మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. శనివారం ఖైరతాబాద్‌లోని బోర్డు ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యుటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు.కార్యక్రమంలో పీ అండ్ ఏ సిజిఎం సురేష్, జీఎం సరస్వతితో పాటు పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గేమింగ్ కేంద్రంపై దాడి



**ప్రజాపక్షం/యాకుత్‌పురా:** విశ్వసనీయ సమాచారం మేరకు ఈనెల 1వ తేదీ అర్ధరాత్రి టాస్క్‌ఫోర్స్ చార్మినార్ జోన్ బృందం, ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది సంయుక్తంగా శ్రీనివాస హాస్పిటల్ పక్కన ఉన్న సఫియా అవెన్యూలోని ఒక అక్రమ జూద గృహంపై దాడి చేశారు. ఈ దాడిలో నిర్వాహకుడితో పాటు 13 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1.07 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

## గంజాయి ముఠా అరెస్ట్

ప్రజాపక్షం/చార్మినార్: విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ (చార్మినార్ జోన్) బృందం, మైలార్‌దేవుపల్లి పోలీసులతో కలిసి నిర్వహించిన ఉమ్మడి దాడిలో అంతర్రాష్ట్ర గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. మైలార్‌దేవుపల్లి పిఎస్ పరిధిలోని ఆరాంఘర్ ఎక్స్ రోడ్, బృందావన్ హోటల్ సమీపంలో అక్రమంగా పండు గంజాయిని కలిగి ఉన్న నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 3.3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

# ఒబిసిలకు ద్రోహం చేస్తే పాతర పెడతాం

• జనగణనలో ఒబిసి కాలమ్ చేర్చాల్సిందే • గన్‌పార్క్ వద్ద ధర్నాలో పలువురు వక్తలు



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:** ఒబిసిలను నిర్లక్ష్యం చేస్తూ వారికి ద్రోహం చేస్తే పాతర పెడతామని ఒబిసి ప్రజాప్రతినిధుల ఫోరం (ఎఐఒబిసిపిఎఫ్) చైర్మన్, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, బిసి ఇంటెలెక్చువల్ ఫోరం (బిసిఐఎఫ్) చైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ టి.చిరంజీవులు, బిసి పొలిటికల్ ఫ్రంట్ (బిసిపిఎఫ్) చైర్మన్ బాలగోని బాలరాజ్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జాతీయ జనగణనలో ఒబిసి ప్రత్యేక కాలమ్ పెట్టే విషయమై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా బిసిఐఎఫ్, బిసిపిఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద జనగణన జిఓ ప్రతులను చించివేసి నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రప్రభుత్వం బిసిలను చిన్నచూపు చూస్తున్నదని మండిపడ్డారు. బిసిలను లెక్కిస్తే జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో వాటా ఇవ్వాలనే కుట్రతోనే బిసిలకు క్యాస్ట్ కోడ్ ఇవ్వటం లేదని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్‌టిల తరహాలోనే కులగణనకు ఒబిసి క్యాస్ట్ కోడ్ కేటాయించాలని డిమాండ్ చేశారు. బిసిల కులగణన, చట్టసభల్లో బిసిల రిజర్వేషన్లు తెచ్చేవరకు వదిలి పెట్టబోమన్నారు. జనగణనలో ఒబిసిల కాలమ్ పెట్టాలని, లేనిపక్షంలో దేశవ్యాప్త ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. బిసిపిఎఫ్ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ మాట్లాడుతూ కులవృత్తులను చేసేవారు ఎప్పటికీ వెట్టిచాకిరీ చేసుకొంటూ బతకాలన్నదే పాలకులు గ్రహిస్తున్నారని ధ్వజమెత్తారు. ఒబిసిలు ఐక్యమై పాలకుల మెడలు వంచి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. బిసిపిఎఫ్ వైస్ చైర్మన్ ఎస్.దుర్గయ్య గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, ఫ్రంట్ కన్వీనర్లు బైరు శేఖర్, అంబాల నారాయణగౌడ్, దామోదర్ గౌడ్, యాదవ్, నీరజ గౌడ్, సుదర్శన్ నేత, పిడికిలి రాజు తదితరులు పాల్గొన్నారు.

# 'వెన్నెల పదాలు' పుస్తకం ఆవిష్కరణ



**ప్రజాపక్షం / రవీంద్రభారతి :** స్వచ్ఛమైన, సహజమైన పదాలతో కవిత్వం అల్లే కవి, వాగ్గేయకారులు అంబటి వెంకన్న అని పలువురు వక్తలు కొనియాడారు. తెలంగాణ సంస్కృతి, జానపద సాహిత్యం, బతుకమ్మ పండుగ వైభవాన్ని పాటల రూపంలో అంబటి వెంకన్న రచించిన 'వెన్నెల పదాలు' పుస్తకాన్ని శనివారం జాబిలి కళామండలి ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతి వేదికగా తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్‌పర్సన్ గద్దర్ వి.వెన్నెల, దక్కన్ ల్యాండ్ ఎడిటర్ మణికొండ వేదకుమార్ తదితర కవులు ఆవిష్కరించారు. వెన్నెల మాట్లాడుతూ బతుకమ్మ పండుగకు ఉన్న సాంస్కృతిక, సామాజిక సాహిత్య ప్రాధాన్యాన్ని ప్రతిబింబించేలా, తెలంగాణ జానపద సంప్రదాయాల సౌందర్యాన్ని చాటిచెప్పేలా అంబటి వెంకన్న రచించిన పాటలు ఉన్నాయన్నారు. వేదకుమార్ మాట్లాడుతూ రానున్న జానపద సాహిత్యానికి ఆదర్శవంతమైన వ్యక్తి అంబటి వెంకన్న అని అభినందించారు. జానపదాలను బతికిద్దామంటూ పిలుపునిచ్చారు. కవి, డాక్టర్ కదిరే కృష్ణ సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహాకవి గింజల నరసింహారెడ్డి, అంబటి వెంకన్న తల్లి మణెమ్మ, గాయని, గాయకులు రమాదేవి, విష్ణు కిశోర్, అంజయ్య, గుండు వెంకటేశ్వర్లు, మోత్కూర్ శ్రీనివాస్, బండారు శంకర్, డా.ఇడుకోజు శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

## వయసు మీద పడింది.. పోటీ చేయాలనే ఆలోచన లేదు



**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానో.. లేదో తెలియదు.. ప్రస్తుతానికి ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచన కూడా లేదని ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. బండ్లగూడలోని ఫాతిమా కాలేజ్‌లో జరిగిన కార్యక్రమంలో ఓవైసీ తన వ్యక్తిగత జీవితం, విద్యాభ్యాసం, రాజకీయ ప్రస్థానానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తన వయస్సును ప్రస్తావిస్తూ.. నేను ముసలోడిని అయిపోయాను. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానో లేదో తెలియదు. అసలు పోటీ చేయాలనే ఆలోచన కూడా లేదు.. చేయను అంటూ తేల్చిచెప్పారు. తాను కేవలం 12వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నానని అక్బరుద్దీన్ తెలిపారు. అయితే విద్యాపరంగా తన చదువు అక్కడితోనే ఆగిపోయినప్పటికీ, రాజకీయాల్లో ప్రజా సమస్యలపై తన గొంతును బలంగా వినిపించే స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. నేను 12వ తరగతి చదువుకున్నాను.. కానీ నేను ఏం మాట్లాడినా ముఖ్యమంత్రికి సమాధానం చెప్పాల్సిన స్థాయికి ఎదిగాను అంటూ తన రాజకీయ ప్రస్థానాన్ని వివరించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పట్టుదల పెంపొందించేలా తన అనుభవాలను వారితో పంచుకున్నారు.

## సేవా సేతు పిఎం సూర్య ఘర్ ర్యాలీ




**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** కీసర ఆపరేషన్ డివిజన్ ఆధ్వర్యంలో సేవా సేతు పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజనపై వినియోగదారుల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం, ర్యాలీ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన ద్వారా గృహాలపై సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, అర్హత ప్రమాణాలు, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వివరాలు, దరఖాస్తు ప్రక్రియ, అమలు విధానంపై వినియోగదారులకు సమగ్రంగా అవగాహన కల్పించారు.

## మంత్రి పొన్నంకు కెకెసి బృందం కృతజ్ఞతలు



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆటో రిక్షా మీటర్ చార్జీలను సవరిస్తూ జిఒ నం.46ను తెచ్చిన నేపథ్యంలో కామ్‌గార్ అండ్ కర్మచారి కాంగ్రెస్ (కెకెసి) ప్రతినిధుల బృందం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు కెకెసి నేషనల్ వైస్‌చైర్మన్ షేక్ నవాబ్ ఇబ్రహీం, రాష్ట్ర చైర్మన్ కౌశల్ సమీర్ ఆధ్వర్యంలో ప్రతినిధులు శనివారం కెకెసి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు. కౌశల్ సమీర్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆటో కార్మికులన పట్టించుకోలేదన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఆటో కార్మికుల చిరకాల స్వప్నమైన మీటర్ చార్జీల పెంపునకు చొరవ చూపారని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కెకెసి రాష్ట్ర వైస్‌చైర్మన్ దుగ్యాల వేణు, ప్రధానకార్యదర్శి మోహన్ నాయక్, రాజశేఖర్ రెడ్డి, రుద్రాక్ష మల్లేశ్, మహమ్మద్ ఫరూక్, బాలకోటి నాయక్ తదితరులున్నారు.

## గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 2 వరకు జీహెచ్ఎంసీ పరిధిలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. 2023, 2024, 2025 సంవత్సరాలతో పోలిస్తే 2026లో గణనీయమైన మార్పు ఉన్నది. నగర విస్తరణ, ఐటీ రంగ అభివృద్ధి, కొత్త వాణిజ్య సముదాయాలు, మెట్రోపాలిటన్ జీవనశైలి, డేటా సెంటర్ల స్థాపన, గృహ, వాణిజ్య రంగాల్లో విద్యుత్ ఆధారిత పరికరాల వినియోగం పెరగడం వంటి కారణాలతో విద్యుత్ డిమాండ్ గత సంవత్సరాలతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. అదేవిధంగా ఎల్నినో ప్రభావం, తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు, తేమ శాతం పెరగడం వల్ల ఎయిర్ కండీషనర్లు, కూలింగ్ పరికరాల వినియోగం అధికమై విద్యుత్ వినియోగం మరింత పెరిగింది. జీహెచ్ఎంసీ, టీజీఎస్పీడీసీఎల్;తెలంగాణ ట్రాన్స్‌కో గణాంకాల ప్రకారం సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 2 వరకు నమోదైన విద్యుత్ డిమాండ్, వినియోగం గత మూడేళ్లతో పోలిస్తే అత్యధిక స్థాయికి చేరుకుంది. రాష్ట్ర అభివృద్ధి, పారిశ్రామిక విస్తరణ, పట్టణీకరణ, వ్యవసాయ అవసరాల పెరుగుదలకు అనుగుణంగా విద్యుత్ వినియోగం కూడా రికార్డు స్థాయిలో నమోదవుతోంది. జీహెచ్ఎంసీ పరిధిలో 2023 సంవత్సరంలో ఇదే కాలంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 2,647 మెగావాట్ల నుంచి 3,043 మెగావాట్ల మధ్య నమోదైంది. 2024లో అది 2,999 నుంచి 3,417 మెగావాట్లకు పెరిగింది. 2025లో 2,682 నుంచి 3,281 మెగావాట్ల మధ్య నమోదైన డిమాండ్, 2026లో ఏకంగా 3,601 మెగావాట్ల నుంచి 4,114 మెగావాట్లకు చేరుకుంది.

## నీటి సరఫరాలో అంతరాయం

**ప్రజాపక్షం/హైదరాబాద్‌సిటీ:** హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసే కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లయ్ ప్రాజెక్టు ఫేజ్2లో భాగంగా నాసర్లపల్లి నుంచి గోడకొండ్ల వరకు ఉన్న 2375 ఎంఎం డయా ఎంఎస్ పంపింగ్ మెయిన్‌పైప్ దెబ్బతిన్న ఎంఎస్ ఎయిర్ టీస్, వాల్వుల మార్పిడి, అలాగే స్కవర్ పైప్‌లైన్లలో ఏర్పడిన లీకేజీ నివారణ పనులు చేపట్టనున్నారు. ఈ క్రమంలోనే ఈనెల 5 ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు సాయంత్రం 6 గంటలకు చేపడతారు. ఈ 36 గంట పాటు వివిధ ప్రాంతాలలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. అంతరాయం ఏర్పడే ప్రాంతాలు.. ఆదిబట్ల, కమ్మగూడ, గుర్రంగూడ, బీఎన్‌రెడ్డి నగర్, వనస్థలిపురం, ఆటోనగర్, అల్మాపురి, బీరప్పగడ్డ, హబ్సిగూడ, రామంతాపూర్, వెంకటరెడ్డి నగర్, ఉప్పల్, నాచారం, హెచ్ఎంటీ నగర్, తార్నాక, బౌద్ధనగర్, లాలాపేట్ (పాక్షికం), హస్మత్పేట్, ప్రకాశ్‌నగర్, మేకలమండి, భోలక్‌పూర్ (పాక్షికం), పద్మారావునగర్, బేగంపేట్, సౌత్ సెంట్రల్ రైల్వే, ఎంఈఎస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, లాలాగూడ, అడ్డగుట్ట, పట్టిగడ్డ, నల్లగుట్ట, గౌతమ్నగర్, ఫిరోజ్‌గూడ, బన్సీలాల్‌పేట్, రాంగోపాల్‌పేట్, సీతాఫల్‌మండి, మెట్టుగూడ, వైశాలీనగర్, మీర్‌పేట్, బడంగ్‌పేట్, ఏఆర్సీఐ, బాలాపూర్, ప్రశాసన్నగర్ (పాక్షికం) ప్రాంతాల్లోని వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి అధికారులు కోరారు.

## విద్యుత్ ప్రజాబాట – బస్తీబాట



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** ఎస్పిడిసిఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజాబాట బస్తీబాట కార్యక్రమం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంలో విశేష ఫలితాలను సాధిస్తోంది. విద్యుత్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, వినియోగదారుల సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి తక్షణ పరిష్కారం అందించడం లక్ష్యంగా ప్రతి మంగళవారం, గురువారం అధికారులు నేరుగా ప్రజలతో మమేకమవుతూ గ్రామాలు, బస్తీలు, కాలనీలలో పర్యటిస్తున్నారు. కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, సూచనలను వెంటనే పరిశీలించి పరిష్కార చర్యలు చేపడుతున్నారు. 1 ఏప్రిల్ నుంచి అక్టోబర్ 1 వరకు ప్రజాబాట బస్తీబాట కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రధాన పనుల్లో..డీటీఆర్ ఏబీ స్విచ్ల మరమ్మతులు 5,521,డీటీఆర్ డిస్ట్రిబ్యూషన్ బాక్సల మార్పిడి 2,885, డీటీఆర్ కేబుళ్ల మార్పిడి 4,924, హెచ్జీ ఫ్యూజ్ సెట్ల మరమ్మతులు 3,870, డీటీఆర్ ప్లింత్ ఎత్తు పెంపు పనులు 2,498, యార్డ్ క్లీనింగ్ పనులు 16,827 వదులైన విద్యుత్ లైన్లు సరిదిద్దడం, స్పేసర్ల ఏర్పాటు 16,832, విద్యుత్ లైన్లపై పెరిగిన తీగలు, వృక్షల తల తొలగింపు 8,384, చెట్ల కొమ్మల తొలగింపు (ట్రీ కట్టింగ్) 5,317, వంగిన, ఒరిగిన విద్యుత్ స్తంభాల సరిదిద్దడం 6,399, మొత్తంగా 73,457కు పైగా నిర్వహణ, భద్రతా, వినియోగదారుల సేవలకు సంబంధించిన సమస్యలను గుర్తించి పరిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్ మాట్లాడుతూ, విద్యుత్ సేవల నాణ్యతను మెరుగుపరచడం, అంతరాయాలను తగ్గించడం, ప్రజలకు సురక్షితమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడం లక్ష్యంగా ప్రజాబాట బస్తీబాట కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రజలు 1912 కాల్ సెంటర్, స్థానిక విద్యుత్ అధికారులను లేదంటే ప్రజాబాట బస్తీబాట కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** మహిళల్లో రొమ్ము క్యాన్సర్ అవగాహన కల్పించడంతో పాటు ముందస్తు వ్యాధి నిర్ధారణ ప్రాధాన్యతను చాటి చెప్పే లక్ష్యంతో సికింద్రాబాద్‌లోని మెడికవర్ హాస్పిటల్స్‌లో శనివారం 'పింక్ అక్టోబర్' ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ నివేద్ రావు బల్మూరి మాట్లాడుతూ, 40 ఏళ్లు దాటిన మహిళలు, కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర ఉన్నవారు తప్పనిసరిగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రొమ్ములో ఏవైనా గడ్డలు, మార్పులు లేదా అసాధారణ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని, సకాలంలో గుర్తిస్తే క్యాన్సర్ను పూర్తిగా నయం చేయవచ్చని పేర్కొన్నారు.అక్టోబర్ 31 వరకు కొనసాగే ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా రిజిస్టర్ చేసుకున్న మహిళలకు ఉచితంగా ఆంకాలజిస్ట్ కన్సల్టేషన్, క్యాన్సర్ రిస్క్ అసెస్మెంట్, కౌన్సెలింగ్తో పాటు అవసరమైన వారికి ఉచిత బ్రెస్ట్ అల్ట్రాసౌండ్ (యూఎస్జీ) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు కాంగ్రెసుకు మద్దతుగా నిలువాలి

సర్ తాండూరు నియోజకవర్గ కన్వీనర్ పురుషోత్తమ్‌రావు

**ప్రజాపక్షం/తాండూరు:** పట్టభద్రులు రానున్న ఎంఎల్‌సి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఉండాలని టిపిసిసి ప్రచార కమిటి రాష్ట్ర కోఆర్డినేటర్, తాండూరు నియోజకవర్గం సర్ కన్వీనర్ కరణం పురుషోత్తమ్‌రావు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌మహబూబ్‌నగర్‌రంగారెడ్డి పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల దృష్ట్యా తాండూరు నియోజకవర్గ పరిధిలోని అర్హులైన పట్టభద్రులు ప్రతి ఒక్కర విధిగా ఓటు నమోదు చేసుకోవాలని కేపిరావు పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన మూడు సంవత్సరాలు పూర్తయిన ప్రతి అర్హత కల్గిన పట్టభద్రుడు ఫాం నెంబర్ 18 ద్వారా ఆన్‌లైన్ లేదా సంబంధిత తహసిల్దార్ కార్యాలయంలో ఓటు నమోదు చేసుకోవాలని, ఇందుకు గాను ఓటరు కార్డు, డిగ్రీ సర్టిఫికెట్ లేదా సమానమైన విద్యార్హత గల సర్టిఫికెట్, ఆధార్ కార్డు, గజిటేడ్ ఆఫిసర్ ధృవీకరణ పత్రం జత చేసి తహసిల్దార్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దాదాపు 60వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తి చేపట్టడం జరిగిందని ఆయన పేర్కోన్నారు. ఉద్యోగులు పెన్షనర్లకు రెండు డిఎలు, మంజూరు చేసేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం సంతోషదాయకరమైన విషయమన్నారు. తాండూరు నియోజకవర్గంలో నిరుద్యోగ యుతవ కోసం స్థానిక ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి ఆద్వర్యంలో జాబ్ మేళా నిర్వహించి పలువురు పట్టభద్రులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. ప్రస్తుతం పట్టభద్రులు, నిరుద్యోగ యువత కోసం ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. బాగస్వాములు కావాలని కరణం పురుషోత్తమ్‌రావు ఆ ప్రకటనలో కోరారు.

## ఆర్‌పిఐ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(అథవాలి) పార్టీ 69 వసంతాల కార్యక్రమం లక్డికాపూల్ సౌత్ ఇండియా కార్యాలయంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొంపల్లి ప్రభుదాస్, ప్రత్యేక అతిథిగా అయిరేణి శ్రవణ్ కుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీ అధినేత, ఎంపి రాందాస్ అథవలే విజయవంతంగా మూడు పర్యాయాలు ఎంపిగా ఎంపికవడంతో పాటు కేంద్ర మంత్రి వర్గంలో కొనసాగుతుండటం సామాన్య విషయం కాదన్నారు. అంబేద్కర్ ఏర్పాటు చేసిన పార్టీని అతవాలే భుజాలపై వేసుకొని కొనసాగిస్తున్నారనే విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా నాయకులు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, మన్నె శ్రీధర్, గోపు రమేష్, మోజెస్, మహిళా విభాగం నాయకురాలు రోజా రమణి, గులాం, శ్రీనివాస్, మహేందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణి వారోత్సవాలు



**ప్రజాపక్షం/బహదూర్‌పురా:** వన్యప్రాణి వారోత్సవాలలో భాగంగా జూపార్క్‌లో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. జూ ఆవరణలో సుమారు 150 మొక్కలను నాటారు. జూపార్క్ క్యూరేటర్ జె.వసంత ఎర్ర చందనం మొక్కను నాటగా, డిప్యూటీ క్యూరేటర్ జె.మురళీధర్ 'తన్ని' మొక్కను నాటారు. మొసళ్ల కొలను సమీపంలో మహిళా బృందం 'రేగిస' మొక్కను నాటారు. ఈ మొక్కల పెంపకం కార్యక్రమంలో జూ సిబ్బంది, సందర్శకులు కూడా పాల్గొన్నారు. అనంతరం ఖడ్గ మృగం ఎన్‌క్లోజర్ వద్ద వన్యప్రాణి సంరక్షణపై అవగాహన కల్పించే కార్యక్రమం, జంతు సంరక్షకుని ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జంతు సంరక్షకుడు దేవేందర్, ఖడ్గ మృగం ప్రవర్తన, ఆయుర్దాయం, జూలో వాటి ఆహారపు అలవాట్ల గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో సుమారు 1,200 మంది సందర్శకులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ @ ఫైనాన్సర్

**ప్రజాపక్షం/చార్మినార్:** ఓ వ్యక్తి కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూనే ఫైనాన్సియర్ అవతారమెత్తారు. ఇక డబ్బులు వసూలు చేసేందుకు రౌడీలను రంగంలోకి దింపి వారిని ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఓ బాధితుడు ధైర్యం చేసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వ్యవహారం వచ్చింది. వివరాలలోకి వెళితే.. గతంలో చార్మినార్ పిఎస్‌లో విధులు నిర్వహించే కానిస్టేబుల్ సాదత్ అలీ ఇటీవల భవానీనగర్ పిఎస్‌కు బదిలీ అయ్యాడు. ఉన్నతాధికారుల వద్ద విధులు నిర్వహిస్తున్న అహంకారం తోడవ్వడంతో ఫైనాన్స్ దందాలోకి అడుగుపెట్టాడు. అతను జాఫర్, వసీం, సజ్జాద్, తాహిర్, బారి, ఫైజాన్, జావేద్, సమీర్, ఎంఎ ఖదీర్ వంటి పలువురు యువకులకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున రుణాలు ఇచ్చి, 50 రోజుల్లోగా రూ.70 వేలు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశాడు. రుణగ్రహీతలు ఒక్క రోజు గడువు తప్పినా, అలీ వారు చేసిన చెల్లింపులను రద్దు చేసి, మొత్తం డబ్బును మళ్లీ డిమాండ్ చేసేవాడు. వసూళ్లను బలవంతంగా రాబట్టేందుకు స్థానిక రౌడీషీటర్లను రంగంలోకి దింపుతాడు. ఇవన్నీ తట్టుకోలేక ఓ బాధితుడు భవానీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అలీపై దర్యాప్తు మొదలయ్యింది.

# సత్యం అణచివేయబడ్డ చోట నేనుంటా!

- వివిధ సమస్యల ఆధారిత నిరసనలను ఏకం చేయడమే 'సత్యాగ్రహ' లక్ష్యం
- డిజిటల్ వేదికను ప్రారంభించిన ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ :** దేశంలో బిజెపి పాలనలో సత్యం అణచివేయబడుతుందని, దానిని కాపాడడం తన బాధ్యత అని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న వివిధ సమస్యల ఆధారిత నిరసనలను ఏకం చేసే లక్ష్యంతో 'సత్యాగ్రహ' అనే డిజిటల్ వేదికను శనివారం ఆయన ప్రారంభించారు. మహాత్మా గాంధీ 157వ జయంతి మరుసటి రోజున ఆయన ఈ 'సత్యాగ్రహ' వేదికను ప్రారంభించారు. సత్యం ఎక్కడైతే అణచివేయబడుతుందో అక్కడ ప్రజలకు అండగా నిలిచేందుకు, ప్రభుత్వంపై తమ నిరసనలను ఈ వేదికపై నమోదు చేయాలని ఆయన ప్రజలను కోరారు. 'దేశవ్యాప్తంగా ప్రజలు తమ హక్కుల కోసం పోరాడుతున్నారు, అయితే తరచుగా ఒంటరిగానే పోరాడుతున్నారు. జెన్ జీ (యువత), విద్యార్థులు, రైతులు, ఆదివాసీలు, దళితులు, మహిళలు ఇలా ప్రతి పోరాటానికి ఒక ప్రత్యేక కథనం ఉంటుంది. అయితే ఒంటరి గళాన్ని అణచివేయడం సులభం. 'ఈ గళాలన్నింటినీ ఒకే వేదిక ద్వారా ఏకం చేసే ప్రయత్నమే 'సత్యాగ్రహ' అని రాహుల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. మహాత్ముడిని స్మరించుకుంటూ, 'సత్యమే మన గొప్ప ఆయుధమని బాపూజీ మనకు నేర్పారు. కానీ సత్యం పక్షాన అందరం కలిసి నిలబడటం అంతకంటే గొప్ప ఆయుధం. మీరు కూడా ఏదైనా అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతుంటే, మీ కథనాన్ని పంచుకోండి. దీనికి కేవలం రెండు నిమిషాలు మాత్రమే పడుతుంది' అని ప్రతిపక్ష నేత పిలుపునిచ్చారు. తమ నిరసన 'సత్యాగ్రహ' మ్యాప్‌లో చోటు చేసుకుంటుందని చెప్పిన రాహుల్, 'మీలాగే తమదైన పోరాటం చేస్తున్న ఇతరులు ఎవరో కూడా మీరు ఇందులో చూడవచ్చు' అని తెలిపారు. 'మీకు అండగా నిలవడానికి పార్లమెంటులో, వీధుల్లో, లేఖల ద్వారా లేదా ఎక్కడ అవసరమైతే అక్కడ నా శక్తిమేర కృషి చేస్తాను. ప్రతిపక్ష నాయకుడిగా అది నా బాధ్యత. మీ సత్యాగ్రహ కథనాన్ని నాకు తెలియజేయండి' అని ఆయన సూచించారు. భూమి హక్కులు, మహిళల హక్కులు, దళిత హక్కులు, ఒబిసి హక్కులు, విద్య, పరీక్షలకు సంబంధించిన నిరసనలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయన్నారు. ఈ నిరసనలను వ్యవస్థీకృతం చేయడంలో, వాటిని ఒకే మ్యాప్‌లో చేర్చడంలో, మీరు పోరాడుతున్న సమస్యల పరిష్కారానికి



సహాయపడేలా మీతో కలిసి పనిచేయాలని తాము కోరుకుంటున్నామన్నారు. 'ప్రతిపక్ష నాయకుడిగా, సత్యాన్ని అణచివేస్తున్న చోట ప్రజలు ప్రతిఘటించడానికి సహాయం చేయడం నాకు ముఖ్యం. సత్యం ముఖ్యం. ఇది అత్యున్నత స్థాయిలలో ముఖ్యమైనది, కానీ దేశంలోని ప్రతి మూలలో దాని కోసం మనం పోరాడటం ముఖ్యం' అని గాంధీ తన వీడియో సందేశంలో అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా శుక్రవారం నిరసన తెలిపిన ప్రజలపై పోలీసుల చర్యను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ తీవ్రంగా ఖండించారు. ఈ చర్యలో కనీసం 700 మందిని అదుపులోకి తీసుకున్నారు. వివిధ రకాల ప్రతిఘటనలను ఒకే వేదికపైకి తీసుకురావడమే 'సత్యాగ్రహ' వెబ్‌సైట్ లక్ష్యమని ఆయన నొక్కి చెప్పారు. 'దొంగిలించిన ఓట్లతో అక్రమంగా ఏర్పడిన ఈ ప్రభుత్వం, శాంతియుత నిరసనలు చేపట్టడం మన రాజ్యాంగ హక్కు అయినప్పటికీ, పౌరులను, విద్యార్థులను, కాంగ్రెస్ కార్యకర్తలను నిర్బంధిస్తూ వారిని అడ్డుకుంటోంది. కానీ దీనివల్ల ఎవరూ భయపడలేదు, అణచివేయబడలేదు. నిరసనలు శనివారం కూడా కొనసాగుతున్నాయి, ప్రజలు తమ గళాన్ని వినిపిస్తూనే ఉంటారు' అని ఆయన అన్నారు.

# 10న 'చలో ఢిల్లీ'

- శాంతియుత నిరసన ప్రదర్శనలకు సిజెపి పిలుపు
- దేశ నలుమూలల నుంచి నిరసనకారులు తరలివస్తారని వెల్లడి



**న్యూఢిల్లీ :** భారత ఎన్నికల ప్రధాన కమిషనర్(సిఇసి)జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయకపోతే 10న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మరోసారి పెద్ద ఎత్తున నిరసనకు దిగుతామని హెచ్చరించింది. ముంబయిలోని శివాజీ పార్కులో వేలాది మందితో భారీ ప్రదర్శన నిర్వహించిన అనంతరం కాక్రోచ్ జనతా పార్టీ మరో కీలక ప్రకటన చేసింది. 10న జంతర్‌మంతర్ వద్ద జరిగే నిరసనకు దేశం నలుమూలల నుంచి నిరసనకారులు ఢిల్లీకి తరలివస్తారని తెలిపింది. ఈ శాంతియుత ఆందోళనలో ప్రజలు, పౌరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎక్స్ పోస్టులో వెల్లడించారు. 'జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకపోతే, అక్టోబర్ 10న భారతదేశ నలుమూలల నుంచి ఢిల్లీకి పాదయాత్ర చేసి జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతాం. ఈ క్రమంలో దారిలో ఎక్కడైనా ఢిల్లీ పోలీసులు మమ్మల్ని అడ్డుకుంటే, వారు ఎక్కడైతే ఆపుతారో అదే మాకు జంతర్‌మంతర్ అవుతుంది. ప్రజాస్వామ్యాన్ని, పారదర్శకమైన ఎన్నికలను కాపాడేందుకు మేం గాంధీ మార్గాన్ని అనుసరిస్తాం. పారదర్శకమైన ఎన్నికలను ఎవరైతో కోరుకుంటారో వారు మాతో రావాలి' అని అభిజీత్ దీప్కే, పేర్కొన్నారు. ఈ ఢిల్లీ నిరసన అహింసా తత్వాన్ని కచ్చితంగా పాటిస్తుందని దీప్కే స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల విశ్వాసాన్ని కాపాడటానికి చరిత్రాత్మక శాసనోల్లంఘన నుంచి నిర్మాణాత్మక స్ఫూర్తిని పొందుతుందని దీప్కే పేర్కొన్నారు. అయితే, తమ ఉద్యమాన్ని ఎవరూ అడ్డుకోలేరని, అందుకు గతంలో జరిగిన నిరసన ప్రదర్శనలు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి చేసే పోరాటమని దీప్కే అన్నారు.

**ముంబయి నిరసనలు అనంతరం 'చలో ఢిల్లీ'కి పిలుపు**

అంతకుముందు, ముంబయిలోని శివాజీ పార్క్‌లో సిజెపి భారీ నిరసన ప్రదర్శన చేపట్టింది. ఈ నిరసనలకు ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించినప్పటికీ యువతి, యువకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అయితే, ముంబయిలో లభించిన భారీ ప్రజా మద్దతు అనంతరం సిజెపి 'చలో ఢిల్లీ'కి పిలుపునిచ్చింది. ముంబయిలో జరిగిన నిరసన ప్రదర్శనలో దీప్కే మాట్లాడుతూ, సిఇసి జ్ఞానేశ్ కుమార్ తన పదవి నుంచి వైదొలగేంత వరకు ఈ ఉద్యమం ఆగదన్నారు. ఢిల్లీలో మరో 'జంతర్ మంతర్ 2.0' వస్తుందని హెచ్చరించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని తెలిపారు.

# ఇసిఐనెట్ వివాదం మోదీకి ముందే తెలుసు : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** పోర్టల్ వ్యవహారం గురించి ప్రధాని నరేంద్ర మోదీకి ముందే తెలుసని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ ఆరోపించారు. ఇసిఐ నెట్‌పై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు వ్యక్తం చేసిన అభ్యంతరాలు కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ (డిఒపిటి) వరకు వెళ్లాయని ఆయన చెప్పారు. డిఒపిటి బాధ్యతలు ప్రధాని వద్ద ఉన్నందున, ఆ వ్యవహారం గురించి మోదీకి సమాచారం ఉండే అవకాశం ఉందని రమేశ్ పేర్కొన్నారు. అంతేకాదు, ఆ నిర్ణయాలు ప్రధాని దిశానిర్దేశంతోనే జరిగి ఉండొచ్చని ఆయన ఆరోపణలు చేశారు. అదే సమయంలో జులైలో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు క్యాబినెట్ కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్లు చెబుతున్న ఒక అధికారి ఇప్పటికీ ఎన్నికల సంఘం ఐటి వ్యవహారాల్లో కీలక బాధ్యతల్లో ఉన్నారని జైరామ్ రమేశ్ ఆరోపించారు. ఆ అధికారిపై చర్యలు తీసుకోకుండా, ఆ తర్వాత ఇసి ఐటి విభాగాన్ని పర్యవేక్షించే బాధ్యతలు అప్పగించారని ఆయన అన్నారు. ఆ



అంశం కూడా ఎన్నికల సంఘంలో నిర్ణయాలు ఎలా తీసుకుంటున్నారనే దానిపై కొత్త ప్రశ్నలకు కారణమవుతోందని కాంగ్రెస్ చెబుతోంది. మొత్తం వివాదానికి నేపథ్యం సర్ ప్రక్రియ. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో సర్‌కు సంబంధించిన కొన్ని నిర్ణయాలు, ఆదేశాలపై కనీసం 14 సార్లు రికార్డులో అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు పేర్కొంది. ఈ నివేదికల తర్వాత ఎన్నికల సంఘం సెప్టెంబర్ 26న కీలక సమావేశం నిర్వహించింది. అందులో ముగ్గురు ఎన్నికల కమిషనర్లు పాల్గొన్నారు. అనంతరం ఇసిఐ నెట్ వ్యవస్థను చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ కమిటీకి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నేతృత్వం వహించనుండగా, ఐఐటి లేదా ఐఐఐటికి చెందిన స్వతంత్ర నిపుణుడిని కూడా ఇందులో చేర్చనున్నారు.

## హాకీజట్టులో మాదిరిగానే... పంజాబ్ రాష్ట్ర కాంగ్రెస్‌లోనూ 'ఫుల్ బ్యాక్' పాత్ర నిర్వర్తిస్తా

పార్టీ నూతన చీఫ్ పర్గట్ సింగ్ వెల్లడి

**న్యూఢిల్లీ :** పంజాబ్ కాంగ్రెస్ బృందం చాలా బాగుందని, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలన్నింటినీ ఏకగ్రీవంగా తీసుకుంటామని పంజాబ్ రాష్ట్ర కాంగ్రెస్ నూతన చీఫ్ పర్గట్ సింగ్ అన్నారు. పంజాబ్ కాంగ్రెస్‌లోని వర్గపోరును ఆయన తక్కువ చేసి చూపిస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ హాకీ ఆటగాడు, భారత హాకీ జట్టు కెప్టెన్ అయిన పర్గట్ సింగ్ మాట్లాడుతూ జట్టుకు వెనకనుండి మద్దతు ఇచ్చే స్థానమైన 'ఫుల్ బ్యాక్'గా తాను ఎల్లప్పుడూ ఆడానని, పార్టీలోని ఇతర సీనియర్ సభ్యులకూ ప్రాధాన్యతనిస్తూ, పార్టీలోనూ అదే పాత్రను కొనసాగిస్తానని చెప్పారు. దేశంలో ప్రస్తుతం నియంతృత్వం ఉన్నదని, 'మనం ప్రజాస్వామ్యాన్ని తిరిగి తీసుకురావాలి' అని దానికోసం తాము పోరాడతామని మాజీ ఒలంపియాడ్ క్రీడాకారుడైన పర్గట్ సింగ్ అన్నారు. 'నేను ఎల్లప్పుడూ జట్టు సభ్యుడిగా వ్యవహరిస్తాను. నా సీనియర్లు అందరూ నన్ను ఎల్లప్పుడూ గౌరవిస్తారు. మేంఅన్ని నిర్ణయాలను గౌరవిస్తాం. నేనెప్పుడూ వెనకభాగంలో 'ఫుల్ బ్యాక్'లా ఆడాను. మా జట్టులో చాలా మంచి ఆటగాళ్లు ఉన్నారని నేను భావిస్తున్నాను' అని జాతీయ రహదారికి చేరుకున్న తర్వాత సింగ్ విలేకరులతో అన్నారు. దాదాపు నాలుగైదేళ్లు పంజాబ్ రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన అమరీందర్ సింగ్ రాజా స్థానంలో భారత జాతీయ పురుషుల హాకీ జట్టు మాజీ కెప్టెన్ పర్గట్ సింగ్ శుక్రవారం పంజాబ్ రాష్ట్ర నూతన కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. వచ్చే ఏడాది ప్రారంభంలో జరుగనున్న పంజాబ్ రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో పార్టీ రాష్ట్ర విభాగం వర్గపోరుతో సతమతమవుతోన్న నేపథ్యంలో సింగ్ రాక ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. మేం ఒక జట్టు. ఇది రాహుల్ గాంధీ జట్టు. మేం దేశంలో నిర్మాణాత్మక రాజకీయాలను తీసుకొస్తాం. దేశం నియంతృత్వాన్ని చూస్తున్నందున మనం ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలి' అని పర్గట్ సింగ్ విలేకరులతో అన్నారు. అనంతరం సింగ్ గురుద్వారా బంగ్లా సాహిబ్‌లో నమస్కరించారు.భారత మహిళల హాకీ జట్టు గెలుచుకున్న స్వర్ణ పతకం తనకు లభించిన గొప్ప బహుమతి అని, అంతకంటే గొప్ప బహుమతి మరొకటి ఉండదని ఆయన ఇటీవలి తన నియామకం గురించి వ్యాఖ్యానించారు.

# రెండు పార్లమెంటరీ కమిటీల అధ్యక్ష బాధ్యతలు కోల్పోయిన టిఎంసి

**న్యూఢిల్లీ:** వివిధ శాఖలకు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీసంఘాలను లోక్‌సభ స్పీకర్,రాజ్యసభ ఛైర్మన్‌లు పునర్వ్యవస్థీకరించడంతో తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ (టిఎంసి) రెండు స్థాయీసంఘాలకు సంబంధించిన ఛైర్మన్ పదవులను కోల్పోయింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా,రాజ్యసభ ఛైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ వివిధ పార్లమెంటరీ కమిటీలను పునర్వ్యవస్థీకరించారు. దీంతో వాణిజ్యంపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్థాయీసంఘానికి కొత్త ఛైర్‌పర్సన్‌గా బిజెపికి చెందిన సుధాంషు త్రివేదీ నియమితులయ్యారు. ఇప్పటివరకూ తృణమూల్ కాంగ్రెస్‌పార్టీకి చెందిన డోలా సేన్ ఈ స్థాయీ సంఘానికి ఛైర్‌పర్సన్‌గా ఉండేవారు. అదేవిధంగా రసాయనాలు, ఎరువులకు సంబంధిచిన పార్లమెంటరీ స్థాయీసంఘం ఛైర్‌పర్సన్‌గా తృణమూల్ కాంగ్రెస్ తిరుగుబాటు వర్గానికి చెందిన కాకోలీ ఘోష్ దస్తిదార్ ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. ఇప్పటివరకూ ఈ స్థాయీసంఘం ఛైర్‌పర్సన్‌గా కీర్తీ ఆజాద్ ఉండేవారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార టిఎంసి ఓడిపోయిన తర్వాత ఆ పార్టీలో తిరుగుబాటు జరిగింది. తిరుగుబాటు వర్గం బిజెపికి విధేయంగా మారింది. దీంతో పునర్వ్యవస్థీకరణ వల్ల ఈ పార్లమెంటరీ కమిటీ ఛైర్‌పర్సన్ బాధ్యత తిరుగుబాటు వర్గానికే దక్కింది.

కాగా డిఎంకె ఎంపీ తిరుచ్చి శివను పరిశ్రమలకు సంబంధించిన పార్లమెంటరీ కమిటీ ఛైర్‌పర్సన్‌గా తిరిగి నియమితులయ్యారు. అదేపార్టీకి చెందిన మరో ఎంపీ కె.కనిమొళి కూడా ఆహారం, వినియోగదారుల వ్యవహారాలు, ప్రజా పంపిణీపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ ఛైర్‌పర్సన్‌గా తిరిగి నియమితులయ్యారు. బిజెపికి కీలకమైన మిత్రపార్టీలైన జెడి–యు, శివసేన, తెలుగుదేశంపార్టీలకు చెందిన ఎంపీలు కూడా ఛైర్‌పర్సన్ పదవులను కోల్పోకుండా వాటిల్లో కొనసాగుతున్నారు. ప్రతిపక్ష నాయకులు శశిథరూర్, చరన్‌జిత్ సింగ్ ఛన్ని(ఇద్దరూ కాంగ్రెస్‌ఎంపీలే)లు వరుసగా విదేశీ వ్యవహారాలు,వ్యవసాయానికి సంబంధించిన పార్లమెంటరీ కమిటీల ఛైర్‌పర్సన్ పదవులలో కొనసాగుతున్నారు. కాంగ్రెస్ ఎంపి ముకుల్ వాస్నిక్ కూడా విద్య, మహిళలు, పిల్లలు, యువతకు సంబంధించిన పార్లమెంటరీ కమిటీ ఛైర్‌పర్సన్ పదవులను నిలబెట్టుకున్నారు. సమాజ్‌వాదీపార్టీకి చెందిన రామ్ గోపాల్ యాదవ్ కూడా ఆరోగ్యం,కుటుంబ సంక్షేమానికి సంబంధించిన పార్లమెంటరీ



కమిటీ ఛైర్‌పర్సన్ పదవిని నిలబెట్టుకున్నారు. బిజెపి ఎంపి రాధామోహన్‌సింగ్ రక్షణకు సంబంధించి, జెడి–యు ఎంపి సంజయ్ కుమార్ ఝా రవాణా, టూరిజం, సంస్కృతికి సంబంధించిన పార్లమెంటరీ కమిటీలకు ఛైర్‌పర్సన్‌లుగా తిరిగి నియమితులయ్యారు. అదేవిధంగా శివసేనకు చెందిన ఎంపీ శ్రీరంగ్ బర్నే కూడా ఇంధనరంగంపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ ఛైర్‌పర్సన్ పదవిని తిరిగి నిలబెట్టుకున్నారు. సిబ్బంది, ప్రజాసమస్యల పరిష్కారం, చట్టం, న్యాయాలకు సంబంధించిన పార్లమెంటరీ కమిటీ ఛైర్‌పర్సన్ పదవిలో ఇప్పటివరకూ బిజెపి ఎంపీ బ్రిజ్‌లాల్ కొనసాగారు. ఆయన స్థానంలో ఆ పదవిలో బిజెపికే చెందిన ఎంపీ సుజీత్ కుమార్ నియమితులయ్యారు. కేంద్ర మాజీమంత్రి అనురాగ్ ఠాకూర్ బొగ్గు, గనులు, ఉక్కు శాఖలకు సంబంధించిన పార్లమెంటరీ కమిటీ ఛైర్‌పర్సన్ బాధ్యతల్లో తిరిగి నియమితులయ్యారు. బిజెపి ఎంపీ రాజీవ్ ప్రతాప్ రూడీ కూడా జలవనరులకు సంబంధించిన కమిటీ ఛైర్‌పర్సన్ పదవిని నిలబెట్టుకున్నారు.బిజెపి ఎంపి భర్తృహరి మహతాబ్ కూడా ఆర్థికశాఖ కమిటీ ఛైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు.అదేపార్టీకి చెందిన ఆయన సహచర ఎంపీ రాధామోహన్‌దాస్ అగర్వాల్ కూడా దేశీయ వ్యవహారాల కమిటీ ఛైర్‌పర్సన్ పదవి నిలబెట్టుకున్నారు.మరో బిజెపి ఎంపీ నిషికాంత్ దూబే కూడా కమ్యూనికేషన్స్,ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కమిటీ అధిపతిగా పదవిలో తిరిగి నియమితులయ్యారు.అదేవిధంగా మహారాష్ట్ర ఎంపీ మేధా విశ్రామ్ కుల్‌కర్ణి కూడా తిరిగి నియమితులయ్యారు. రైల్వేలకు సంబంధించిన కమిటీ ఛైర్‌పర్సన్‌గా ఇప్పటివరకూ బాధ్యతలు నిర్వహించిన సి.ఎం రమేష్ స్థానంలో బిజెపికే చెందిన సుధీర్‌గుప్తా నియమితులయ్యారు. కాంగ్రెస్‌కు చెందిన ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక కూడా పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి కమిటీ ఛైర్‌పర్సన్‌గా తిరిగి నియమితులయ్యారు.

# ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోపు ... ఎంఆర్‌ఎఫ్‌ఎ ఒప్పందానికి భారత్ సిద్ధం

ఎయిర్ చీఫ్ మార్షల్ ఎపి.సింగ్ వెల్లడి

**న్యూఢిల్లీ :** ప్రణాళికా ప్రకారం విషయాలు అనుకూలిస్తే, ఎంతో కాలంగా ఎదురుచూస్తోన్న మల్టీ–రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్(ఎంఆర్‌ఎఫ్‌ఎ) ఒప్పందాన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోగా ఖరారు చేయాలని భారత్ చూస్తోందని చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్, ఎయిర్ చీఫ్ మార్షల్ ఎపి. సింగ్ శనివారం తెలిపారు. భారత వైమానిక దళం పోరాట సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఈ ప్రణాళికను మొదట ప్రతిపాదించిన దాదాపు రెండు దశాబ్దాల తర్వాత, భారతదేశం, తన చరిత్రలోనే అతిపెద్ద రక్షణ కొనుగోళ్ల చర్యగా, ఫ్రాన్స్‌తో ప్రభుత్వ ఒప్పందం కింద 114 రఫేల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసేందుకు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనకు ఫిబ్రవరిలో ఆమోదం తెలిపింది. ప్రాజెక్ట్‌కు సంబంధించిన ధరల చర్చలు, ఇతర



కీలక అంశాలపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. వాయుసేన దినోత్సవానికి ముందు జరిగిన విలేకరుల సమావేశంలో ఎయిర్ చీఫ్ మార్షల్ ఎపి. సింగ్ మాట్లాడుతూ, అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ (ఎఎంసిఎ) కార్యక్రమం ఆలస్యమైతే, వాయుసే మరో ప్లాట్‌ఫామ్‌ను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి రావచ్చని ఆయన చెప్పారు. 'రష్యా మాకు ఎస్‌యు–57 జెట్లను ఆఫర్ చేసింది. కానీ, దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు' అని సింగ్ పేర్కొన్నారు. ఫైటర్ స్క్వాడ్రన్ల సంఖ్య తగ్గిపోవడానికి గల కారణం ఏమిటని అడిగిన ఒక ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ, రాబోయే కొన్ని ఏళ్లలో భారత వైమానిక దళానికి (ఐఎఎఫ్) ఏటా కనీసం 36 నుంచి 40 విమానాలు అవసరమని ఎయిర్ చీఫ్ మార్షల్ సింగ్ తెలిపారు. మొత్తం సైనిక బలం విషయంలో వాయుశక్తి కీలకమని, భారతదేశం తన వాయుశక్తిని మరింతగా పెంచుకోవాల్సిన అవసరం ఉందని సింగ్ చెప్పారు. ఐఎఎఫ్ ఆధునీకరణ విషయమై ఆయన మాట్లాడుతూ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ద్వారా ఈ దళాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. 'మనకు ఏఐ అనుకూల దళం ఉండాలి' అని ఆయన చెప్పారు. మొత్తం పోరాట సంసిద్ధతకు ఆత్మనిర్భరత కీలకం అని సింగ్ వివరించారు. దేశంలోనే ఫైటర్ జెట్ ఇంజిన్‌ను ఉత్పత్తి చేయాల్సిన అవసరాన్ని వైమానిక దళ అధిపతి సింగ్ నొక్కిచెప్పారు.

**LOST PATTA PASSBOOK**

I, **MULUKALA SAMBAIAH, S/o. MULUKALA EEKMBRAM,** R/o. H.No. 14-110, Narsampet Municipality of Narsampet Mandal in Warangal District, Telangana State. hereby **I Lost my Original Passbook Patta No. T22080101182, Khatha No. 60779**, while traveling in Narsampet to Narsampet Bus Stand. If anybody found Return to the above Mentioned Address.
**Contact No: 9848576125, 9491530854.**

**IN THE COURT OF THE HON'BE Ist ADDL JUNIOR CIVIL JUDGE AT BHUPALPALLY.**
**OS. NO. 292 of 2024**
Between:
**1.Pillamari Ramesh**
**2.Pillamari Venkatswamy**
**.....Petitioners/Plaintiffs**
Vs
**1) The state of Telangana Rep By District collector**
**2) Whom so ever it may concern**
**...Respondents/defendants**
**NOTICE**
Where as the above named plaintiffs have filed a suit for declaration, declare the plaintiffs father is Deemed dead person i.e Pillamari Nagamallu the said case is posted on **07.10.2026** for your appearance at **10.30 AM** before the said court. Therefore you are here by directed to appear before the said court along with documents to claim your defence if any otherwise the matter will be decided ex parte against you.
By order of the court"
**Sd/-**
**CHEERLA ASHOK REDDY**
B.tech, LLB
**ADVOCATE**
**9849109050**

తెలంగాణప్రభుత్వము
రెవిన్యూ (భూ. సే ) విభాగం
**ఫారం VII**
(చట్టం 30/2013 యొక్క సెక్షన్ 19 లోని సబ్ రూల్(1) మరియు నియమము 25 లోని ఉప నియమము [1] ని అనుసరించి)
**డిక్లరేషన్**

**జిల్లా కలెక్టర్,జగిత్యాల గారి**
**ఫైల్ నెం.G1/787/2025** **తేది: 28.09.2026**

**రెవిన్యూ డివిజినల్ అధికారి జగిత్యాల**
**ఫైల్ నెం.E/338/2026.** **తేది: 23.09.2026**

తెలంగాణా ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, జగిత్యాల గారు జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని కోనాపూర్ గ్రామ పరిధిలో గల ఈ దిగువ షెడ్యుల్ నందు చూపబడిన భూమిమొత్తం విస్తీర్ణం **ఎ. 11.1075 గుంటల** భూమి ప్రజ ప్రయోజనర్థామై ఈ దిగువ నిర్దిష్టపరచిన ప్రజ ప్రయోగ నిమిత్తము, అనగా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ప్యాకేజీ-III క్రింద [1] సూరంపేట ప్రధాన ఎడమకాలువ (కి.మీ 2.400-3.800), [2]సూరంపేట ప్రధాన కుడి కాలువ యొక్క మైనర్-2TE (కి.మీ 1.200-1.600) [3] సూరంపేట ప్రధాన ఎడమకాలువ మైనర్-4TE (కి.మీ 0.000-0.470) మరియు [4] సూరంపేట ప్రధాన ఎడమకాలువ మైనర్-2R (కి.మీ 0.000-0.600)ల నిర్మాణ పనులకుగాను కోనాపూర్ గ్రామము యందు భూసేకరణ అవసరమున్నదని బావిస్తున్నారు.

కావున జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలము కోనాపూర్ గ్రామపరిధిలో ఉన్న భూమి విస్తీర్ణము **ఎ. 11.1075 గుంటల** యొక్క భూమి వివరములు, ఈ క్రింద చూపిన వానిని భూసేకరణ పనుల ప్రారంభ నిమిత్తం పబ్లికేషన్ ఆఫ్ డిక్లరేషన్ జారీచేయనైనది.

**షెడ్యూలు**

**గ్రామము: కోనాపూర్ మండలం: కొడిమ్యాల జిల్లా: జగిత్యాల**

**సూరంపేట ప్రధాన ఎడమకాలువ (కి.మీ 2.400-3.800)**

| క్ర. సం. | సర్వే నెం. | భూమి వర్గీకరణ (పట్టా/ప్రభుత్వం) | భూమి స్వభావము | భూసేకరణ చేయు విస్తీర్ణము | పేరు చిరునామా, భూమికి సంబంధించిన వారి వివరములు / పట్టాదారు | దిశలు తూ | ప | ఉ | ద | కట్టడాలు / చెట్లు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 1 | 218/ఆ/1/1/2 | పట్టా | ఖుష్కి | 0.0700 | న్యాలకంటి రాజయ్య తండ్రి ముత్తయ్య | 220 | సూరంపేట ప్రధాన కాలువ | 254 | తరి | లేవు |
| 2 | 218/ఆ/1/1/1/2 | పట్టా | ఖుష్కి | 0.0700 | న్యాలకంటి రమేష్ తండ్రి ముత్తయ్య | 220 | | 254 | తరి | 1 బోర్ (చిన్నది) |
| 3 | 218/ఆ/1/1/1/1 | పట్టా | ఖుష్కి | 0.0700 | న్యాలకంటి రాజయ్య తండ్రి ముత్తయ్య | 220 | | 254 | తరి | లేవు |
| 4 | 218 | పట్టా | ఖుష్కి | 0.0100 | [illegible] | 220 | | 254 | తరి | లేవు |
| 5 | 220/ఆ/1 | పట్టా | ఖుష్కి | 0.0050 | పెద్దిరెడ్డి [illegible] | 223 | 218 | 221 | తరి | లేవు |
| 6 | 220/ఆ/2 | పట్టా | ఖుష్కి | 0.0050 | పెద్ది తిరుపతి [illegible] | 223 | 218 | 221 | తరి | లేవు |
| 7 | 221/ఏ | పట్టా | ఖుష్కి | 0.0100 | [illegible] | 222 | 254 | 254 | 220 | 1- బోర్ బావి |
| 8 | 221/ఏ | పట్టా | ఖుష్కి | 0.0100 | [illegible] | 222 | 254 | 254 | 220 | లేవు |
| 9 | 221/ఈ | పట్టా | ఖుష్కి | 0.3400 | [illegible] | 222 | 254 | 254 | 220 | లేవు |
| 10 | 222/అ | పట్టా | ఖుష్కి | 0.1300 | [illegible] | 225 | 221 | 254 | 224 | 13- మామిడి |
| 11 | 222/ఆ | పట్టా | ఖుష్కి | 0.1100 | [illegible] | 225 | 221 | 254 | 224 | 15- మామిడి 31- టేకు (చిన్నవి) |
| 12 | 222/ఇ | పట్టా | ఖుష్కి | 0.1100 | [illegible] | 225 | 221 | 254 | 224 | 15- మామిడి |
| 13 | 225/అ | పట్టా | ఖుష్కి | 0.1900 | [illegible] | 229 | 222 | 230 | 226 | లేవు |
| 14 | 230/అ | పట్టా | ఖుష్కి | 0.0700 | [illegible] | 232 | 222 | 231 | 225 | లేవు |
| 15 | 230/ఆ | పట్టా | ఖుష్కి | 0.0700 | [illegible] | 232 | 222 | 231 | 225 | లేవు |
| 16 | 230/ఆ/1 | పట్టా | ఖుష్కి | 0.0700 | [illegible] | 232 | 222 | 231 | 225 | లేవు |
| 17 | 231/ఆ/1 | పట్టా | ఖుష్కి | 0.2300 | [illegible] | 232 | 254 | 253 | 230 | 12- మామిడి, 2- టేకు 1- అల్లనేరేడు, 1- కొబ్బరి |
| 18 | 232/అ | పట్టా | ఖుష్కి | 0.0900 | [illegible] | 233 | 231 | 245 | 229 | లేవు |
| 19 | 232/ఆ | పట్టా | ఖుష్కి | 0.0900 | [illegible] | 233 | 231 | 245 | 229 | లేవు |
| 20 | 243/ఈ | పట్టా | ఖుష్కి | 0.1250 | [illegible] | 241 | 244 | 247 | 233 | లేవు |
| 21 | 244 | పట్టా | ఖుష్కి | 0.1600 | [illegible] | 243 | 245 | 24 | 233 | లేవు |
| 22 | 245/ఈ | పట్టా | ఖుష్కి | 0.0500 | [illegible] | 246 | 253 | 249 | 232 | లేవు |
| 23 | 254/3 | అసైన్డ్ పట్టా | ఖుష్కి | 0.1400 | [illegible] | 221 | సూరంపేట ప్రధాన కాలువ | | 218 | లేవు |
| 24 | 254 | [illegible] | | 0.0100 | [illegible] | 221 | | | 218 | లేవు |
| 25 | 262/ఆ | పట్టా | ఖుష్కి | 0.0250 | [illegible] | 266 | 247 | 271 | 263 | లేవు |
| 26 | 263/ఆ | పట్టా | ఖుష్కి | 0.0900 | [illegible] | 264 | 243 | 262 | 242 | లేవు |
| 27 | 263/ఆ/1 | పట్టా | ఖుష్కి | 0.0900 | [illegible] | 264 | 243 | 262 | 242 | 1- బోర్ బావి |
| 28 | 266/ఆ | పట్టా | ఖుష్కి | 0.2000 | [illegible] | 267 | 263 | 268 | 264 | లేవు |
| | **మొత్తం విస్తీర్ణం : 6.26** | | | | | | | | | |

**(2) సూరంపేట ప్రధాన కుడి కాలువ యొక్క మైనర్-2TE (కి.మీ 1.200-1.600)**

| క్ర. సం. | సర్వే నెం. | భూమి వర్గీకరణ (పట్టా/ప్రభుత్వం) | భూమి స్వభావము | భూసేకరణ చేయు విస్తీర్ణము | పేరు చిరునామా, భూమికి సంబంధించిన వారి వివరములు / పట్టాదారు | దిశలు తూ | ప | ఉ | ద | కట్టడాలు / చెట్లు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 1 | 179 | పట్టా | మెట్ట | 0.0300 | [illegible] | 182 | 179 | 180 | 178 | బోర్ వెల్ |
| 2 | 180 | పట్టా | మెట్ట | 0.0450 | [illegible] | 182 | 179 | 181 | 79 | లేవు |
| 3 | 182ఆ/1 | పట్టా | మెట్ట | 0.0650 | [illegible] | 183 | 180 | 184 | 179 | పైప్ లైన్ |
| 4 | 182ఉ/2 | పట్టా | మెట్ట | 0.0650 | [illegible] | 183 | 180 | 184 | 179 | పైప్ లైన్ |
| 5 | 182ఋ | పట్టా | మెట్ట | 0.1500 | [illegible] | 183 | 180 | 184 | 179 | పైప్ లైన్ |
| 6 | 184అ | పట్టా | మెట్ట | 0.1200 | [illegible] | 183 | 180 | 186 | 182 | లేవు |
| | **మొత్తం విస్తీర్ణం : 1.07 1/2** | | | | | | | | | |

**(3) సూరంపేట ప్రధాన ఎడమ కాలువ మైనర్-4TE (కి.మీ 0.000-0.470)**

| క్ర. సం. | సర్వే నెం. | భూమి వర్గీకరణ (పట్టా/ప్రభుత్వం) | భూమి స్వభావము | భూసేకరణ చేయు విస్తీర్ణము | పేరు చిరునామా, భూమికి సంబంధించిన వారి వివరములు / పట్టాదారు | దిశలు తూ | ప | ఉ | ద | కట్టడాలు / చెట్లు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 1 | 266 | పట్టా | ఖుష్కి | 0.0150 | [illegible] | 267 | 262 | 268 | 264 | - |
| 2 | 270/అ | పట్టా | ఖుష్కి | 0.0500 | [illegible] | 325 | 271 | 324 | 269 | - |
| 3 | 271/అ | పట్టా | ఖుష్కి | 0.1175 | [illegible] | 270 | 271 | 273 | 266 | - |
| 4 | 271/ఆ | పట్టా | ఖుష్కి | 0.0500 | [illegible] | 270 | 271 | 273 | 266 | - |
| 5 | 271/ఇ | పట్టా | ఖుష్కి | 0.0400 | [illegible] | 270 | 271 | 273 | 266 | - |
| 6 | 271/ఈ | పట్టా | ఖుష్కి | 0.0125 | [illegible] | 270 | 271 | 273 | 266 | - |
| 7 | 272/అ | పట్టా | ఖుష్కి | 0.0100 | [illegible] | 273 | 260 | 278 | 271 | - |
| 8 | 272/ఆ/1 | పట్టా | ఖుష్కి | 0.0500 | [illegible] | 273 | 260 | 278 | 271 | - |
| 9 | 272/ఇ | పట్టా | ఖుష్కి | 0.0050 | [illegible] | 273 | 260 | 278 | 271 | - |
| 10 | 273/అ | పట్టా | ఖుష్కి | 0.0400 | [illegible] | 273 | 260 | 278 | 271 | - |
| 11 | 276/అ | పట్టా | ఖుష్కి | 0.0200 | [illegible] | 275 | 278 | 282 | 273 | - |
| 12 | 276/ఆ | పట్టా | ఖుష్కి | 0.0150 | [illegible] | 275 | 278 | 282 | 273 | - |
| 13 | 276/ఇ | పట్టా | ఖుష్కి | 0.0050 | [illegible] | 276 | 280 | 278 | 271 | - |
| 14 | 277/అ | పట్టా | ఖుష్కి | 0.0550 | [illegible] | 276 | 280 | 278 | 260 | - |
| | **మొత్తం విస్తీర్ణం : 1.08 1/2** | | | | | | | | | |

**(4) సూరంపేట ప్రధాన ఎడమ కాలువ మైనర్-2R (కి.మీ 0.000-0.600)**

| క్ర. సం. | సర్వే నెం. | భూమి వర్గీకరణ (పట్టా/ప్రభుత్వం) | భూమి స్వభావము | భూసేకరణ చేయు విస్తీర్ణము | పేరు చిరునామా, భూమికి సంబంధించిన వారి వివరములు / పట్టాదారు | దిశలు తూ | ప | ఉ | ద | కట్టడాలు / చెట్లు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 1 | 129/అ | పట్టా | తరి | 0.06 | [illegible] | ఒర్రె | [illegible] | 227 | 212 | లేవు |
| 2 | 220/అ | పట్టా | ఖుష్కి | 0.01 | [illegible] | 223 | 225 | 221 | 232 | లేవు |
| 3 | 220/ఆ | పట్టా | ఖుష్కి | 0.04 | [illegible] | 223 | 225 | 221 | 232 | లేవు |
| 4 | 221/అ | పట్టా | ఖుష్కి | 0.0900 | [illegible] | 221 | 220 | 232 | 245 | లేవు |
| 5 | 221/ఏ | పట్టా | ఖుష్కి | 0.06 | [illegible] | 221 | 220 | 232 | 245 | లేవు |
| 6 | 222/అ | పట్టా | ఖుష్కి | 0.0075 | [illegible] | 225 | 221 | 254 | 223 | లేవు |
| 7 | 223/అ | పట్టా | ఖుష్కి | 0.20 | [illegible] | 224 | 230 | 222 | 281 | లేవు |
| 8 | 224/అ | పట్టా | ఖుష్కి | 0.07 | [illegible] | 224 | 223 | 225 | 294 | లేవు |
| 9 | 225/అ | పట్టా | ఖుష్కి | 0.0050 | [illegible] | 229 | 221 | 201 | 226 | లేవు |
| 10 | 226/అ | పట్టా | ఖుష్కి | 0.14 | పూదారి ఒజయ్య తండ్రి వెంకయ్య | 227 | 224 | 225 | 227 | లేవు |
| 11 | 226/ఇ | పట్టా | ఖుష్కి | 0.18 | చేక్కపెల్లి లింగారెడ్డి తండ్రి నచ్చయ్య | 227 | 224 | 225 | 227 | లేవు |
| 12 | ఒర్రె | | | 0.025 | ఒర్రె | ఒర్రె | ఒర్రె | 210 | 210 | లేవు |
| | **విస్తీర్ణం : 2.08 3/4** | | | | | | | | | |
| | **మొత్తం విస్తీర్ణం : 11.10 3/4** | | | | | | | | | |

ప్రతిపాదిత భూసేకరణ చట్టం-2013 (కేంద్ర చట్టం 30/2013) లోని సెక్షన్ 15(1) అంశాలపై భూసేకరణపై ఆసక్తిగల వ్యక్తుల నుండి ఎలాంటి అభ్యంతరాలు రానందున సెక్షన్ 19(1) ప్రకారం డిక్లరేషన్ జారీచేయనైనది. ఇట్టి భూసేకరణ వల్ల ఎవరు నిర్వాసితులు కాలేదు మరియు జీవనోపాధి కోల్పోలేదు.కావున పునరావాసం మరియు పునరుపాది కల్పన వర్తించదు.

భూసేకరణ తలపెట్టిన భూమిలో భోగ్గు, ఇనుము, స్లెట్ మరియు ఇతరత్రా ఖనిజములు ఇట్టి భూమిలో లేదా కొంతభాగములో లభ్యమైనచో ఆఖనిజాలు ప్రాజెక్ట్ నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములోవాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ మరియు వివరములు ఏదేని పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజినల్ అధికారి, జగిత్యాల వారి కార్యాలయములలో పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉంచనైనది.

సం/- భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి జగిత్యాల
సం/- అదనపు కలెక్టర్ జగిత్యాల
సం/- జిల్లా కలెక్టర్ జగిత్యాల

DIPR RO NO. 947/LA/PP/Advt/Pub/2026-27

# మార్కెట్‌లోకి 10 కోట్ల బ్యారెల్స్ యూరప్ చమురు

**ట్రంప్ బెదిరింపుతో జి–7 నిర్ణయం**






**బ్రస్సెల్స్:**చమురు ఎగుమతులు నిలిపివేస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బెదిరించడంతో మార్కెట్ ధరలను స్థిరీకరించడంకోసం 10 కోట్ల బ్యారెళ్ళ (100 మిలియన్స్) డీజిలు,ముడిచమురు రిజర్వులనుండి విడుదల చేయాలని జి–7 దేశాలు దృశ్యమాధ్యమ పద్ధతిలో సమావేశమై తక్షణ నిర్ణయం తీసుకున్నాయి.అవసరమైతే ఇంకా మరింత డీజిలు మార్కెట్‌లోకి విడుదల చేస్తామని కూడా జి–7 ప్రకటించింది.ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ మాట్లాడుతూ,అంతర్జాతీయ ఇంధన సంస్థ సమన్వయంతో నాలుగు నెలలపాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు.బ్రిటన్ తరపున విదేశాంగ మంత్రి ఎడ్ మిలిబాండ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.జి–7 నిర్ణయం తర్వాత ట్రంప్ కూడా తన బెదిరింపును వెనక్కు తీసుకున్నారు.ఐతే జి–7లో ఏ ఏ భాగస్వామ్యదేశాలు ఈ చమురు నిల్వలు విడుదల చేస్తాయన్న విషయంపై ఇంకా స్పష్టత లేదు.బ్యారెల్‌కు 100 డాలర్ల కంటే తక్కువగా ఉన్న ప్రపంచ ప్రామాణిక బ్రెంట్ క్రూడాయిల్ ధర శుక్రవారంనాటికి మళ్ళీ 102 డాలర్లకు పైగా పెరిగిపోయింది. గడచిన ఫిబ్రవరి నెలాఖరుల అమెరికా–ఇజ్రాయెల్‌దేశాలు ఇరాన్‌పై దాడి చేయడానికి ముందు బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 72 డాలర్ల వద్ద జరిగేది. కానీ ఈనాడు దాదాపు 30 డాలర్ల కంటే ఎక్కువగా పెరిగింది.జి–7 నిర్ణయం తర్వాత చమురు ధర గణనీయంగా తగ్గినప్పటికీ బాబ్ ఎల్–మందాబ్‌పై హౌతీలు తమ పట్టు మరింత బిగించడంతో ధరలు మళ్ళీ పెరిగాయిఇకవైపు ద్వైవార్షిక ఎన్నికలు సమీపించడం,మరోవైపు దేశంలో ప్రజావ్యతిరేకత మితిమీరడంతో ట్రంప్ కొన్ని పాపపరిహార చర్యలకు పూనుకోవడంతో జి–7 ఈ ప్రకటన చేయాల్సి వచ్చింది.అమెరికా సహా అభివృద్ధి చెందిన దేశాలకు చెందిన ఈ కూటమి తీసుకున్న ఈ నిర్ణయంవల్ల యూరప్ దేశాలలో ఇంధన సరఫరాలపై ఇకమీదట ఎలాంటి ఆంక్షలు ఉండవు.జి–7 కూటమిలో అమెరికాతోపాటు బిటన్, ఫ్రాన్స్, జపాన్, జర్మనీ, ఇటలీ,కెనడా సభ్యులుగా ఉన్నాయి.యూరప్ దేశాలు తమ వద్ద ఉన్న చమురు నిల్వలను మార్కెట్‌లోకి విడుదల చేయకపోతే అమెరికా నుండి డీజిలు ఎగుమతులను నిలిపివేస్తామని ట్రంప్ బెదిరించారు. డీజిలు ఎగుమతులు నిలిపివేస్తే ఎన్నికల సమయంలో అమెరికాలో వినియోగదారులపై చమురు ధరలభారం తగ్గుతుంది.ధరలు ఆకాశాన్ని తాకుతున్న తరుణంలో అమెరికాలోని రైతులు,ట్రక్ డ్రైవర్లు,వ్యాపారవేత్తలు చమురు ధరల భారాన్ని మోయకూడదని అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ తొలుత వాదించారు.ఇప్పుడు ఆయిల్ విడుదల ద్వారా యూరప్ చాలా గొప్ప పని చేసిందని,వారు ప్రపంచానికి సహాయం చేయబోతున్నారని అన్నారు. మేం కూడా ఎగుమతులను నిషేధించకుండా మా బాధ్యతలు నెరవేరుస్తామన్నారు. యూరప్ దేశాలు తమ వద్ద భారీగా ఉన్న చమురు నిల్వల విడుదలకు అంగీకరించాయని ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ చెప్పారు.ఎక్కువగా రవాణా,వ్యవసాయంలోనే డీజిలు ఉపయోగించడంవల్ల ఆహార వస్తువుల ధరలపై తీవ్ర ప్రభావం పడుతుంది.

**65 శాతం వ్యతిరేకతతో ట్రంప్ మల్లగుల్లాలు**

అమెరికాలో 65 శాతం మంది వయోజనులు ట్రంప్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తాజా సర్వే నివేదిక ప్రకటించడంతో ట్రంప్ సమస్యలో చిక్కుకున్నారు. వయోజనులలో 17 శాతం మంది మాత్రమే జీవన వ్యయాల విషయంలో ట్రంప్ విధానాలను సమర్థిస్తున్నారు.ట్రంప్ ఆర్థిక విధానాలు,పెరుగుతున్న ధరల విషయంలోతీవ్రమైన అసంతృప్తి ఉంది. నవంబరులో ద్వైవార్షిక ఎన్నికల్లో ప్రతిపక్ష డెమోక్రాట్లు ఆధిపత్యం సాధిస్తే ట్రంప్ పెత్తనానికి కాలం చెల్లుతుంది. చాలామంది ఆయన పనితీరు,యుద్ధ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారని ద అసోసియేటెడ్ ప్రెస్–నార్క్ సెంటర్ ఫర్ పబ్లిక్ అఫైర్స్ రీసెర్చ్ నిర్వహించిన సర్వే ప్రకటించింది.26 శాతం అమెరికన్లు మాత్రమే ట్రంప్ ఆర్థిక విధానాలను సమర్థిస్తున్నారు.జీవన వ్యయాలపై ప్రతి పదిమందిలో ఏడుగురు ట్రంప్‌ను సర్వేలో తప్పు పట్టారు. పదిమంది రిపబ్లికన్లలో ఆరుగురు ట్రంప్‌ను వ్యతిరేకిస్తున్నారు. 65 శాతం మంది ప్రజలు నియంత్రణలేని విధానాలనే వ్యతిరేకిస్తున్నారు. సుంకాలు విధించడంలో దూకుడు, యుద్ధ ప్రకటనలతో ప్రజలు విసుగెత్తిపోయారని సర్వే ప్రకటించింది.దీంతో ట్రంప్ కొన్ని దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు.

**హౌతీ–సౌదీ దాడులు**

అన్సరుల్ హౌతీ తిరుగుబాటుదారులు,సౌదీ అరేబియా కూటమి దళాలమధ్య యుద్ధ దాడులు కొనసాగుతున్నాయి. యెమెన్‌లోని తీర ప్రాంతాలపై హౌతీ తిరుగుబాటుదారులు పూర్తి పట్టు సంపాదించి ఇరాన్‌కు చెందిన ఘోస్ట్ క్షిపణులతో దాడులు చేస్తూ ఉండటంతో సౌది అరేబియా ఆందోళన చెందుతోంది. మరోవైపు యెమెన్‌లో హౌతీల స్థావరాలపై గురిపెట్టి 51 లక్ష్యాలపై సౌదీ దళాలు దాడులు చేశాయి.హౌతీలు బలం పుంజుకుని ఎర్ర సముద్రంలో క్షిపణులతో దాడులు చేస్తూ ఉండటంతో బాబ్ అల్ మండబ్‌లో నౌకల రాకపోకలకు కొత్త సమస్యలు తలెత్తాయి.

# వెనక్కి పారిపోయిన అమెరికా సైన్యాలు

- సెంట్‌కామ్‌తో పశ్చిమాసియాకు భద్రతకాదు,ప్రాణహాని
- ఐఆర్‌జిసి కమాండర్ ఇజాదీ విమర్శ



**టెహ్రాన్:**అమెరికా సైన్యాలు ఇరాన్‌కు భయపడి పర్షియన్ గల్ఫ్,ఒమన్ సముద్రం నుండి పారిపోయాయని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్(ఐఆర్‌జిసి)డిప్యూటీ కమాండర్ మేజర్ జనరల్ ముస్తఫా ఇజాదీ చెప్పారు. ఈ దళాలు మరింత వెనక్కి వెళ్ళిపోయే అవకాశాలు ఉన్నాయని ఇరానియన్ మీడియాకు చెప్పారు. ఇరాన్ దాడులకు భయపడి ఇప్పటికే అమెరికా సేనలు 500 కి.మీ వెనక్కు పారిపోయాయని అన్నారు. ప్రస్తుతం ఆ దళాలు ఒమన్ సముద్ర జలాల నుండి 500 కి.మీ దూరంలో ఉన్నాయన్నారు.ప్రస్తుతం అమెరికా ఉన్న పరిస్థితుల్లో ఈ దూరం మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు. అమెరికా సైనిక బలగాలు ఇక్కడ ఉండే పశ్చిమాసియాకు ఎంతమాత్రం భద్రత కాదని, వాటిని నమ్ముకున్న ప్రాంతీయ దేశాలకు ప్రాణహానిగా మారుతుందని అన్నారు. అమెరికా సైన్యాల ఉనికి ప్రమాదకరమని ఈ ప్రాంత దేశాలు ఇప్పుడు గుర్తించాయన్నారు. యుద్ధాలు, ఘర్షణల ద్వారా ఇరాన్ సైన్యాలు మరింత అప్రమత్తంగా, మెరుగైనస్థితికి చేరుకున్నాయని, ఇరాన్ ప్రజలు కూడా తమను తాము కాపాడుకునే విషయంలో శత్రువుల కపటోపాయాలను ఆకళింపు చేసుకుని ప్రవర్తిస్తున్నారని చెప్పారు. ఇరాన్‌ను విచ్ఛిన్నంచేసి,ఇరాన్ చమురు సంపదపై నియంత్రణ సాధించాలనుకున్న శత్రువు కుట్రలను ప్రజలు భగ్నం చేశారన్నారు. అనేక పొత్తులు చేసినప్పటికీ ఇరాన్ శక్తిని అద్దుకోవడంలోగానీ,ఇరాన్‌ను ఓడించడంలోగానీ శత్రువు ఘోరంగా విఫలమయ్యాడని ముస్తఫా ఇజాదీ అన్నారు."మన ప్రభుత్వం ఈ రోజు గొప్ప విజయం సాధించింది, ఈనాడు హార్ముజ్ జలసంధిగానీ,బాబ్ అల్–మందబ్ జలసంధిగానీ అమెరికా వ్యతిరేక ప్రతిఘటన శక్తుల చేతుల్లో ఉన్నాయి"అన్నారు."ఈరోజు ఒక కొత్త పరిస్థితి నెలకొని ఉంది, ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి దాడులకు భయపడి శత్రువు వందల కిలోమీటర్ల దూరం వెనక్కి పారిపోయాడు" అన్నారు. కాగా, ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహ్సెన్ రెజాయీ ట్రంప్ బెదిరింపులను తోసిపుచ్చారు. ఇరాన్ నిరంతరం ఊహల్లోనే విజయం సాధిస్తోందన్నారు. అమెరికాలో చరిత్రలో అతి చెత్త అధ్యక్షుడు ట్రంప్ విధానాలవల్ల యుద్ధంలో పదే పదే పరాజయం ఎదురవుతున్నప్పటికీ ఆయన మాటలు కోటలు దాటిపోతున్నాయని, మితిమీరి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇరాన్ ప్రజలు,ఇరాన్ సైన్యం,క్షిపణులు వాస్తవాలను తీర్చిదిద్దుతాయని అన్నారు. ఇరాన్ ఏనాడో యుద్ధంలో విజయం సాధించిందని చెప్పారు. జరుగుతున్న వాస్తవాలకు, ట్రంప్ ఊహాగానాలకు, ప్రకటనలకు ఎంతమాత్రం లేదని, ఆయన అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

# ఏకపక్ష వాణిజ్యవాదాన్ని తిరస్కరిద్దాం

**జి–20 వాణిజ్య మంత్రులకు చైనా పిలుపు**




**బీజింగ్:**అధిక ఉత్పత్తి సామర్థ్యం పేరుతో పాటించే ఏకపక్షవాదాన్ని,ఏకపక్ష వాణిజ్యవాదాన్ని ప్రతిఘటించాలని,ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) కేంద్రంగా బహుళవాణిజ్య వ్యవస్థకు మద్దతు ఇవ్వాలని చైనా పిలుపు ఇచ్చింది. ఏకపక్ష వాణిజ్యవాదం నుండి బహుళపక్ష వాణిజ్య విధానంవైపు దేశాలు ముందుకు రావాలని కోరింది.సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 1వ తేదీ వరకూ అమెరికా విస్కాన్సిన్ రాష్ట్రం మిల్వాకీ నగరంలో జరిగిన జి–20 వాణిజ్య మంత్రుల సమావేశంలో చైనా తరపు అంతర్జాతీయ వాణిజ్య ప్రతినిధి,చైనా వాణిజ్యశాఖ ఉపమంత్రి లీ చెంగాంగ్ పిలుపు ఇచ్చారని ఆ దేశ అధికారిక పత్రిక శనివారం ప్రకటించింది.అమెరికా అనుసరిస్తున్న ఏకపక్ష వాణిజ్య విధానాలకు వ్యతిరేకంగా చైనా ఈ పిలుపు ఇచ్చింది. ఐతే అమెరికా పేరును ఈ సదస్సులో ప్రస్తావించలేదు.బహుళపక్ష వాణిజ్య విధానాలను ప్రోత్సహించడంవల్ల ప్రపంచమార్కెట్లకు స్థిరత్వం వస్తుందని చెంగాంగ్ చెప్పారు. జి–20 వాణిజ్య మంత్రులు సామూహిక చర్యల ద్వారా స్వేచ్ఛాయుత వాణిజ్య వ్యవస్థను పరిరక్షించాలని ఆయన కోరారు.పోలాండ్ నుండి కూడా వాణిజ్య మంత్రి,ఇతర ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు.ఆహారాన్ని ఆయుధంగా మార్చడం,అధిక ఉత్పత్తి సామర్థ్యాన్ని ఒక ఆయుధంగా తమ రక్షణ కోసం దేశాలపై ప్రయోగించడాన్ని చైనా వ్యతిరేకించిందని పత్రిక పేర్కొంది.ప్రస్తుతం ఏకపక్ష వాదం ద్వారా ప్రపంచానికి అనేక సవాళ్ళు ఎదురవుతున్నాయని, ఈ సవాళ్ళను ప్రతిఘటించాలని మిలాక్వీ సదస్సులో చెంగాంగ్ కోరారు.

# కాక్‌పిట్ క్రాష్ యాక్స్‌తో మచ్చార్‌పై దాడి

- ఆత్మాహుతి తరహాలో 'ఫ్లయ్ దుబాయ్'ని కూల్చే యత్నం
- యుఎఇ ప్రాసిక్యూటర్ జనరల్ ప్రకటన
- ఏదైనా నిజం తెలిస్తే భారీ మూల్యం: నెతన్యాహూ హెచ్చరిక





**దుబాయ్:**ఫ్లయ్ దుబాయ్ విమానాన్ని కూల్చివేసేందుకే కో–పైలట్ ప్రయత్నం చేశాడని, అది టెర్రరిస్టు దాడేనని ఈ కేసు దర్యాప్తు చేస్తున్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దర్యాప్తు బృందం తన ప్రాథమిక నివేదికలో వెల్లడించింది. ఒమన్‌కు చెందిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పుట్టిన కో–పైలట్ హమాల్ అల్–హమామీగా గుర్తించారు.కాక్‌పిట్‌లో అత్యవసర సమయంలో ఉపయోగించడంకోసం పక్కనే తగిలించి ఉండే గొడ్డలి (క్రాష్ యాక్స్) తీసుకుని స్మిత్ మచ్చార్‌పై హమామీ దాడికి పాల్పడ్డాడని యుఎఇ ప్రాసిక్యూటర్ జనరల్ ప్రకటించారు.సిబ్బంది సహా 180 మంది ప్రయాణం చేస్తున్న విమానంలో బుధవారం తెల్లవారుజామున 1.20 గంటల సమయంలో కాక్‌పిట్‌లో ఘటన తర్వాత ఇద్దరు రిజర్వ్‌డ్ పైలట్లు విమానాన్ని దారి మళ్ళించి సౌదీ అరేబియా నగరం తబుక్‌లో సురక్షితంగా ల్యాండింగ్ చేశారు.హమామీని ప్రయాణికులు పట్టి బంధించిన తర్వాత "నన్ను చంపండి...నన్ను చంపండి.." అని గట్టిగా కేకలు వేశాడు. దీనిబట్టి అతడు విమానాన్ని కూల్చివేసి ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నం చేసినట్లు తెలుస్తోందని భావిస్తున్నారు. తీవ్ర గాయాలతో మచ్చర్ కాక్‌పిట్ డోర్ తెరచిన తర్వాత ఇజ్రాయెల్ మహిళ టాలివ్ మాన్స్, ఆమె భర్త జ్వికా,డాక్టర్ షోటా,అసఫ్ రాజువాన్‌లు కాక్‌పిట్‌లోకి ప్రవేశించి సహాయ కార్యక్రమాలు నిర్వహించారు.ఉగ్రచర్యకు పాల్పడిన హమామీ కాక్‌పిట్‌లో ఎలక్ట్రానిక్ వస్తువులను ధ్వంసంచేసేందుకు ప్రయత్నం చేశాడని ఆక్సియోస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రయాణికుడు హయూన్ చెప్పారు. 2024లో పైలట్ శిక్షణా సమయంలోనే అతడివద్ద ఉగ్రవాద మెటీరియల్ ఉన్న విషయం ఇప్పుడు వెలుగుచూసింది. యుఎఇ ప్రాసిక్యూటర్లు అతడి వెనుక ఉన్న సూత్రధారులెవరో తెలుసుకోవడానికి క్షుణ్ణంగా దర్యాప్తును ముందుకు తీసుకువెళుతున్నారు.హమామీ ఫ్లయ్ దుబాయ్ విమానాన్ని కూల్చివేసేందుకుకే ప్రయత్నం చేశాడు.అతడికి ఉగ్రవాదం విషయంలో గత చరిత్ర ఉంది.ఉగ్రవాద,ఉన్మాద మనస్తత్వం ఉన్న కారణంగా హమామీని రెండు సంవత్సరాల క్రితమే విమానం నడపకుండా ఒమన్ ప్రభుత్వం నిషేధం విధించిందని,అతడికి పరిపాలనాపరమైన బాధ్యతలు అప్పగించారని యుఎఇ ప్రాథమిక నివేదికలో వెల్లడైంది. గతం నుండి హమామీపై అనేక ఫిర్యాదులు,విమర్శలు ఉన్నందువల్ల అతడిని విమానం నడపకుండా ఇన్నాళ్ళూ నిషేధించారు.ఐతే హమామీ ఒమన్ మినహా ఇతర దేశాల విమానాలు నడిపిన అనుభవం సంపాదించుకున్నాడు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ ఊహించిన విధంగా అతగాడికి విద్యార్థి జీవితం నుండి ఏదైనా ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్నాయా? అనే విషయంపై దర్యాప్తు అధికారులు వివరాలు తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమన్ నెతన్యాహూ ఫ్లయ్ దుబాయ్ ఘటనపై మరోసారి శనివారం స్పందిస్తూ తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని అన్నారు.

# భారత జట్టుకు సిఎం రేవంత్‌రెడ్డి అభినందనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను ఓడించి ఆసియా క్రీడల్లో పురుషుల క్రికెట్ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్న టీమ్ ఇండియాకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. జపాన్‌లోని నిస్సిన్‌లో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో భారత్ 19 పరుగుల తేడాతో పాకిస్థాన్‌పై విజయం సాధించి వరుసగా రెండోసారి ఆసియా క్రీడల పురుషుల క్రికెట్ స్వర్ణాన్ని నిలబెట్టుకుంది. ఈ స్వర్ణ పతకం దేశానికి అపారమైన గౌరవం, కీర్తిని తీసుకువచ్చిందని సీఎం పేర్కొన్నారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై భారత విజయాల చరిత్రలో ఈ విజయం చిరస్మరణీయ అధ్యాయంగా నిలుస్తుందని అన్నారు. జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. భారత్ తొలుత బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 211 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ 28 బంతుల్లో 61 పరుగులతో ధాటిగా ఆడగా, తెలంగాణ స్టార్ క్రికెటర్ తిలక్ వర్మ కేవలం 22 బంతుల్లోనే అజేయంగా 51 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు బాటలు వేశారు.అనంతరం లక్ష్యఛేదనకు దిగిన పాకిస్థాన్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 192 పరుగులకే పరిమితమైంది. భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ ప్రత్యర్థి జట్టును ఒత్తిడిలోకి నెట్టారు. దీంతో భారత్ 19 పరుగుల తేడాతో విజయం సాధించి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. అభిషేక్ శర్మ అద్భుతమైన 61 పరుగుల ఇన్నింగ్స్‌తో పాటు తెలంగాణకు చెందిన తిలక్ వర్మ అజేయ అర్ధశతకాన్ని సిఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. కీలక సమయంలో వికెట్లు తీసి జట్టు విజయానికి సహకరించిన అక్షర్ పటేల్ క్రీడాస్ఫూర్తిని అభినందించారు. ఆసియా క్రీడల్లో వివిధ క్రీడాంశాల్లో పట్టుదల, అంకితభావం, క్రీడాస్ఫూర్తితో పోటీపడి దేశానికి పతకాలు సాధించిన భారత క్రీడాకారులందరికీ సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

# అదరం... బెదరం

**(మొదటి పేజీ తరువాయి)**

వారిని అదుపులోకి తీసుకోవడం ప్రారంభించారు. పలు చోట్ల భద్రతా సిబ్బందిని మోహరించి, జంతర్ మంతర్ వైపు వెళ్లే రహదారులపై బారికేడ్లు ఏర్పాటు చేశారు. పోలీసుల చర్య సందర్భంగా ఒక పురుష పోలీసు అధికారి బోరాను దురుసుగా ప్రవర్తించారని, మరో ఢిల్లీ పోలీసు అధికారి ఆమెను దూషించారని ఎఐఎస్‌ఎ సభ్యులు ఆరోపించారు. ఈ ఆరోపణలను వెంటనే స్వతంత్రంగా ధృవీకరించలేకపోయారు. శుక్రవారం అదుపులోకి తీసుకున్న వారిలో ఒకరైన బోరా, కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ, ఓటర్ల జాబితాల ఎస్‌ఐఆర్ (సర్) పై ఆందోళన వ్యక్తం చేస్తూ, మధ్యాహ్నం 1 గంటకు జంతర్ మంతర్‌కు తిరిగి వచ్చి తమ నిరసనను కొనసాగించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చిన తర్వాత ఈ తాజా పరిణామం జరిగింది. నిరసన స్థలానికి నిరసనకారులు చేరుకోకుండా పోలీసులు, పారామిలిటరీ సిబ్బంది నిరోధించారు. కాగా, శుక్రవారం సాయంత్రం, నేహా బోరా ఒక వీడియో సందేశంలో నిరసన కొనసాగుతుందని, కార్యకర్తలు జంతర్ మంతర్‌కు తిరిగి రావాలని కోరారు. అరెస్టులు నిరసనకారులను భయపెట్టలేవని, కుమార్ రాజీనామా డిమాండ్‌కు మద్దతుగా సమీకరణను కొనసాగించాలని ఆమె పిలుపునిచ్చారు. నిరసనకారులు ఎస్‌ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ, ఓటర్ల జాబితాల సవరణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్నారు.

**3 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ, శుక్రవారం జంతర్ మంతర్ వద్ద గుమిగూడేందుకు ప్రయత్నించిన విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు, పౌర సమాజ కార్యకర్తల ఘటనకు సంబంధించి ఢిల్లీ పోలీసులు మూడు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. ప్రభుత్వ అధికారి జారీ చేసిన ఉత్తర్వును ధిక్కరించారనే ఆరోపణలపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్) సెక్షన్ 223 కింద పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో రెండు, కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌లో ఒకటి చొప్పున ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసినట్లు ఒక సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. ఈ ఎఫ్‌ఐఆర్‌లలో ఏ వ్యక్తి లేదా సంస్థను నిందితుడిగా పేర్కొనలేదు. అయితే, ప్రదర్శనలను ప్రతిపాదించిన లేదా వాటిలో పాల్గొన్న నిర్వాహకులు, సంస్థల వివరాలను ఎఫ్‌ఐఆర్‌లలోని అంశాలలో ప్రస్తావించినట్లు ఒక అధికారి తెలిపారు. ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్)కు సంబంధించిన ఆరోపణలపై కుమార్ రాజీనామా కోరుతూ శుక్రవారం విద్యార్థులు, రాజకీయ నాయకులు, పౌర సమాజ కార్యకర్తలు జంతర్ మంతర్‌కు చేరుకునేందుకు ప్రయత్నించారు. ఈ ఆరోపణలపై ఎన్నికల సంఘం వైఖరి, ప్రతిస్పందనలను ఎఫ్‌ఐఆర్‌లలో వివరంగా పొందుపరచలేదు. బిఎన్‌ఎస్‌ఎస్‌లోని సెక్షన్ 163 కింద న్యూఢిల్లీ జిల్లా వ్యాప్తంగా విధించిన నిషేధాజ్ఞలను నిరసనకారులు ఉల్లంఘించారని పోలీసులు తెలిపారు.

# పునాదిగా యువతరం

**(మొదటి పేజీ తరువాయి)**

లోపించిందని అది ప్రజల్లో వ్యతిరేకతను పెంచుతుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు బాగున్నా అనేక అంశాలకు సంబంధించి ప్రాధాన్యత ఎంపికలో పొరపాట్లు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్య మూలాలు దెబ్బతింటున్నాయని పునాదిగా నిలిచిన ఓటు హక్కును తొలగించడం నేరమేనని ఆయన స్పష్టం చేశారు. సర్ పేరుతో ఓట్ల తొలగింపు నేరమని ప్రజాస్వామ్యానికి ఓటే మూలస్తంభమని దానిని తొలగించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు తూట్లు పొడవడమేనన్నారు. 60 కోట్ల భోఫోర్స్ కుంభకోణం కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతే లక్షల కోట్ల కుంభకోణాలు చోటు చేసుకున్న బిజెపి ప్రభుత్వాన్ని ఏవిధంగా శిక్షించాలని ఆయన ప్రశ్నించారు. జ్ఞానేష్‌కుమార్ దిగిపోవాల్సిందేనని లేని పక్షంలో ఉద్యమం మరింత ఉధృతం అవుతుందన్నారు. ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయని కొద్ది మంది చేతుల్లో సంపద పోగుపడుతుందని ఆయన తెలిపారు. జర్నలిస్టులు అడిగిన వివిధ ప్రశ్నలకు సమాధానం ఇస్తూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉన్న సొమ్మును సరైన రీతిలో ఈ ప్రభుత్వానికి ఖర్చు చేయడం చేతకావడం లేదన్నారు. ఆర్థిక వ్యవహారాలు కేంద్రీకృతమవుతున్నాయని వివిధ శాఖల్లో ఖర్చు పెట్టే అవకాశం లేకుండా పోయిందని మంత్రులు స్వేచ్ఛగా పాలన చేసే పరిస్థితి లేదన్నారు. దీనితో కొత్త పంచాయతీలు పుట్టుకొస్తున్నాయన్నారు. కొన్ని హామీలు నెరవేర్చిన అది చెప్పుకునే పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ లేదని సాంబశివరావు తెలిపారు. బొగ్గు దొంగతనం అన్న ప్రచారంలోనూ కాంగ్రెస్ నిజాలను ప్రజలకు వివరించలేకపోయిందన్నారు. ధరణి వల్లనే బిఆర్‌ఎస్ ఓడిపోయిందని ఇప్పుడు కాంగ్రెస్ కూడా సరైన రీతిలో వ్యవహరించకపోతే ముప్పు తప్పదన్నారు. ఏ ప్రభుత్వమైనా నిషేధిత జాబితాను కొనసాగిస్తారని కానీ చిన్న చిన్న పొరపాట్లు పెద్ద ఇబ్బందులను తెచ్చిపెడుతున్నాయన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం అనుభవదారు కాలాన్ని రద్దు చేయడం మళ్లీ భూ యజమానులకు ఊతమిచ్చిందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎందుకో సమర్థవంతంగా నడపలేకపోతుందన్న భావన వ్యక్తమవుతుందన్నారు. మిత్రపక్షంగా ఉన్న తమకు తెలపకుండానే మా అనుబంధ సంఘాన్ని ఆర్టిసి ఎన్నికల్లో ఓడించేందుకు ప్రయత్నం చేయడం ఓ మంత్రి కమ్యూనిస్టు సంఘాలను ఉద్దేశించి మాట్లాడటం ఇబ్బందికరమన్నారు. కమ్యూనిస్టు యూనియన్లను గెలవనివ్వవద్దన్న ఆయన తీరు సరి కాదని సాంబశివరావు తెలిపారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీ చేయాలా ఎవరికి మద్దతు ఇవ్వాలా అన్న దానిపై ఇంకా నిర్ణయించలేదన్నారు. కొత్తగూడెం నియోజక వర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జోక్యంపై జర్నలిస్టులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ అన్ని నియోజక వర్గాల మాదిరి కొత్తగూడెంలో కూడా పర్యటిస్తే తప్పులేదు కానీ తరచూ పర్యటనలు చేయడం శత్రుపక్ష శాసన సభ్యుని పట్ల వ్యవహరించడం సరికాదన్నారు. అంతిమంగా ప్రజలే నిర్ణేతలన్నారు. మిత్ర పక్ష శాసనసభ్యుడు ఉన్న చోట అంతగా పట్టించుకోవాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. కమ్యూనిస్టుల నైతిక మద్దతు కాంగ్రెస్ గెలుపులో కీలక భూమిక పోషించిందన్నారు. ఆర్టిసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కమ్యూనిస్టులు విడివిడిగా పోటీ చేయడాన్ని ప్రస్తావిస్తూ కలిసిపోతే తప్ప రెండు పార్టీలు విడివిడిగా ఉన్నప్పుడు ఇటువంటి పరిస్థితులు ఎదుర్కొనక తప్పదన్నారు. ప్రజా ఉపయోగకర కార్యక్రమాలు చేపట్టినప్పుడు మిత్రపక్షంగా సమర్థిస్తామని ప్రజలకు నష్టం జరిగే కార్యక్రమాలకు సంబంధించి ప్రశ్నించక తప్పదని ఆయన తెలిపారు. ప్రశ్నించే వారి పట్ల గత ప్రభుత్వం మాదిరే వ్యవహరిస్తూ ముందస్తు అరెస్టులు, ఆందోళనలు అణిచివేతలు చేస్తే గత ఫలితమే పునరావృతమవుతుందన్నారు. టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# అసెంబ్లీలను రద్దు చేయాలి

**(మొదటి పేజీ తరువాయి)**

చెబుతున్నారని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్)లో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, ఇది ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఈ ప్రక్రియలో ప్రభుత్వం అనేక తప్పులు చేస్తోందని ఆరోపించారు. ప్రక్రియకు, ఎన్నికల విధానం దుర్వినియోగానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగిస్తామని ఖర్గే స్పష్టం చేశారు. సెప్టెంబర్ 30న జరిగిన 'ఇండియా' కూటమి సమావేశం గురించి ప్రస్తావించిన ఖర్గే, అందులో 20 పార్టీల సభ్యులు, వారి న్యాయ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. ఈ సర్ ప్రక్రియ దేశానికి హానికరమని, పేదలు, నిరక్షరాస్యులు, కార్మికులు, ముఖ్యంగా మైనారిటీలపై ప్రతికూల ప్రభావం చూపుతోందని అందరూ అంగీకరించారని ఆయన చెప్పారు. పేర్లను చేర్చే ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, ఒక బూత్ నుండి 500 ఓట్లను తొలగిస్తే అది ఎలాంటి స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నిక అవుతుందని ఆయన ప్రశ్నించారు. చాలా మంది, ముఖ్యంగా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు, తాము ఓట్లను తొలగించాలనుకుంటున్న వార్డులు, పంచాయతీలు, గ్రామాలకు వెళ్లి అక్కడే ఫారమ్‌లను నింపుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరోపించారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి, నరసింహారావు, రాజీవ్ గాంధీ వంటి గత నాయకులెవరూ ప్రజాస్వామ్యంలో ఇలాంటి పనులు చేయలేదని ఖర్గే గుర్తుచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) చట్టం, 2023లోని 16వ నిబంధన ప్రకారం, పదవిలో ఉండగా తీసుకున్న నిర్ణయాలకు గాను ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి), ఎన్నికల కమిషనర్లకు చట్టపరమైన చర్యల నుండి మినహాయింపునిచ్చే చట్టాన్ని ప్రస్తావించారు. మోదీజీ, ఆయనను అమలుచేసేవారు ఒక చట్టాన్ని తీసుకువచ్చి ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని, మొదట, వారు కమిటీ కూర్పును మార్చారని, గతంలో, భారత ప్రధాన న్యాయమూర్తి, ప్రతిపక్ష నాయకుడు, ప్రధానమంత్రి కమిటీలో సభ్యులుగా ఉండేవారన్నారు. కొత్త చట్టం ప్రకారం, సిఇసి లేదా మన ఎన్నికల కమిషనర్లు ఏదైనా తప్పు చేస్తే, చనిపోయేంత వరకు వారిపై ఎక్కడా విచారణ జరగదు అని ఖర్గే ఎత్తిచూపారు. ఈ విధంగానే వారు ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. 6న న్యూఢిల్లీలో ప్రతిపక్ష ఎంపిలందరూ ఎన్నికల కమిషన్ వరకు పాదయాత్ర చేయనున్న ఆందోళనను ప్రస్తావిస్తూ, ప్రజలను మేల్కొల్పడానికి తాము ఆందోళనలను కొనసాగిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. 'ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే మా పని. వారిని చైతన్యవంతులను చేసిన తర్వాత కూడా మీరు 'మోదీ, మోదీ' అని అంటున్నారంటే, మీకు నియంతృత్వమే కావాలని అర్థం' అని పేర్కొన్న ఆయన, ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల ద్వారానే జరగాలని నొక్కి చెప్పారు.

# అత్యంత ప్రాధాన్యం

**(మొదటి పేజీ తరువాయి)**

కేరళ, ఒడిశా, సిక్కిం, తమిళనాడు, త్రిపుర హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తులు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ శ్యామ్ కోషి, ఈ రాష్ట్రాల హైకోర్టుల ఉన్నతాధికారులు, పలువురు మాజీ న్యాయమూర్తులు పాల్గొన్నారు. సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "న్యాయం అంటే కేవలం నేరస్తుడికి శిక్ష పడటం కాదు. న్యాయం అంటే బాధితుడి జీవితాన్ని తిరిగి నిలబెట్టడం. గౌరవాన్ని తిరిగి ఇవ్వడం. ముఖ్యంగా పిల్లలు కోల్పోయిన బాల్యాన్ని తిరిగి అందించడమే నిజమైన న్యాయం. సైబర్ నేరాల బారిన పడకుండా పిల్లలకు తల్లిదండ్రుల మద్దతు అవసరం. పిల్లలను తప్పుబట్టే విధంగా కాకుండా ఆసక్తితో అవగాహనతో పిల్లలకు మద్దతుగా మార్గదర్శకత్వం చేయాలి. పిల్లలను సురక్షితంగా ఉంచేందుకు మనమంతా కలిసి పనిచేద్దాం. అందుకు ఈ సదస్సులో జరిగే చర్చలు, సూచనలు, సిఫారసులు యావత్ దేశానికి మార్గదర్శకంగా నిలుస్తాయని విశ్వసిస్తున్నా" అని సిఎం అన్నారు. పోలీసులు, భరోసా కేంద్రాలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, ప్రత్యేక కోర్టులు, న్యాయ సేవా సంస్థలు వంటి అనేక వ్యవస్థలు పనిచేస్తున్నాయని వివరించారు. భరోసా కేంద్రాల్లో మహిళలు, పిల్లలకు ఒకేచోట పోలీసు సహాయం, వైద్య సేవలు, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ అందిస్తున్నామన్నారు. దేశంలోనే తొలి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని, పిల్లల రక్షణ కోసం పోలీసు శాఖలోని విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో షీ భరోసా సైబర్ ల్యాబ్‌లు పనిచేస్తున్నాయని, సైబర్ యాప్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని సిఎం వివరించారు. విద్యార్థులనే సైబర్ అంబాసిడర్లుగా తయారు చేసి, తమ తోటి విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని, అన్ని శాఖలు కలిసి పనిచేస్తేనే పిల్లలకు రక్షణ, బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించగలమని సిఎం అన్నారు. ఆర్థిక సహాయం నుంచి ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశం కల్పించడం వరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, టిజిఎస్–ఎల్‌ఎస్‌ఎ పాఠశాల విద్యాశాఖతో అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుందని, ఉపాధ్యాయులు పిల్లలకు వారి చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తున్నామని, ఇప్పటివరకు 3 వేల మందికి పైగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. సైబర్ నేరాల వలలో పిల్లలు పడకుండా ఇలాంటి కార్యక్రమాల్లో తల్లిదండ్రులను కూడా భాగస్వాములను చేయాలని చెప్పారు. సైబర్ నేరాల నియంత్రణ విషయంలో ప్రతి పిల్లవాడు, తల్లిదండ్రులు నియంత్రణ కోసం ప్రత్యేకంగా కేటాయించిన నంబర్1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం1098 నంబర్లు తప్పక గుర్తుంచుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. న్యాయ సేవల ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవల కోసం సిద్ధం చేసిన సంచార లోక్ అదాలత్ వాహనాలను ఈ సందర్భంగా కేంద్ర మంత్రి, న్యాయమూర్తుల సమక్షంలో ముఖ్యమంత్రి ప్రారంభించారు.

# 'సర్'పై పోరుబాట

**(మొదటి పేజీ తరువాయి)**

జస్వంత్ కుమార్, యువజన జన సమితి రాష్ట్ర అధ్యక్షులు సలీం పాషా పాల్గొన్నారు. సమావేశం అనంతరం మీడియాతో టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహార తీరును ఇండియా కూటమి తీవ్రంగా ఖండిస్తోందన్నారు. జ్ఞానేశ్ కుమార్ను పదవి నుంచి తొలగించడంతో పాటు ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఐఆర్ కారణంగా అర్హత కలిగిన లక్షలాది మంది పౌరుల ఓట్లు తొలగిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని, బిజెపి దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణతో ప్రజాస్వామ్యానికి ముప్పు : ఈ.టి.నరసింహా**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పేరుతో జరుగుతున్న ప్రక్రియతో ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడుతున్నదని, ఈ పరిణామాలపై దేశంలోని ప్రజాస్వామ్యవాదులు ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని ఈ.టి.నర్సింహ అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం దెబ్బతినేలా పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సిఈసి కేంద్రంలోని అధికార బిజెపి చెప్పినట్లుగా వ్యవహరిస్తున్నదని నర్సింహ విమర్శించారు. ఇది దేశ ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమిస్తోందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో వ్యక్తిగత వివరాల విషయంలోనూ ప్రజలకు నోటీసులు వస్తున్నాయని తెలిపారు. తనకు తెలిసిన సందర్భాల్లో తల్లిదండ్రుల వయసు వివరాలు సరిపోలడం లేదనే కారణం తో నోటీసులు ఇచ్చారని నర్సింహ తెలిపారు.

**కొత్త ఓట్లను చేర్చకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు: జాన్ వెస్లీ**

జాన్ వెస్లీ మాట్లాడుతూ ఫారం6లో నిబంధనల పేరుతో కొత్త ఓట్లను చేర్చకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని, కొన్ని ఫిర్యాదుల ఆధారంగా ఓట్లను తొలగిస్తున్నారని అన్నారు. ఎన్నికలను తమకు అనుకూలంగా మార్చుకునేలా బిజెపి వ్యవహరిస్తోందని ఆరోపించారు. తొలగించిన ఓట్లలో అర్హులైన ఓటర్లను తిరిగి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియలో చీఫ్ జస్టిస్ స్థానంలో కేంద్ర హోంమంత్రిని చేర్చడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. సలీం పాషా మాట్లాడుతూ గత 14 నెలలుగా ఎస్‌ఐఆర్‌ను అమలు చేస్తున్నారని, గత కొన్నేళ్లుగా ఓటు హక్కు వినియోగించుకుంటున్న వారిని ఇప్పుడు ఓటు వేయకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. బిజెపి కార్యకర్తలు వేలాది దరఖాస్తులను నింపి ఇస్తున్నారని, బిఎల్‌ఓలపై ఒత్తిడి తెస్తోందని వెస్లీ ఆరోపించారు.

# ఆసియా క్రీడల్లో భారత్ @ 4

పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత బృందం తీవ్రంగా నిరాశపరిచింది. మూడేళ్ల క్రితం హంగ్జౌలో వంద (106)కుపైగా పతకాలతో అదరగొట్టిన మన క్రీడాకారులు ఈసారి గురితప్పారు. శుక్ర, శనివారాల్లో ఆర్చర్లు, హాకీ జట్టు స్వర్ణాలతో మోత మోగించినా సెంచరీ కొట్టలేదు. ఆఖర్లో రెజ్లర్లు అమన్ షెహ్రావత్ (57 కిలోలు), అంతిమ్ పంఘాల్(53 కిలోలు), దీపక్ పూనియా (97 కిలోలు) గెలిచిన పసిడి, వెండి, కాంస్యాలతో కలిపి.. 85 పతకాలు వచ్చాయంతే. ఫలితంగా భారత్ ఇప్పుడు నాలుగో స్థానంలో నిలిచింది. జపాన్ ఆతిథ్యమిచ్చిన ఆసియా క్రీడల్లో భారత బృందం సెంచరీ కొట్టలేకపోయింది. ఐచీ నగోయ వేదికగా జరిగిన ఈ పోటీల్లో షూటర్లు, ఆర్చర్లు, అథ్లెట్లు మెరిసినా కూడా వందకు 15 పతకాల దూరంలో ఆగిపోయింది భారత్. పోటీల చివరి రెండు రోజుల్లో జోరు చూపించిన మన క్రీడాకారులు పోడియం మీద మెరిసినా సరిపోలేదు. శనివారం పురుషుల హాకీ జట్టు స్వర్ణం సాధించగా.. రెజ్లర్ అమన్ షెహ్రావత్(57 కిలోలు) పసిడి వెలుగులు విరజిమ్మాడు. మహిళల ఫ్రీ స్టయిల్ 53 కిలోల ఫైనల్లో తడబడిన అంతిమ్ పంఘాల్ రజతంతో సరిపెట్టింది. 97 కిలోల విభాగంలో ఆరు దశాబ్దాల కలను సాకారం చేస్తూ కాంస్యం గెలిచాడు దీపక్ పూనియా. దాంతో.. 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలతో పరిమితమైన భారత్ పతకాల పట్టికలో నాలుగో ర్యాంకుతో సరిపెట్టుకుంది. మూడేళ్ల క్రితం హంగ్జౌలో 28 స్వర్ణాలు, 38 రజతాలు, 40 కాంస్యాలతో పతకాలు సాధించింది మన బృందం. టోర్నీ ఆరంభం నుంచి దూకుడు కనబరిచిన చైనా ఏకంగా 341 మెడల్స్‌తో అగ్రస్థానం కైవసం చేసుకుంది.



**టాప్‌లో ఈ దేశాలు..**
ఆసియా క్రీడల్లో అత్యధిక పతకాలతో చైనా, జపాన్, దక్షిణ కొరియాలు వరసగా తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. 85 పతకాలతో భారత్ నాలుగో స్థానంలో ఉండగా.. 56 మెడల్స్ గెలిచిన ఉజ్బెకిస్థాన్ ఐదో స్థానంతో టోర్నీని ముగించింది.

1.**చైనా**– 169 స్వర్ణాలు, 89 రజతాలు, 83 కాంస్యాలు= 341 పతకాలు
2.**జపాన్**– 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలు= 269 పతకాలు
3.**దక్షిణకొరియా**– 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలు= 150 పతకాలు
4.**భారత్**– 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలు=85 పతకాలు
5.**ఉజ్బెకిస్థాన్**– 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలు= 56 పతకాలు

## 5 వికెట్ల తేడాతో వెస్టిండీస్ గెలుపు

వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌ను టీమిండియా ఓటమితో ముగించింది. శనివారం ముల్లాన్పూర్ వేదికగా జరిగిన ఆఖరి వన్డేలో వెస్టిండీస్ 5 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. కెప్టెన్ షైహోప్(143 బంతుల్లో 17 ఫోర్లు, 3 సిక్సులతో 162 నాటౌట్) అజేయశతకంతో భారత్ పతనాన్ని శాసించాడు. అరంగేట్ర పేసర్ అన్షుల్ కాంబోజ్(0/82) చెత్త బౌలింగ్ భారత్ విజయవకాశాలను దెబ్బతీసింది. ఈ మ్యాచ్‌లో ఓడినా భారత్ 2–1తో సిరీస్ కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 351 పరుగులు చేసింది. రోహిత్‌శర్మ(85 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లతో 92) తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. కేఎల్ రాహుల్(87 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్స్‌లతో 129 నాటౌట్) అజేయ శతకంతో కదం తొక్కగా.. రోహిత్ శర్మ(85 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లతో 92) తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. రుతురాజ్ గైక్వాడ్(69 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 57) హాఫ్ సెంచరీతో రాణించగా.. నమన్ ధీర్(21 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 30) పర్వాలేదనిపించాడు. వెస్టిండీస్ బౌలర్లలో జైడెన్ సీల్స్(3/62) మూడు వికెట్లు తీయగా.. కీమో పాల్(2/71) రెండు వికెట్లు పడగొట్టాడు. గుడకేష్ మోతీ ఒక వికెట్ తీసాడు. అనంతరం వెస్టిండీస్ 48.2 ఓవర్లలో 5 వికెట్లకు 352 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. కెప్టెన్ షైహోప్‌తోపాటు అమీర్ జంగూ (56 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌లతో 67) హాఫ్ సెంచరీతో రాణించాడు. కీమో పాల్ (35 బంతుల్లో 5 ఫోర్లతో 44), గుడకేష్ మోతీ(19 నాటౌట్) పర్వాలేదనిపించాడు. భారత బౌలర్లలో మహమ్మద్ సిరాజ్, గుర్నూర్ బ్రార్, నమన్ ధీర్ తలో వికెట్ తీసారు.



**చెలరేగిన షై హోప్, జంగూ..**
352 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో విండీస్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఓపెనర జాన్ క్యాంబెల్ (10) తీవ్రంగా నిరాశపర్చాడు. మహమ్మద్ సిరాజ్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్ అయ్యాడు. దాంతో అమీర్ జంగూతో కలిసి షై హోప్ ఇన్నింగ్సను ముందు కు నడిపించాడు. పవర్ ప్లేలో 78 పరుగులు చేసిన వెస్టిండీస్.. 14.2 ఓవర్లలోనే 100 పరుగుల మార్కును అందుకుంది. షైహోప్ 46 బంతుల్లో హాఫ్ సెంచరీ చేయగా.. జంగూ 47 బంతుల్లో అర్థ శతకం సాధించాడు. విరాట్ కోహ్లి అద్భుత ఫీల్డింగ్‌తో అమీర్ జంగూ రనౌట్‌గా వెనుదిరిగాడు. దాంతో రెండో వికెట్‌కు నమోదైన 109 పరుగుల భాగస్వామ్యానికి తెర పడింది. షెర్ఫెన్ రూథర్ ఫోర్డ్(24) నిదానంగా ఆడగా.. షైహోప్ 104 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ వెంటనే రూథర్ ఫోర్డ్.. నమన్ ధీర్ బౌలింగ్‌లో కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. కీమో పాల్‌తో కలిసి షైహోప్ పోరాడాడు. కీమో పాల్ కూడా అతనికి సహకరించాడు. హాఫ్ సెంచరీకి చేరువైన అతన్ని గుర్నూర్ బ్రార్ పెవిలియన్ చేర్చాడు. దాంతో నాలుగో వికెట్‌కు నమోదైన 65 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. మాథ్యూ ఫోర్డ్(7) నిరాశపర్చగా.. గుడకేష్ మోతీ (19 నాటౌట్) కలిసి షై హోప్ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. 48వ ఓవర్‌లో అన్షుల్ కాంబోజ్ 22 పరుగులు ఇవ్వడం భారత్ విజయవకాశాలను దెబ్బతీసింది. ఈ ఓవర్‌కు ముందు వరకు భారత్ గెలుపు రేసులో ఉంది. వెస్టిండీస్ విజయానికి చివరి 18 బంతుల్లో 29 పరుగులు అవసరమయ్యాయి. కానీ అన్షుల్ కాంబోజ్ వేసిన 48వ ఓవర్లో వరుసగా 5nb, 4, 1, 4, 6లతో 22 పరుగులిచ్చుకొని మ్యాచ్ను వెస్టిండీస్ వశం చేశాడు. ఈ ఓవర్ కాస్త కట్టుదిట్టంగా వేసి ఉంటే.. వెస్టిండీస్ బ్యాటర్లే ఒత్తిడికి గురై వికెట్ పారేసుకునేవారు.




### ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్:**
ప్రారంభం 73,895.74 పాయింట్లు. ముగింపు 71,909.70 పాయింట్లు. నష్టం 1,986.04 పాయింట్లు.
**జాతీయ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ:**
ప్రారంభం 23,140.50 పాయింట్లు. ముగింపు 22,421.95 పాయింట్లు. నష్టం 718.55 పాయింట్లు.

(స్టాక్ మారెట్లు నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి, క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల వంటి అంశాలు ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. స్టాక్ మార్కెట్లు తీవ్రమైన అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి)

### బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర (సుమారుగా)
**24 కారట్:** రూ. 1,53,520
**22 కారట్:** రూ.1,41,331
**18 కారట్:** రూ. 1,15,718
(గమనిక: నగరం, జ్యువెలరీ సంస్థ, మేకింగ్ ఛార్జీలు, జిఎస్‌టిలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు).



## అక్టోబర్–మార్చి మధ్య కేంద్ర రుణం రూ.7.86 లక్షల కోట్లు

కేంద్రప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగంలో (అక్టోబర్–మార్చి) రూ.7. 86 లక్షల కోట్ల రుణం తీసుకోనుంది. దీంతో 2026–27 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం నిర్ణయించిన మొత్తం మార్కెట్ రుణం రూ.1,20, 494 కోట్ల మేర తగ్గనుంది. 2026–27లో భారత ప్రభుత్వం డేటెడ్ సెక్యూరిటీల ద్వారా రూ.15,99,506 కోట్ల మార్కెట్ రుణం సమీకరించనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాల్లో పేర్కొన్న రూ.17,20,000 కోట్లతో పోలిస్తే ఇది తక్కువ అని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ)తో సంప్రదింపుల అనంతరం 2026–27 ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగంలో రూ.7,86,000 కోట్ల రుణం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో రూ.15,000 కోట్ల సావరిన్ గ్రీన్ బాండ్ల (ఎస్‌జిఆర్‌బి) జారీ కూడా ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో ప్రభుత్వం బాండ్ల ద్వారా రూ.8,13,506 కోట్లను సమీకరించనుంది. రెవెన్యూ లోటును భర్తీ చేసేందుకు ఈ నిధులను ఉపయోగిస్తుంది.




తొలి అర్ధభాగానికి నిర్దేశించిన రూ.8.2లక్షల కోట్ల లక్ష్యంతో పోలిస్తే ఇది తక్కువ. రెండో అర్ధభాగంలోని రూ.7,86,000 కోట్ల స్థూల మార్కెట్ రుణాన్ని 23 వారపు వేలం ద్వారా ప్రభుత్వం పూర్తి చేయనుంది. ఈ రుణ సమీకరణను 3, 5, 7, 10, 15, 30, 40, 50 సంవత్సరాల కాలపరిమితి కలిగిన సెక్యూరిటీల ద్వారా చేపడతారు. వివిధ కాలపరిమితుల వారీగా రుణంలో 3 ఏళ్ల సెక్యూరిటీల వాటా 6.9 శాతం, 5 ఏళ్లవి 12.1 శాతం, 7 ఏళ్లవి 9.1 శాతం, 10 ఏళ్లవి 26.3 శాతం, 15 ఏళ్లవి 17.6 శాతం, 30 ఏళ్లవి 9.2 శాతం, 40 ఏళ్లవి 8.9 శాతం, 50 ఏళ్లవి 9.9 శాతంగా ఉంటుంది. ఇందులో సావరిన్ గ్రీన్ బాండ్ల జారీ కూడా కలిపి ఉంటుంది.




## క్షేత్రస్థాయికి కార్బన్ మార్కెట్

భారత వ్యవసాయ కార్బన్ మార్కెట్ తాజాగా క్షేత్రస్థాయికి చేరుకుంది. పంజాబ్, హర్యానాకు చెందిన 2,500 మందికి పైగా చిన్న, సన్నకారు రైతులు పునరుత్పాదక వ్యవసాయ పద్ధతులను అనుసరించినందుకు డిజిటల్ చెల్లింపులు అందుకున్నారు. 'ఆది' (ఎఎడిఐ) రైతు కార్బన్ కార్యక్రమం ద్వారా ఈ చెల్లింపులు జరిగాయి. పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులను రైతులకు అదనపు ఆదాయంగా మార్చాలనే లక్ష్యంతో గ్రో ఇండిగో 2019లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసిఎఆర్) దీనికి సాంకేతిక మార్గదర్శకత్వం అందించింది. 2019 నుంచి 2022 మధ్య రైతులు నేరుగా విత్తే వరి సాగు (డిఎస్ఆర్), తక్కువ దుక్కి దున్నడం, పంట అవశేషాల సమర్థ నిర్వహణ వంటి పద్ధతులను అనుసరించారు. ఈ విధానాలు నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు వ్యవసాయం నుంచి వెలువడే గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడమే లక్ష్యంగా సాగాయి. రైతుల పొలాల్లో ఉత్పత్తి అయిన కార్బన్ క్రెడిట్లలో వారి వాటా ఆధారంగా వారికి చెల్లింపులు చేశారు. తొలి విడతలో ఒక్కో రైతుకు రూ.3,000 నుంచి రూ.15,000 వరకు చెల్లించారు. పొలాల్లో గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలు ఎంత తగ్గాయి, నేలలో కార్బన్ నిల్వ ఎంత పెరిగింది అనే అంశాలను శాస్త్రీయ పద్ధతుల్లో కొలిచారు. స్వతంత్ర సంస్థల ధ్రువీకరణ తర్వాతే వెర్రా విఎం 0042 పద్ధతి కింద కార్బన్ క్రెడిట్లు జారీ చేశారు. ఈ కార్యక్రమం ప్రస్తుతం ఏడు రాష్ట్రాల్లో 20 లక్షల ఎకరాలకు పైగా విస్తరించింది. లక్ష మందికి పైగా రైతులు ఇందులో భాగస్వాములయ్యారు. పునరుత్పాదక వ్యవసాయ పద్ధతుల ద్వారా సుమారు 45 బిలియన్ లీటర్ల నీటిని ఆదా చేశామని, రెండు లక్షల టన్నులకు పైగా పంట అవశేషాలను కాల్చకుండా నివారించామని కార్యక్రమం అంచనా వేస్తోంది. అలాగే సుమారు 1,000 టన్నుల PM2.5 కాలుష్య ఉద్గారాలను తగ్గించినట్లు పేర్కొంది. తద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ, నీరు వంటి సహజ వనరులను ఆదా చేస్తూ, రైతులకు అదనపు ఆదాయం కల్పించే వాతావరణ అనుకూల వ్యవసాయానికి మార్గం ఏర్పడుతోంది.

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.



## జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలి

- 5న హనుమకొండ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ
- ఇండియా కూటమి పార్టీల ఉమ్మడి పిలుపు

**ప్రజాపక్షం/హనుమకొండ :** బిజెపి ఏజెంట్, కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని ఇండియా కూటమి నాయకులు డిమాండ్ చేశారు.శనివారం హనుమకొండ హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇండియా కూటమి నాయకులు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు కర్రె బిక్షపతి, జి.ప్రభాకర్ రెడ్డి, న్యూ డెమొక్రసీ జిల్లా నాయకులు నున్నా అప్పారావు, తెలంగాణ జన సమితి నాయకులు చిల్లా రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, అర్హులైన సామాన్యుల, పేదల ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా సిఇసి ఎంపిక ప్రక్రియలో చీఫ్ జస్టిస్‌ను భాగస్వామ్యం చేయాలన్నారు. ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు మాట్లాడుతూ అడ్డ దారిలో అధికారంలోకి వచ్చేందుకు బిజెపి ఎన్నికల కమిషన్‌ను ఉపయోగించుకున్నదని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మొదటి నుండి చేస్తున్న ఆందోళన నిజమైందని అన్నారు. ఇండియా కూటమి దేశ వ్యాప్తంగా ఓట్ చోరీపై ఆందోళనకు పిలుపునిచ్చిందని, ఈ నెల 5న హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్ నుండి ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరేట్ వరకు వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ విలేకరుల సమావేశంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి అనిల్ ప్రియాంక, నాయకులు మార్క విజయ్ కుమార్, బంక సరళ, సంపత్, పింగళి వెంకట్రామ్ రెడ్డి, జక్కుల రవీందర్, బోడ డిన్న, సిపిఐ నాయకులు ఆదరి శ్రీనివాస్ తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఎన్‌పి స్టాలిన్, మునిగాల బిక్షపతి, సిపిఎం నాయకులు బొట్ల చక్రపాణి, టి.ఉప్పలయ్య, వీరన్న, గొడుగు వెంకట్ పాల్గొన్నారు.

## 23న హమాలీ కార్మికుల రాష్ట్ర సదస్సు



- ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య

**ప్రజాపక్షం/కరీంనగర్ :** తెలంగాణ రాష్ట్రంలోని అన్ని సిమెం టు కంపెనీల గోదాములలో, డీలర్ షాపులలో పనిచేస్తున్న హమాలి కార్మికులకు పని భద్రత కల్పించాల్సిన బాధ్యత కంపెనీలపై, డీలర్‌షాప్‌లపై ఉందని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య అన్నారు. హమాలీ కార్మికుల సమస్యలపై రాష్ట్ర సదస్సును ఈ నెల 23న కరీంనగర్ లో బద్దం ఎల్లారెడ్డి భవన్ లో నిర్వహిస్తున్నామని ఆ సదస్సు జయప్రదం చేయాలని శనివారం బొమ్మకల్‌లోని సిమెంట్ గోదాముల వద్ద రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రం హమాలీ కార్మికులతో కలిసి సమ్మయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23న కరీంనగర్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని సదస్సును జయప్రదం చేయాలని కార్మికులను సమ్మయ్య కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటక రెడ్డి బుచ్చన్న యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు జంగం తిరుపతి యాదవ్‌తో పాటు సిమెంట్ గోదాం హమాలీ నాయకులు బాగోతం వీరయ్య, నన్నవేనీ కొమురయ్య, నన్నవేని శ్రీనివాస్, పల్లేరుల రాములు, దానవీని కొమురయ్య, ఉపాధి శ్రీనివాస్, బోహిని ఐలయ్య, దొంగల శ్రీనివాస్, ముత్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి తీరు ప్రజాస్వామ్యానికి విఘాతం

- సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో కూనంనేని




**ప్రజాపక్షం/ఖమ్మం :** బిజెపి తీరుతో ప్రజాస్వామ్యానికి విఘా తం ఏర్పడిందని ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రాథమిక హక్కుగా ఉన్న ఓటు హక్కును తొలగించడం నేరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. బిజెపి మొత్తం వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందని అందుకే దేశ వ్యాప్తంగా ఓటు పరిరక్షణ పేరుతో ప్రజా ఉద్యమాలు రూపుదిద్దుకుంటున్నాయని ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఖమ్మం జిల్లా సమితి సమావేశం శనివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఏనుగు గాంధీ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ దేశంలో యువతలో ప్రశ్నించే తత్వం పెరుగుతుందని అందుకే ప్రజా ఉద్యమాలు రూపుదిద్దుకుంటున్నాయని జన్‌జీ కూడా ఇందులో భాగమేనని ఆయన తెలిపారు. బిజెపి నేరాన్ని సైతం చట్టబద్ధంగా మార్చిందని దీని వల్ల దేశంలో ఆర్థిక నేరాలు పెరుగుతున్నాయన్నారు. ప్రజలకు జవాబుదారితనం వహించడం లేదని కేవలం విపక్షాలపై దాడి మాత్రమే ప్రభుత్వ పని కాదన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో ఈ ప్రభుత్వం విఫలమవుతుందన్న భావన ప్రజల్లో బలపడుతుందని ఆరు గ్యారెంటీల అమలుకు ఈ ప్రభుత్వం పూనుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 22ఎలో పేదలకు అన్యాయం జరిగితే సహించబోమన్నారు. ఈ నెపంతో దశాబ్దాలుగా పేదలు సాగు చేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకుంటే భూ పోరాటం తప్పదని కూనంనేని హెచ్చరించారు. పింఛన్ల పెంపు, ఫీజు రీయంబర్స్‌మెంట్‌తో పాటు పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్టిసి ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ దాని మిత్రపక్షాల విజయం కోసం సిపిఐ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాట మార్గాన్ని ఎంచుకోవాలని ఆయన సూచించారు. ప్రజా ఉద్యమ నిర్మాణంతోనే పార్టీ బలోపేతం అవుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.




## పౌరుల ఓట్లను హరిస్తున్న ఎన్నికల సంఘం

- ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్:** పౌరుల ఓటు హక్కును హరించే హక్కు ఎవరికి లేదని, ఓటు హక్కు కల్పించే ఎన్నికల సంఘం సర్ పేరుతో పౌరుల ఓట్లను హరిస్తుందని, ఓటర్ల జాబితాలో అక్రమాలను అడ్డుకోవడానికి విద్యార్థులు, యువత ముందుకు రావాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా కసిరెడ్డి మణికంఠ రెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్ నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా కసిరెడ్డి మణికంఠ రెడ్డి రెండోసారి ఎన్నికైన సందర్భంగా శనివారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితా నుంచి దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది పేర్లు తొలగించే కుట్ర జరుగుతోందన్నారు. రేవంత్ రెడ్డి ఏతుల రేవంత్ రెడ్డిగా మారాడని, విద్యార్థులకు ఇచ్చిన ఒక్క హామీ అమలు చేయకుండా విద్యాశాఖ తన వద్ద పెట్టుకొని నిర్లక్ష్యం చేస్తున్నాడని, నీట్ ఉద్యమ స్ఫూర్తితో రానున్న రోజుల్లో విద్యార్థుల సమస్యలపై గల్లి గల్లి విద్యార్థులను ఏకం చేసి పోరాటాలు నిర్వహిస్తామని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మచ్చ రమేష్, రేణికుంట్ల ప్రీతం, మంద అనిల్, కుర్ర రాకేష్, సాయి ఆజాద్, మామిడిపల్లి హేమంత్, కనకం సాగర్, నాయకులు సామ వినయ్ రెడ్డి, కసిరెడ్డి సందీప్ రెడ్డి, అనోష్, బోయినీ విష్ణు పాల్గొన్నారు.

## ఇయు, టిఎంయు, ఎన్‌యుఎం జెఎసి కూటమిని గెలిపించాలి

ఆర్‌టిసి ఎన్నికల ప్రచారంలో సిపిఐ నేత విఎస్.బోస్



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గుర్తింపు సంఘ ఎన్నికల్లో ఈయూ, టిఎంయు, ఎన్‌యుఎం జెఏసి కూటమిని గెలిపించాలంటూ ఏఐటియూసి రాష్ట్ర నాయకులు విఎస్ బోస్ ఆర్‌టిసి కార్మికులకు పిలుపిచ్చారు. శనివారం ఉప్పల్, చెంగిచెర్ల ఆర్‌టిసి బస్ డిపోల ఎదుట నిర్వహించిన కార్మిక సంఘ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంలో ఆర్‌టిసి కార్మికుల విలీనం, కార్మికుల హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత తదితర అంశాలపై కార్మికులు ఆలోచించుకొని తమకు అన్ని వేళలా సహకరించేందుకు ముందుకు వచ్చిన కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆర్‌టిసి కార్మికుల భవిష్యత్తుకు సంబంధించిన ఎన్నికల్లో ప్రతి కార్మికుడు తమ బాధ్యతగా గుర్తుంచుకొని ఓటు హక్కును వినియోగించుకొని కార్మికుల సమస్యల పరిష్కారంలో భాగస్వామం అయ్యేందుకు సంఘటితంగా ఉండాలన్నారు. కార్మికుల ఐక్యతే బలం అని నిరూపించాలన్నారు. సిపిఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్, మండల కౌన్సిల్ సభ్యులు దండు రమేష్, బాపరాజు, ఐలయ్య, జి.నాగరాజు, ఇస్తారి, సోమరాజు, ఆర్‌టిసి కార్మికులు, యూనియన్ల నేతలు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆర్‌టిసిని విలీనం చేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఈనెల 9న జరిగే ఆర్‌టిసి ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ కూటమిని అధిక మెజారిటీతో గెలిపించాలని సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తాండ్ర సదానందం పిలుపునిచ్చారు. శనివారం గోదావరిఖని బస్ డిపో ముందు నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పి విలీనం చేయకుండా సాచివేత ధోరణిని అవలంబిస్తున్నదని విమర్శించారు. ఆర్‌టిసి కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడుతున్న ఏకైక సంఘం ఏఐటియుసి అని కార్మిక సోదరుందరు ఆలోచించి ఓటు వేసి ఎంప్లాయిస్ యూనియన్ గుర్తు అయిన బస్ గుర్తుకు ఓటు వేసి బారి మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ గేట్ మీటింగ్‌లో సిపిఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కె.కనకరాజ్, కార్పొరేటర్ కామ్రేడ్ మార్కాపురి సూర్య మాట్లాడారు. వంగర శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ గేట్ మీటింగ్‌లో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కాళిదాసు, జిల్లా సెక్రటరీ కొమ్మ కొమరయ్య యాదవ్, లక్ష్మ ణ్, కూకట్ల శ్రీనివాస్, ఎస్ఎన్ రెడ్డి, ఏఐటియుసి నగర అధ్యక్ష కార్యదర్శులు కామ్రేడ్ అబ్దుల్ కరీం, శనిగరపు చంద్రశేఖర్, రెణికుంట్ల ప్రీతం, ఆర్‌టిసి జేఏసి నాయకులు శంకర్ రెడ్డి, మన్మోహన్ రెడ్డి, ఏవి ఆర్ రెడ్డి, కిషోర్, ఎంఎస్ రాణి, సృజన, శ్రీలత, భారతి, శిరీష, చారి, ఆంజనేయులు పాల్గొన్నారు.

## సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్టు చేయాలి

ఎఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు కె.ధర్మేంద్ర




**ప్రజాపక్షం/ఉప్పల్ :** సిఇసి జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలతో దేశవ్యాప్తంగా తమ ఓటు హక్కును కాపాడాలంటూ రోడ్డెక్కాల్సిన దుస్థితి ఏర్పడిందని, దీనికి కారకుడైన సిఇసి వెంటనే తన పదవి నుండి తప్పుకోవాలని, లేదంటే కేంద్ర ప్రభుత్వమే ఆ పని చేయాలని ఎఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు కె.ధర్మేంద్ర డిమాండ్ చేసారు. ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హబ్సిగూడ చౌరాస్తా అంబేద్కర్ కూడలిలో సిఇసిని తొలగించి అరెస్టు చేయాలంటూ నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారదర్శకంగా జరుగాల్సిన ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సిఇసి అపహాస్యం చేసాడని, ప్రజాస్వామ్యంలో అర్హులైన ఏ ఒక్కరి ఓటు హక్కును తొలగించే అధికారం లేదన్నారు. ప్రజాస్వామ్య నిరసనలు, ఆందోళనలను నిర్బంధాలు, అరెస్టులతో అడ్డుకోలేరన్నారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సల్మాన్‌బేగ్, టి.సత్యప్రసాద్‌లు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్లు జవాబుదారీగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గిరిబాబు, చంద్రశేఖర్, అక్రమ్, సచిన్, ఉదీప్, రాహుల్, ప్రదీప్, భరత్, రాఘవ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
ఆదివారం
04-10-2026
www.prajapaksham.in




# ఎస్ఐఆర్ రద్దు చేయాలి

- ఓటరు జాబితాను పునరుద్ధరించాలి
- సినీ నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్‌రాజ్ పిలుపు

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేసి, గతంలో ఉన్న ఓటర్ల జాబితాను పునరుద్ధరించాలని నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్‌రాజ్ డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఎస్ఐఆర్ అంశం, ప్రస్తుత రాజకీయ పరిణామాలు అనే అంశంపై ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు మాజీ జస్టిస్ చంద్రకుమార్, సీనియర్ నాయకుడు ప్రతాపరెడ్డి, తెలంగాణ డెమోక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటదాస్, తెలంగాణ డెమోక్రటిక్ ఫోరం వినాయక్ రెడ్డి తదితరులు కలిసి మీడియాతో మాట్లాడారు. కర్ణాటకలోని 23 జిల్లాల్లో 100 పోలింగ్ బూత్లను పరిశీలించి, ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న మార్పులను అధ్యయనం చేసినట్లు తెలిపారు. అర్హత ఉన్న పలువురి పేర్లు జాబితా నుంచి తొలగించినట్లు తమ పరిశీలనలో గుర్తించామని చెప్పారు. ఈ వివరాలను ప్రజల నుంచి సేకరించిన సమాచారంతో సహా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఉపాధి, ఇతర కారణాలతో వలస వెళ్లిన వారు కొంతకాలం తమ నివాసంలో లేకపోతే వారి ఓటు హక్కును తొలగించడం సరికాదని అన్నారు. 2023 నుంచి ఎన్నికల సంఘానికి సంబంధించిన కీలక ఫైళ్లన్నింటినీ సుప్రీంకోర్టు తెప్పించుకుని పరిశీలించాలని ఆయన కోరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని కూడా ప్రకాశ్ రాజ్ డిమాండ్ చేశారు. ఏ ఒక్క రాజకీయ పార్టీకి మద్దతుగా కాకుండా ప్రజల హక్కుల పరిరక్షణ కోసం శాంతియుతంగా ప్రజా ఉద్యమం సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇది సుదీర్ఘ పోరాటమని, ప్రజలు ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# వనరుల సమీకరణపై ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ భూముల విలువ పెంచాలి.. పెట్టుబడులు ఆకర్షించాలి
- పర్యాటకాన్ని కీలక ఆదాయ వనరుగా తీర్చిదిద్దాలి: డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుని ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల విలువను పెంచడంతోపాటు పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుకూల వాతావరణం కల్పించాలని సూచించారు. పర్యాటక రంగాన్ని రాష్ట్రానికి కీలక ఆదాయ వనరుగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో శనివారం భట్టి విక్రమార్క అధ్యక్షతన వనరుల సమీకరణపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఆస్తులు, భూముల ద్వారా గరిష్ఠ ఆర్థిక ప్రయోజనం పొందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని భట్టి ఆదేశించారు. హిల్ట్ పాలసీ కింద ఎలాంటి అభ్యంతరాలు లేని పార్కులకు సంబంధించిన దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని భట్టి సూచించారు. పరిశ్రమలకు పాలసీపై మరింత అవగాహన కల్పించేందుకు ఆరు పార్కుల్లో మంత్రుల ఆధ్వర్యంలో రోడ్‌షోలు నిర్వహించాలని సిఎస్ సంజయ్ జాజు సూచించారు.



**పర్యాటక ప్రాజెక్టులకు రూ.30 వేల కోట్ల ప్రతిపాదనలు..**
గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ పర్యాటక రంగంలోని పెట్టుబడి అవకాశాలను ప్రదర్శించేందుకు 70 80 సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డిపిఆర్‌లు) సిద్ధం చేయాలని భట్టి ఆదేశించారు. గతంలో రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలను వివరించిన సందర్భంగా సుమారు రూ.30 వేల కోట్ల విలువైన పర్యాటక పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**కోటలు, టైగర్ టూరిజంపై దృష్టి..**
చారిత్రక కోటలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు పిపిపి విధానంలో 11 కోటలకు బిడ్‌లు ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు. టైగర్ టూరిజం కార్యక్రమాలను వెంటనే ప్రారంభించాలని భట్టి ఆదేశించారు. నిజాంసాగర్‌లోని నిజాం గెస్ట్‌హౌస్‌ను పర్యాటక అవసరాలకు వినియోగించే అంశాన్ని పరిశీలించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలో పర్యాటక మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు కారవాన్ పార్కుల ఏర్పాటును వేగవంతం చేయాలని భట్టి సూచించారు. ప్రధాన పర్యాటక ప్రాజెక్టుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటిని ఎప్పటిలోగా పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తెస్తారనే దానిపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.



# బిసి సర్టిఫికెట్ల అక్రమ జారీపై కమిషన్ ఆగ్రహం

- 2,123 సర్టిఫికెట్లపై విచారణ.. మూడు నెలల్లో రద్దుకు ఆదేశం
- నిజామాబాద్‌లో కుల బహిష్కరణపై 7న విచారణ: జి.నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తొలగించిన కులాల పేరుతో జారీ చేసిన 2,123 కుల ధ్రువీకరణ పత్రాలపై రాష్ట్ర బిసి కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. రెండు నెలల్లో విచారణ పూర్తిచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, మూడు నెలల్లో జారీ చేసిన సర్టిఫికెట్లను రద్దు చేయాలని ఆదేశించింది. ఆయా కులాలకు ఇకపై కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయకుండా తక్షణమే నిలిపివేయాలని సూచించింది. ఖైరతాబాద్‌లోని బిసి కమిషన్ కార్యాలయంలో శనివారం చైర్మన్ జి.నిరంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, డా.బాలలక్ష్మి రంగు, మెంబర్ సెక్రటరీ బి.బాల మాయాదేవి పాల్గొని, పలు నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశానికి ముందు సిసిఎల్‌ఎ కార్యదర్శి టి.వెంకటేష్‌ను కుల ధ్రువీకరణ పత్రాల జారీపై కమిషన్ వివరణ కోరింది. అలాగే పంబాల కుల ధ్రువీకరణ పత్రాలపై కూడా కమిషన్ ఆరా తీసింది. సర్టిఫికెట్లు జారీ చేసిన ప్రాంతాలకు చెందిన ఆరుగురు తహసీల్దార్లతో సమావేశమై పంబాల కులస్తుల వివరాలను నమోదు చేసింది.

**కుల బహిష్కరణపై 7న విచారణ..**
నిజామాబాద్ జిల్లాలో విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీల ద్వారా కొన్ని కులాల వారిని బహిష్కరిస్తున్న ఘటనలను కమిషన్ తీవ్రంగా పరిగణించింది. ఈ నెల 7న నిజామాబాద్ కలెక్టరేట్‌లో బాధితులతో సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. అనంతరం జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, పోలీసు అధికారులు, బిసి సంక్షేమ శాఖ అధికారులతో సమావేశమై సమస్య పరిష్కారంపై చర్చించనుంది. రాష్ట్రంలో బిసి రక్షణ చట్టాన్ని అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది.

**లొద్ద కులంపై ప్రత్యేక సర్వే..** కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో లొద్ద కులస్థుల సామాజిక, విద్యా, ఆర్థిక స్థితిగతులపై నిర్వహించిన క్షేత్రస్థాయి పర్యటనను కమిషన్ సమీక్షించింది. వారి పరిస్థితులపై సెస్ సంస్థ ద్వారా ప్రత్యేక సర్వే నిర్వహించాలని నిర్ణయించింది.

**స్థానికతపై ప్రెసిడెన్షియల్ ఆర్డర్ సవరణకు తీర్మానం..**
తెలంగాణలో పుట్టి పెరిగి పదో తరగతి వరకు ఇక్కడే చదివినప్పటికీ, ఇంటర్మీడియట్ ఇతర ప్రాంతంలో చదివిన విద్యార్థిని స్థానిక విద్యార్థి కాదన్న సుప్రీం కోర్టు తీర్పుపై కమిషన్ చర్చించింది. తెలంగాణ విభజన సమయంలో జారీ చేసిన ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌లో అవసరమైన సవరణలు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేసింది.

# విదేశీయుల గుర్తింపుపై నిఘా తీవ్రతరం

- అక్రమ నివాసాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధానికి ప్రత్యేక సంయుక్త తనిఖీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత్‌లో వీసా గడువు ముగిసినప్పటికీ అక్రమంగా నివసిస్తున్న, అలాగే విదేశాంగ, మ్మిగ్రేషన్ నిబంధనలను ఉల్లంఘిస్తున్న విదేశీయులను గుర్తించడానికి హైదరాబాద్ నగర పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. హైదరాబాద్ సిటీ పోలీస్ స్పెషల్ బ్రాంచ్ (ఫారెనర్స్ మానిటరింగ్ సెల్), ఫారెనర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఒ), స్థానిక శాంతిభద్రతల పోలీసులు మరియు ఐటి సెల్‌తో కలిసి ఆగస్టు 31 నుండి నగరం వ్యాప్తంగా ప్రత్యేక సంయుక్త శోధన ఆపరేషన్‌ను నిర్వహిస్తోంది. విదేశీయుల వివరాల సమగ్ర పరిశీలన, వీసా నిబంధనల అమలు, అక్రమ కార్యకలాపాల అడ్డుకట్టతో పాటు చట్టపరమైన బాధ్యతలపై ప్రజలు, వసతి గృహాల నిర్వాహకులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఇప్పటివరకు వీసా నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా ఉంటున్న 49 మంది విదేశీయులను గుర్తించి, వారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోల్డింగ్ సెంటర్లకు తరలించారు. వారిలో 12 మంది విదేశీయులను ఇప్పటికే వారి స్వదేశాలకు డిపోర్ట్ (దేశం నుండి పంపించివేయడం) చేశారు. మిగిలిన వారిని కూడా స్వదేశాలకు పంపించే వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన విదేశీయుల వివరాలు పరిశీలిస్తే తోలిచౌకి పోలీస్ స్టేషన్ 30 మంది, లంగర్ హౌస్‌లో 06, మెహదీపట్నంలో 06, రాజేంద్ర నగర్‌లో 03, బంజారాహిల్స్‌లో 02, సైఫాబాద్‌లో 01, గుడిమల్కాపూర్‌లో ఒకరు పట్టుబడ్డారు. క్షేత్రస్థాయి తనిఖీలు, విచారణలో కొంతమంది విదేశీయులు ఇమ్మిగ్రేషన్ ఉల్లంఘనలతో పాటు భారతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ పలు అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. గడువు ముగిసిన కొందరు విదేశీయులు నకిలీ నోట్ల చెలామణి, ప్రజలను మోసగించే నేరాలలో ప్రమేయం కలిగి ఉన్నట్లు తేలింది. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. తనిఖీల సమయంలో ఒక విదేశీయుడి వద్ద నుండి 250 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**ఆసుపత్రుల్లో ట్రాన్స్‌లేటర్ .. మధ్యవర్తి సేవల దుర్వినియోగం..**
స్టూడెంట్ వీసాపై ఇండియాకు వచ్చి, వీసా గడువు ముగిసిన తర్వాత కొందరు విదేశీయులు ఆసుపత్రులకు వచ్చే విదేశీ రోగులకు అనువాదకులుగా (ట్రాన్స్‌లేటర్లు), మధ్యవర్తులుగా పనిచేస్తున్నట్లు తేలింది. వీరు రోగుల నుండి భారీగా రుసుము వసూలు చేయడమే కాకుండా,






ఆసుపత్రి బిల్లులో దాదాపు 15 శాతం వరకు కమిషన్ పొందుతున్నట్లు గుర్తించారు.

**వ్యభిచార కార్యకలాపాలు..**
తనిఖీలలో కొందరు విదేశీ మహిళలు వ్యభిచార కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు వెల్లడైంది. పర్యాటక (టూరిస్ట్) వీసాపై వచ్చి గడువు ముగిసిన తర్వాత కూడా ఉంటున్న ఒక కెన్యా దేశస్తురాలు వ్యభిచారంలో పాల్గొంటుండగా గుర్తించారు.

**మాదకద్రవ్యాల దుర్వినియోగం..**
మత్తుకు బానిసైన ఒక విదేశీయుడు దగ్గు మందు (కోల్డ్ సిరప్)లో ఆల్ప్రాజోలమ్ మాత్రలను కలుపుకుని మత్తు కోసం ఉపయోగిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అలాగే, రాజేంద్రనగర్ పరిధిలో స్టూడెంట్ వీసాపై వచ్చి 2018, 2023, 2025 నుండి అక్రమంగా ఉంటున్న సౌత్ సుడాన్‌కు చెందిన ముగ్గురు విదేశీయులను అనుమానంతో డ్రగ్ స్క్రీనింగ్ టెస్ట్‌కు పంపగా, వారికి గంజాయి వాడినట్లు పాజిటివ్ అని తేలింది. ఇళ్ళు, ఫ్లాట్లు, హోటళ్ళు, గెస్ట్ హౌస్‌లు, సర్వీస్ అపార్ట్‌మెంట్లు మరియు విదేశీయులకు వసతి కల్పించే వారందరూ తప్పనిసరిగా పోలీసుల నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు.

వ్యాపార ప్రకటనల కోసమైనా లేదా సాధారణ అవసరాల కోసమైనా విదేశీయులకు వసతి ఇచ్చే ప్రతి ఒక్కరూ (ఇంటి యజమానులు, అద్దెదారులు, హోటళ్లు, సర్వీస్ అపార్ట్‌మెంట్లు మొదలైనవి) విదేశీయుల నమోదు నిబంధనలను తప్పక పాటించాలి.

# గురుకులాల్లో విద్యా ప్రమాణాలతో పాటు మౌలిక వసతుల బలోపేతం



- యూనిఫామ్‌లు, షూస్, పుస్తకాలు సకాలంలో అందాలి
- శానిటేషన్, భద్రత, తాగునీటిపై ప్రత్యేక దృష్టి
- ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక కార్యాచరణ: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్‌టి గురుకులాలు, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలతో పాటు మౌలిక వసతులను బలోపేతం చేయాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించే యూనిఫామ్‌లు, షూస్, పుస్తకాలు తదితర సామాగ్రిని ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో అందించాలని స్పష్టం చేశారు. సచివాలయంలో శనివారం గురుకులాలు, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో పిఎంయు ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లాలకు చేరిన సామాగ్రి విద్యార్థులకు చేరేలా చర్యలు తీసుకోవాలని, సరఫరాలో ఎక్కడైనా సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని సూచించారు. ప్రతి పనికి గడువు, బాధ్యుడైన అధికారిని నిర్దేశించి పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థుల సంఖ్య, స్థానిక అవసరాలకు అనుగుణంగా తరగతి గదులు, వంటశాలలు, తాగునీరు, ఆర్‌ఓ ప్లాంట్లు, వాషింగ్ సదుపాయాలు, శానిటేషన్ తదితర అంశాలతో సమగ్ర మౌలిక వసతుల ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన చోట్ల భద్రతా సిబ్బంది, పోలీసు సమన్వయం, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్, డిజిటల్ లెర్నింగ్ వనరులు, అదనపు కోచింగ్‌తో పాటు పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై మార్గదర్శనం అందించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. సమీక్షలో ఎస్‌సి గురుకులాల కార్యదర్శి రవి గుగులోతు, ఎస్‌టి గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి, ఆశ్రమ పాఠశాలల డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి, ఎస్‌సి స్టడీ సర్కిల్ డైరెక్టర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత

- యాసంగిలో తక్కువ నీటితో పండే పంటల వైపు రైతులు మళ్లాలి
- పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుకు మంత్రి తుమ్మల పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున యాసంగిలో తక్కువ కాలంలో, తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో పండే పంటల వైపు రైతులు మళ్లాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. పప్పుధాన్యాలు, నూనెగింజలకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్నందున వాటి సాగును ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. 'రైతు నేస్తం' 109వ ఎపిసోడ్‌లో మంత్రి పాల్గొని రబీ 2026–27 సీజన్‌కు జాతీయ ఆహార భద్రతా మిషన్, జాతీయ నూనెగింజల మిషన్ కింద విత్తనాల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. ప్రాజెక్టుల్లోని నీటి నిల్వలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో పంటల సాగు, నీటి పారుదల ప్రణాళిక రూపొందించాలని సూచించారు.
రైతులు తమకు అందుబాటులో ఉన్న సాగునీటి వనరులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని మంత్రి కోరారు. వేరుశనగలో కొత్త విత్తన రకాలను అందుబాటులోకి తీసుకురావాలని శాస్త్రవేత్తలను ఆదేశించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల రైతుల విజ్ఞప్తి మేరకు



ఇతర పంటలకు కూడా సబ్సిడీపై స్ప్రింక్లర్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయిల్‌పామ్ గెలలను కోత అనంతరం వేగంగా ఫ్యాక్టరీలకు తరలించి, రైతులకు చెల్లింపులు త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రబీలో నూనెగింజల సాగును ప్రోత్సహించేందుకు 52,425 ఎకరాల్లో 29,375 క్వింటాళ్ల ధృవీకరించిన విత్తనాలను రూ.36.76 కోట్ల సబ్సిడీతో పంపిణీ చేయనున్నారు. ఇందులో వేరుశనగ, కుసుమ, పొద్దుతిరుగుడు, నువ్వుల విత్తనాలు ఉన్నాయి. పప్పుధాన్యాల కింద 21 జిల్లాల్లో 29,008 క్వింటాళ్ల విత్తనాలను రూ.15.25 కోట్ల ఆర్థిక సహాయంతో సబ్సిడీపై పంపిణీ చేయనున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, విత్తనాల కోసం సమీప రైతు సేవా కేంద్రాలు లేదా మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.

# ఉన్నత విద్య.. ఉపాధి కల్పనే లక్ష్యం కావాలి

- డిగ్రీతో పాటు నైపుణ్యం తప్పనిసరి.. ప్రతి వర్సిటీలో ఇంక్యుబేషన్ సెంటర్లు: మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యార్థి చేతిలో డిగ్రీతో పాటు ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యం ఉండేలా ఉన్నత విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రావాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. తరగతి గదిలో బోధించే విద్యకు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలకు మధ్య ఉన్న అంతరాన్ని పూర్తిగా తొలగించాలని విద్యాసంస్థలకు పిలుపునిచ్చారు. ఉన్నత విద్యకు ఉపాధి లక్ష్యమే ప్రధానంగా ఉండాలని స్పష్టం చేశారు. కుకట్‌పల్లిలోని జెఎన్‌టియుహెచ్‌లో తెలంగాణ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'రీచ్–2026' (రిసెర్చ్, ఎడ్యుకేషన్ అండ్ అడ్వాన్స్‌మెంట్) సదస్సులో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తరగతి గది నుంచి భవిష్యత్ కెరీర్‌కు, విద్య నుంచి నైపుణ్యాలకు, పరిశోధన నుంచి పారిశ్రామిక రంగానికి నిరంతర అనుసంధానం ఉండాలని సూచించారు. కేవలం డిగ్రీ సర్టిఫికెట్లు అందించే విధానానికి స్వస్తి పలికి, విద్యార్థులకు ఆచరణాత్మక నైపుణ్యాలు అందించే విధంగా విద్యా విధానం మారాలన్నారు. కోర్సు పూర్తయ్యే నాటికే విద్యార్థి ఉద్యోగానికి అవసరమైన సామర్థ్యాలను సాధించేలా విద్యాసంస్థలు పనిచేయాలని సూచించారు. 'ఒక చేతిలో డిగ్రీ.. మరో చేతిలో నైపుణ్యం' నూతన ప్రమాణంగా మారాలని ఆకాంక్షించారు.విద్యార్థులు, పరిశోధకులు తమ ఆలోచనలను స్టార్టప్‌లు, నూతన ఉత్పత్తులుగా మలచుకునేందుకు వీలుగా ప్రతి విశ్వవిద్యాలయంలో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయా



లని మంత్రి సూచించారు. కరిక్యులమ్ రూపకల్పన, ల్యాబ్‌ల నిర్వహణ, ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ ప్రాజెక్టులు, పరిశోధనల్లో పరిశ్రమలు భాగస్వాములు కావాలని కోరారు. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో రాష్ట్రంలోని 65 ప్రభుత్వ ఐటిఐలను రోబోటిక్స్, ఆటోమేషన్, ఇండస్ట్రీ–4.0 వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని శ్రీధర్‌బాబు తెలిపారు. 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ద్వారా కొత్త తరహా విద్య, నైపుణ్య వ్యవస్థను నిర్మిస్తున్నామని వెల్లడించారు.'తెలంగాణ రైజింగ్2047' లక్ష్యానికి అనుగుణంగా ఉన్నత విద్యను ప్రపంచస్థాయికి తీసుకెళ్లడం, పరిశోధనల్లో ప్రతిభను పెంచడం, ఆవిష్కరణల వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై 'రీచ్–2026'లో విస్తృతంగా చర్చించారు. కార్యక్రమంలో సైయెంట్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ బి.వి.ఆర్. మోహన్‌రెడ్డి, టిజిసి హెచ్‌ఈ ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, జెఎన్‌టియుహెచ్ విసి ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్‌రెడ్డి, ఉస్మానియా వర్సిటీ విసి ప్రొఫెసర్ ఎం.కుమార్, ప్రొఫెసర్ పురుషోత్తంతో పాటు వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, 60కిపైగా ఉన్నత విద్యాసంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# సీనియర్ దర్శకుడు సింగీతం మృతి



**చెన్నై :** ప్రముఖ దర్శకులు సింగీతం శ్రీనివాస రావు శనివారం రాత్రి చెన్నైలోని కావేరీ హాస్పిటల్‌లో కన్నుమూశారు. వయోభారంతో కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన చివరిసారిగా దర్శకత్వం వహించిన 'సింగ్ గీతం' చిత్రం ఇటీవలే విడుదలైంది. ఈ సినిమాను నాగ అశ్విన్ నిర్మించారు. 94 సంవత్సరాల వయసులో దర్శకత్వం వహించిన తొలి భారతీయ దర్శకుడిగా ఆయన రికార్డ్ సృష్టించారు. నాటక రంగంలో తొలుత అరంగేట్రం సాగించి, చిత్రసీమలో స్థిరమైన ఉన్నతమైన దర్శక స్థానాన్ని పొందిన వ్యక్తి శ్రీనివాసరావు, ఆదిలో భారతి, స్వతంత్రపత్రికల్లో కథలు, స్కెచ్‌లు రాశారు. 'భ్రమ, అంత్యఘట్టం, చిత్రార్జున' వంటి నాటక రచనలు చేసి రచయితగా నిలదొక్కుకున్నారు. వీటన్నిటికీ పలు నాటకోత్సవాల్లో బహుమతులు గెలుచుకోవటమే కాక అనేక పర్యాయాలు ప్రదర్శితమైన ఖ్యాతి సంపాదించారు. నెల్లూరు జిల్లా ఉదయగిరిలో 21 సెప్టెంబరు 1931లో జన్మించిన సింగీతం, గూడూరు, నెల్లూరు, మద్రాసులలో విద్యాభ్యాసం చేసి సైన్సు డిగ్రీ సంపాదించారు. అధ్యాపక వృత్తితో జీవితం ఆరంభించిన ఆయన ఆ తర్వాత కాలంలో ఉత్తమ తెలుగు దర్శకులుగా స్థిరపడ్డారు. ప్రఖ్యాత దర్శకులు కె.వి. రెడ్డి దగ్గర 'దొంగరాముడు, మాయాబజార్' చిత్రాలకు సహాయకుడిగా 1954లో చిత్రరంగ ప్రవేశం చేశారు. తర్వాత దర్శక స్థానం అందుకున్నారు. ఆపైన ఎన్నో చిత్రాలకు దర్శక బాధ్యతలను నిర్వహించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, ఇంగ్లీషు చిత్రాలెన్నిటికో దర్శకులయ్యారు. దాదాపు చాలా చిత్రాలు విజయవంతంగా శతదినోత్సవాలు జరుపుకున్నాయి.

# దొంగ చరిత్ర ఉన్న వ్యక్తికి మిలటరీ ఉద్యోగం ఎలా?

- నియామకానికి ముందు నేపథ్య పరిశీలన జరగలేదా?
- బొల్లారం ఆయుధాల చోరీ కేసుతో వెలుగులోకి వస్తున్న కీలక ప్రశ్నలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ భద్రతతో ముడిపడిన అత్యంత సున్నితమైన మిలటరీ విభాగంలోకి చేరకముందే దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడవుతున్న వ్యక్తికి ఉద్యోగం ఎలా లభించింది? బొల్లారం మిలటరీ ఆయుధాల చోరీ కేసు నిందితుడు మల్లేష్‌ను పోలీసులు పది రోజులపాటు విచారించడంతో అతడి గత నేర చరిత్రకు సంబంధించిన అంశాలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు ప్రధానంగా మిలటరీ నియామక ప్రక్రియ, అభ్యర్థుల నేపథ్య పరిశీలన పైనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మిలటరీలో చేరకముందే మల్లేష్ దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో తేలిందని పోలీసులు గుర్తించారు.. అచ్చంపేట పరిధిలోని రెండు పోలీస్‌స్టేషన్లలో అతడిపై రెండు చోరీ కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, పోలీసుల దృష్టికి రాని మరికొన్ని చోరీ ఘటనలపై కూడా దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. ఒక వ్యక్తిపై గతంలోనే చోరీ కేసులు నమోదై ఉంటే.. మిలటరీలో నియమించే ముందు నిర్వహించే పోలీసు వెరిఫికేషన్, నేపథ్య పరిశీలనలో అవి ఎందుకు గుర్తించబడలేదు?దేశ రక్షణకు సంబంధించిన సంస్థలో పనిచేసే వ్యక్తి గత చరిత్రను నియామకానికి ముందే సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం లేదా? అన్న ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. సాధారణ ఉద్యోగ నియామకంతో పోలిస్తే మిలటరీ ఉద్యోగాలకు భద్రతాపరమైన ప్రాధాన్యత మరింత ఎక్కువ. ముఖ్యంగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి, సున్నితమైన సైనిక స్థావరాలతో సంబంధం ఉన్న ఉద్యోగాల్లో పనిచేసే వ్యక్తుల పూర్వ చరిత్ర, నేర నేపథ్యం, పోలీసు రికార్డులు, ప్రవర్తన తదితర అంశాలను అత్యంత జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరం ఉంటుంది. అయితే మల్లేష్ విషయంలో గతంలో నమోదైన కేసులు నియామక సమయంలో అధికారుల దృష్టికి వచ్చాయా? వచ్చి ఉంటే వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? కేసులు నమోదైనప్పటికీ అతడికి మిలటరీలో చేరే అవకాశం ఎలా లభించింది? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ వివరాలపై సంబంధిత అధికారులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. బొల్లారం ఆయుధాల చోరీ ఘటనలో మల్లేష్ పాత్రపై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో, చోరీ జరిగిన తీరుతో పాటు అతడి మిలటరీ నియామకానికి ముందు జరిగిన నేపథ్య పరిశీలనను కూడా విచారణలో భాగంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దేశ భద్రతకు సంబంధించిన వ్యవస్థలో ఇలాంటి లోపాలకు భవిష్యత్తులో అవకాశం లేకుండా నియామక ప్రక్రియలో భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరాన్ని ఈ ఘటన తెరపైకి తెచ్చింది.

# తొలిముద్దతో చిన్నారులకు పౌష్టికాహారం

- మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/ పెద్దకొత్తపల్లి :** చిన్నారుల ఎదుగుదలకు తొలిదశ నుంచే పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్పాహార పథకం తొలిముద్ద కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూరు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అల్పాహార (తొలిముద్ద) కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని, పిల్లలకు అల్పాహారాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా తినిపించి తొలిముద్ద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ మున్సిపల్ చైర్మన్, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

**2.50 కోట్లతో ఎస్టీ బాలుర వసతి గృహ నిర్మాణాలు**
నేటి పోటీ ప్రపంచంలో విద్యతోనే సామాజిక ఆర్థిక అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యమవుతుందని టూరిజం ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొల్లాపూర్ పట్టణంలో రూ.2.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఎస్టీ బాలుర వసతి గృహం నూతన భవనానికి శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు.

# కాంగ్రెస్ సిఎంలు రాజీనామా చేసి బ్యాలెట్‌తో ఎన్నికలకు సిద్ధమా?



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈవిఎంల వల్లే గెలిచామని భావిస్తే తెలంగాణ, కర్నాటక, కేరళ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లోని కాంగ్రెస్ ముఖ్యమంత్రులు వెంటనే రాజీనామా చేసి, బ్యాలెట్ పేపర్లతో మళ్లీ ఎన్నికలకు వెళ్లాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. హైదరాబాద్ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సిఈసి జ్ఞానేశ్ కుమార్ స్వతంత్ర వ్యవస్థకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని, ఆయనకు బిజెపికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇండీ కూటమికి ప్రజాదరణ కరువైందని, ముంబై, ఢిల్లీలలో వారు నిర్వహించిన ఆందోళనలకు జనం రాకపోవడమే దానికి నిదర్శనమన్నారు. కేరళలో సిపిఐ(ఎం) దొంగ ఓట్లను తొలగించడం వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని రమేశ్ చెన్నితల చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలని కోరారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని సంతోషీమాత దేవాలయంపై జరిగిన దాడిని హేయమైన చర్యగా అభివర్ణించిన బండి సంజయ్, ప్రభుత్వం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకుండా దాడి చేసిన వారిని పిచ్చివాళ్లుగా చిత్రీకరిస్తోందని విమర్శించారు. ప్రార్థనా మందిరాల సంరక్షణలో ప్రభుత్వం విఫలమైతే యువత తిరగబడే పరిస్థితి వస్తుందని ఆయన హెచ్చరించారు. అలాగే, కెప్టెన్ స్మిత్ మచ్చార్ ధైర్యసాహసాలను ప్రపంచమంతా కొనియాడుతుంటే రాహుల్ గాంధీ స్పందించకపోవడం దారుణమని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కాంగ్రెస్ మౌనం వహిస్తోందన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు పార్టీలూ ఒకటేనని, బిఆర్ఎస్ అవినీతిపై కాంగ్రెస్ ఎలాంటి విచారణ జరిపించడం లేదని ఆరోపించారు.

# సర్కార్ దవాఖానల్లో ప్రజల ప్రాణాలకు గ్యారంటీ లేదు

టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని ప్రభు త్వ ఆసుపత్రుల నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని తెలంగాణ రక్షణ సేన(టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో జరిగిన అగ్నిప్రమాదంలో ఐదుగురు చిన్నారులు మృతి చెందిన దారుణ ఘటనను మరవకముందే, భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలోని ఎస్ఎన్ సియు విభాగంలో సీలింగ్ కూలిపోవడంపై ఆమె సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీలింగ్ కూలిన సమయంలో అదృష్టవశాత్తూ వార్డులో పిలల్లు లేకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పిందని, లేదంటే ప్రభుత్వ నిర్లక్ష్యానికి మరికొంతమంది పసికందులు బలైపోయేవారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ దవాఖానకు వెళ్తే ప్రజల ప్రాణాలకు రక్షణ లేని దుస్థితి ఏర్పడిందని, ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం క్షీణించి, కనీస మందులు, బెడ్లు లేక రోగులకు వీల్ చైర్లలోనే చికిత్స అందించే దయనీయ పరిస్థితులు ఉన్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ఆసుపత్రుల దుస్థితిని ప్రజల ముందుంచేందుకు తమ పార్టీ ఆధ్వర్యంలో 'ఆపరేషన్ బ్లూ కోడ్' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శిస్తామని ప్రకటించారు. మరోవైపు వికారాబాద్ జిల్లా అనంతగిరి ఘాట్ రోడ్డులో ప్రైవేట్ బస్సు బోల్తా పడి ముగ్గురు దుర్మరణం చెందిన ఘటనపై కూడా కవిత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి ప్రభుత్వం తక్షణమే మెరుగైన ఉచిత వైద్యం అందించాలని, మరణించిన వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# శాంతి భద్రతల పరిరక్షణలో విఫలమైన సిఎం

హిందూ ఆలయాలకు సరైన భద్రత కల్పించాలి

బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగరంలోని దిల్‌సుఖ్ నగర్ సంతోషి మాత ఆలయంపై జరిగిన దాడి ఘటనను బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి దాదాపు 15కు పైగా హిందూ దేవాలయాలపై దాడులు, విగ్రహాల ధ్వంసం, అపవిత్ర ఘటనలు చోటుచేసుకోవడం భక్తుల భావోద్వేగాలను తీవ్రంగా దెబ్బతీస్తోందని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో, బార్కస్‌లోని శ్రీ ద్విముఖి హనుమాన్ ఆలయంలో జరిగిన వరుస అపవిత్ర ఘటనలను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. దిల్‌సుఖ్ నగర్ ఘటనలో వేరే మతానికి చెందిన వ్యక్తి ఆలయంపై దాడి చేస్తే, పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్న తర్వాత మతిస్థిమితం లేదని చెప్పి వదిలేయడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. హోం మంత్రిత్వ శాఖను కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఈ ఘటనపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, హిందూ ఆలయాలకు సరైన భద్రత కల్పించాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం

అఖిల భారత శాంతి సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ పిలుపు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని అఖిల భారత శాంతి సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ పిలుపునిచ్చారు. యుద్ధం వల్ల మానవాళికి అంతులేని నష్టం వాటిల్లుతుందని అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఏఐపిఎస్ఓ జిల్లా 4వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. వ్యక్తి ఆలోచన మూలంగానే శాంతిగాని, యుద్ధంగాని వస్తుందన్నారు. చెడు ఆలోచన ప్రపంచానికి వేరు చేస్తుందని చెప్పారు. సామ్రాజ్యవాదం ఆకాంక్షతో అమెరికా వంటి దేశాలు ప్రపంచంలోని చిన్న చిన్న దేశాలను ఆక్రమిస్తున్నాయన్నారు. తమ వ్యాపార విస్తరణ కోసం యూరప్ దేశాలు కూడా అమెరికాకు వంత పాడుతున్నాయన్నారు. యుద్ధం వల్ల ఇరాక్, ఇరాన్ దేశాల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోగా అనేక మంది క్షతగాత్రులయ్యారని చెప్పారు. ఆహార పదార్థాల కొరత, అవసరమైన నిత్యవసర వస్తువులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

# కాగితం ఉత్పత్తితో అడవులకు నష్టం లేదు

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా




**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** సేవ్ పేపర్.. సేవ్ ట్రీస్ వంటి ప్రచార నినాదాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని.. కాగితపు ఉత్పత్తి సహజ అటవీ ఆవాసాలను నాశనం చేయదని.. గ్రామీణ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతుందనే వాస్తవాన్ని పరిశ్రమ వర్గాలు సమాజానికి తెలియజేయాలని తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. ఫెడరేషన్ ఆఫ్ పేపర్ ట్రేడర్స్ అసోసియేషన్స్, తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని నోవాటెల్ హెచ్ఐసీసీలో ఏర్పాటు చేసిన 'ఎఫ్పీటీఏ 65వ వార్షిక సర్వసభ్య సమావేశం, కాన్ఫరెన్స్ 2026'ను గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిజిటలైజేషన్ పెరిగినా భౌతిక కాగితం లేని సమాజం అసాధ్యమన్నారు. జీఎస్టీ వ్యత్యాసాల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి కంటే నిర్మాణాత్మక ప్రాతినిధ్య విధానం మేలని సూచించారు. త్వరితగతిన పంట చేతికి వచ్చేలా ప్రత్యేకంగా సాగు చేసే పాప్లర్ వంటి వ్యవసాయ అటవీ వృక్షాల నుంచే ముడి కలపను సేకరిస్తారన్నారు. ప్రసార, డిజిటల్ మాధ్యమాలు త్వరగా మరుగునపడే లేదా మళ్లీ రీసైకిల్ అయ్యే వార్తలను అందిస్తుండగా, ముద్రిత దినపత్రికలు మాత్రమే రోజువారీ ఆలోచనలకు, ఏకాగ్రతతో కూడిన పఠనానికి, ప్రజా చర్చకు నమ్మకమైన, ప్రామాణికమైన మాధ్యమంగా నిలుస్తున్నాయని తెలిపారు. డిజిటలైజేషన్ వల్ల 'తక్కువ కాగితం' వాడే పరిస్థితి రావచ్చేమో గానీ, పూర్తిగా 'కాగితం లేని' సమాజం అసాధ్యం అన్నారు. చరిత్ర, సంస్కృతి, అధికారిక పరిపాలన, వినతులు ఎల్లప్పుడూ భౌతిక కాగితంపైనే ఆధారపడి ఉంటాయని ఆయన గుర్తుచేశారు. కాగితంపై 18 శాతం జీఎస్టీ, నోట్‌బుక్‌లపై 0 శాతం జీఎస్టీ వంటి పన్ను వ్యత్యాసాల పరిష్కారానికి పరిశ్రమ వర్గాలు ఆందోళనల కంటే నిర్మాణాత్మక ప్రాతినిధ్య విధానాన్ని ఎంచుకోవాల్నారు. సుమారు రూ.లక్ష కోట్ల పన్ను చెల్లించే రంగంగా, వాణిజ్య సంఘాలు రాష్ట్ర ప్రతినిధులకు, ఆర్థిక మంత్రికి, జీఎస్టీ కౌన్సిల్‌కు స్పష్టమైన, పద్ధతి ప్రకారమైన వినతిపత్రాలను సమర్పించాలన్నారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ప్రపంచ అగ్రగామిగా ఎదిగే క్రమంలో కాగితపు పరిశ్రమ వాణిజ్యానికి, విద్యకు, జాతీయ ప్రతిష్ఠకు ఒక కీలకమైన చోదక యంత్రంగా పని చేస్తుందని జోశ్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎఫ్పీటీఏ ప్రెసిడెంట్ నామినీ టి.కిషన్‌సింగ్ మాట్లాడుతూ, కాగితం మిల్లులకు, వినియోగదారులకు మధ్య పేపర్ వ్యాపారులు కీలకమైన వారధిగా పని చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అభిషేక్ విజయ్‌వర్గీయ మాట్లాడుతూ, ఏటా 2.4 కోట్ల టన్నులకు పైగా ఉత్పత్తి చేస్తూ ఆర్థిక వ్యవస్థకు లక్ష కోట్లకు పైగా మద్దతు ఇస్తూ, దాదాపు 5 లక్షల మందికి ప్రత్యక్షంగా, 15 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న భారతీయ కాగిత పరిశ్రమ ఆర్థిక వ్యవస్థలో ఒక కీలక స్తంభంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐటీసీ లిమిటెడ్ సీఈఓ రాజేష్ పొన్నూరు విచ్చేయగా, టీపీఎంఏ గౌరవ కార్యదర్శి ఆశిష్ జైన్ భన్సాలీ, ఐపీఎంఏ ప్రెసిడెంట్, నైనీ పేపర్స్ లిమిటెడ్ సీఎండీ పవన్ అగర్వాల్, జేకే పేపర్ లిమిటెడ్ ప్రెసిడెంట్ , డైరెక్టర్ ఏఎస్ మెహతా, ఇమామి పేపర్ మిల్స్ లిమిటెడ్ సీఈఓ, హోల్‌టైమ్ డైరెక్టర్ సుశీల్ కుమార్ ఖేతాన్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## 'చైనా క్యాంపస్' ప్రచారం అవాస్తవం

శ్రీచైతన్యకు ఎలాంటి సంబంధం లేదు.. అధికారిక ప్రకటనలనే నమ్మాలి: డైరెక్టర్ శ్రీధర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'చైనా క్యాంపస్' పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి శ్రీచైతన్య విద్యాసంస్థలకు ఎలాంటి సంబంధం లేదని సంస్థ డైరెక్టర్ శ్రీధర్ స్పష్టం చేశారు. శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థల మధ్య 'చైనా క్యాంపస్' పేరుతో భాగస్వామ్యం కుదిరిందంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టర్లు, సందేశాలు, డిజిటల్ కంటెంట్ అవాస్తవమని తెలిపారు.ఇలాంటి భాగస్వామ్యానికి సంబంధించి శ్రీచైతన్య విద్యాసంస్థలు ఎలాంటి ఒప్పందం చేసుకోలేదని, భవిష్యత్తులోనూ ప్రస్తుతం అలాంటి ప్రతిపాదన ఏదీ సంస్థ పరిశీలనలో లేదని శ్రీధర్ స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో కనిపించే ప్రతి సమాచారాన్ని సంస్థ అధికారిక సమాచారంగా భావించవద్దని సూచించారు. శ్రీచైతన్య విద్యాసంస్థలకు సంబంధించిన నిర్ణయాలు, కార్యక్రమాలు, భాగస్వామ్యాలు, ఇతర ముఖ్యమైన అంశాలపై సమాచారం సంస్థ అధికారిక కమ్యూనికేషన్ వేదికల ద్వారానే వెల్లడిస్తామని తెలిపారు. సంస్థ పేరు, లోగో, బ్రాండ్ గుర్తింపులను అనుమతి లేకుండా ఉపయోగించి తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం చట్టపరమైన పరిణామాలకు దారితీయవచ్చని శ్రీధర్ హెచ్చరించారు.విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, ఉద్యోగులు, ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే పోస్టర్లు, సందేశాలను ఇతరులకు పంపించే ముందు వాటి ప్రామాణికతను పరిశీలించాలని ఆయన సూచించారు. ధృవీకరించని ప్రచారాలను నమ్మకుండా, శ్రీచైతన్య విద్యాసంస్థల అధికారిక ప్రకటనలను మాత్రమే ప్రామాణిక సమాచారంగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు.

## రైలులో కన్ఫర్మ్ టికెట్ కావాలా? చార్ట్ తయారయ్యాక కూడా ఛాన్స్!



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైల్వే ప్రయాణికులకు ఇది నిజంగా శుభవార్తే. రైలు రిజర్వేషన్ చార్ట్ తయారైన తర్వాత కూడా కన్ఫర్మ్ టికెట్ పొందే అవకాశం ఉంది. ఖాళీగా ఉన్న సీట్లు లేదా బెర్తులు అందుబాటులో ఉంటే, 'కరెంట్ బుకింగ్' సదుపాయం ద్వారా ప్రయాణికులు టికెట్లను బుక్ చేసుకోవచ్చు. మొదటి రిజర్వేషన్ చార్ట్ తయారైన వెంటనే టికెట్ బుకింగ్ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోదని ఓ సీనియర్ రైల్వే అధికారి పేర్కొన్నారు. టిక్కెట్ల రద్దు లేదా ఇతర సర్దుబాట్ల కారణంగా చార్ట్ తయారీ అనంతరం ఖాళీగా మిగిలిన బెర్తులను కరెంట్ బుకింగ్ కింద కేటాయిస్తారు. ఈ విధానంలో కేవలం కన్ఫర్మ్ టికెట్లు మాత్రమే జారీ చేస్తారని, ఆర్ఏసీ లేదా వెయిటింగ్ లిస్ట్ టికెట్లు అందుబాటులో ఉండవని స్పష్టం చేశారు.ఐఆర్‌సీటీసీ మార్గదర్శకాల ప్రకారం, కరెంట్ బుకింగ్ సదుపాయం సాధారణ ప్రయాణికులతో పాటు ఏజెంట్లకూ అందుబాటులో ఉంటుంది. ఇందులో కేవలం ఈటికెట్లను మాత్రమే అనుమతిస్తారు. సీనియర్ సిటిజన్, దివ్యాంగులకు వర్తించే రాయితీలు ఈ టిక్కెట్లపై కూడా వర్తిస్తాయి. అయితే, కరెంట్ బుకింగ్ టికెట్లపై బోర్డింగ్ పాయింట్, ప్రయాణికుడి పేరు, వయసు లేదా జెండర్ వంటి వివరాల మార్పులకు అవకాశం ఉండదు. ప్రీమియం, సువిధ రైళ్లలో చివరిగా బుక్ అయిన టికెట్ ధరలే వీటికి వర్తిస్తాయి. ఇటీవల రైల్వే శాఖ చార్ట్ తయారీ సమయాల్లో మార్పులు చేసింది. ఉదయం 5:01 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల మధ్య బయలుదేరే రైళ్లకు, ముందు రోజు రాత్రి 8:00 గంటలకే మొదటి చార్ట్‌ను సిద్ధం చేస్తున్నారు. మిగిలిన రైళ్లకు కనీసం 10 గంటల ముందు చార్ట్ తయారవుతుంది. ఇక తుది చార్ట్‌ను రైలు బయలుదేరడానికి సుమారు 30 నిమిషాల ముందు సిద్ధం చేస్తారు. కావున, మొదటి చార్ట్ తయారీతో బుకింగ్ ముగిసిందని భావించకుండా, అందుబాటులో ఉన్న సీట్ల వివరాలను నేరుగా తనిఖీ చేసుకోవడం ఉత్తమమని అధికారులు సూచిస్తున్నారు.

## అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి

- ఎల్‌నినో నేపథ్యంలో విద్యుత్, నీరు పొదుపుగా వాడుకోవాలి
- దిశ సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సూచన




**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్, తాగునీరును ప్రజలు పొదుపుగా వాడుకోవాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా 'దిశా' కమిటీ చైర్‌పర్సన్ జి.కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. శనివారం తార్నాకలోని సిఎస్ఐఆర్ఐఐసిటి సమావేశ మందిరంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా 'దిశా' కమిటీ చైర్‌పర్సన్ జి.కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా అభివృద్ధి, పర్యవేక్షణ కమిటీ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో నగర అభివృద్ధి, మౌలిక వసతులు, ప్రజా సమస్యలు, కేంద్ర సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర పథకాల అమలులో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలని.. ఆ దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా, జవాబుదారీగా వ్యవహరించాలని సూచించారు. కేంద్రం నుంచి నిధులు తీసుకురావటంలో తన వంతు ప్రత్యేక కృషి చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు.

## అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం: బెదిరింపులొచ్చినా తగ్గేది లేదు

సిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగవని కమిషనర్ డాక్టర్ జి. సృజన అన్నారు. అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న సమయంలో తమకు బెదిరింపులు వస్తున్నప్పటికీ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నగర సమగ్ర అభివృద్ధే తమ ప్రాధాన్యమని ఆమె తేల్చి చెప్పారు. సిఎంసి ప్రధాన కార్యాలయంలో శనివారం ఆమె మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. అంజయ్య నగర్ ఘటన అనంతరం నుంచి ఇప్పటివరకు నగర వ్యాప్తంగా 398 అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో అక్రమ కట్టడాలకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకుండా నిరోధించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తామన్నారు. నగరంలో అధిక భాగం అక్రమ నిర్మాణాలు హాస్టళ్ల కోసమే జరుగుతున్నాయని గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో హాస్టళ్ల నిర్మాణాలు, నిర్వహణకు సంబంధించి త్వరలోనే ఒక ప్రత్యేక విధానాన్ని అమలులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా మాత్రమే నిర్మాణాలు సాగేలా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. పట్టణ అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుతం సరిపడా నిధులు ఉన్నప్పటికీ, భవిష్యత్‌లో చేపట్టబోయే భారీ ప్రాజెక్టుల కోసం అవసరమైతే అప్పులు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో తలెత్తే వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఒక సమగ్ర మాస్టర్‌ప్లాన్ రూపుదిద్దుకుంటుందన్నారు. ఈ ప్రణాళికను క్షేత్రస్థాయిలో వేగంగా అమలు చేసేందుకు అవసరమైతే రూ.4 వేల నుంచి రూ.5 వేల కోట్ల వరకు రుణాలు సమీకరించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు త్వరలోనే ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించేలా ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తెస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు. రాంకీ సంస్థ ద్వారా సుమారు 3,500 స్వచ్ఛ ఆటోలను కొనుగోలు చేసి, చెత్త సేకరణ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మారుస్తామన్నారు. ప్రజల నుంచి ప్రత్యేకంగా చెత్త పన్ను వసూలు చేయబోమని, ఈ రుసుమును ఆస్తి పన్నులోనే కలిపి వసూలు చేస్తామన్నారు. మురికివాడలు, సాధారణ ప్రాంతాలకు వేర్వేరు పన్ను నిష్పత్తులు వర్తించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పౌర సమస్యల పరిష్కారానికి చేపట్టిన 'వన్ డే.. ఎవ్రీ వార్డు' కార్యక్రమం ద్వారా నగరంలోని ప్రతి వార్డులోనూ ఒక విడత పర్యటన పూర్తయిందని కమిషనర్ చెప్పారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించి, వార్డుల వారీగా సమస్యలను నేరుగా గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు. పాలనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించడం ద్వారా మెరుగైన పౌర సేవలు అందించేందుకు 'టివర్క్స్' సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. అంతేకాకుండా నగర పౌరుల సౌకర్యార్థం పాలనా యంత్రాంగం కోసం త్వరలోనే సిఎమ్సి నూతన భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుడతామన్నారు.

## ప్రకాశ్ రాజ్ రాజ్యాంగ వ్యవస్థల పట్ల ఇంత దిగజారి మాట్లాడటం సరికాదు

బిజెపి అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ ఎన్.వి.సుభాష్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజ్యాంగబద్ధ సంస్థ అయిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి (సిఈసి) జ్ఞానేశ్ కుమ్రా సిని నటుడు, రాజకీయ విశ్లేషకుడు ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలను బిజెపి రాష్ట్ర శాఖ తీవ్రంగా ఖండించింది. వినాయక నిమజ్జనం లాగే సిఈసి జ్ఞానేశ్ కుమార్‌ను కూడా నిమజ్జనం చేయాల్సిన సమయం వచ్చిందంటూ ప్రకాశ్ రాజ్ మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంపై బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ ఎన్.వి. సుభాష్ స్పందించారు. ఒక ప్రముఖ నటుడై ఉండి రాజ్యాంగ వ్యవస్థల పట్ల ఇంత దిగజారి మాట్లాడటం సరికాదన్నారు. విమర్శలు చేసే హక్కు ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ఉంటుందని, అయితే సిఈసి పదవిని తీసుకెళ్లి విగ్రహ నిమజ్జనంతో పోలుస్తూ హేళన చేయడం రాజకీయ హద్దులు దాటడమేనని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఏవైనా అభ్యంతరాలు లేదా లోపాలు ఉంటే సరైన వేదికలపై ఆధారాలతో పోరాడాలి తప్ప, వీధుల్లో పడి ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడటం బాధ్యతారాహిత్యమన్నారు.

## ఉత్కంఠ మధ్య హౌస్‌ఫెడ్ ఎన్నికలు



ఏడుగురు డైరెక్టర్లుగా విజయం

86 శాతం పోలింగ్..

5న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ (హౌస్‌ఫెడ్) ఎన్నికలు ఉత్కంఠభరితంగా సాగాయి. రాష్ట్రవ్యాప్తంగా మూడు జోన్ల పరిధిలో జరిగిన ఎన్నికల్లో అభ్యర్థుల మధ్య హోరాహోరీ పోటీ నెలకొనగా.. మొత్తం 86 శాతం పోలింగ్ నమోదైంది. ఫలితాలు వెలువడటంతో విజేతల అనుచరులు, మద్దతుదారుల్లో ఉత్సాహం నెలకొంది. ఎన్నికల్లో ముదిగంటి శ్రీనివాస రెడ్డి, బ్రహ్మాండభేరి గోపరాజు, పట్లోళ్ల శంకర్ రెడ్డి, పామర్తి అంకినీడి ప్రసాద్, గౌడ్ కిషన్ రావు, రవీందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి డైరెక్టర్లుగా విజయం సాధించారు. ఫలితాల అనంతరం ఎన్నికల అధికారి చంద్రమోహన్ రెడ్డి విజేతలకు ఎన్నికల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సొసైటీల ప్రతినిధులు, ఓటర్లు ఆసక్తిగా ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్ అనంతరం ఫలితాలు వెలువడటంతో విజేతల శిబిరాల్లో సంబర వాతావరణం నెలకొంది. నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లను పలువురు సొసైటీల ప్రతినిధులు, నాయకులు అభినందించారు.

**చైర్మన్, వైస్ చైర్మన్‌పై ఉత్కంఠ..**

డైరెక్టర్ల ఎన్నిక పూర్తికావడంతో ఇప్పుడు హౌస్‌ఫెడ్ తదుపరి నాయకత్వంపై ఆసక్తి నెలకొంది. ఫెడరేషన్‌కు కీలకమైన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు సోమవారం జరగనున్నాయి. దీంతో ఈ పదవులను ఎవరెవరు దక్కించుకుంటారన్నది చర్చనీయాంశంగా మారింది. కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలకు సంబంధించిన పలు అంశాల్లో హౌస్‌ఫెడ్ కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో కొత్తగా ఎన్నికైన డైరెక్టర్లపై బాధ్యతలు మరింత పెరిగాయి. హౌసింగ్ సొసైటీల అభివృద్ధి, సభ్యుల ప్రయోజనాల పరిరక్షణ, హౌసింగ్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఫెడరేషన్‌ను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని సొసైటీల ప్రతినిధులు ఆకాంక్షించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించిన ఎన్నికల సిబ్బందికి, ఎన్నికల ప్రక్రియకు సహకరించిన సొసైటీల అధ్యక్షులకు, వివిధ జిల్లాల నుంచి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్లకు పలువురు అభినందనలు తెలిపారు.

## ప్రజల పక్షాన పనిచేసే జర్నలిజం అవసరం

- మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి
- వృత్తి గౌరవాన్ని నిలబెట్టాలని జర్నలిస్టులకు పిలుపు
- ఎఐ, సోషల్ మీడియాపై నల్లగొండలో శిక్షణ




**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రజల పక్షాన పనిచేసే జర్నలిజం వ్యవస్థ అవసరమని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జర్నలిస్టులు వృత్తి గౌరవాన్ని నిలబెట్టేలా పనిచేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,సామాజిక మాధ్యమాలపై నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని మెరుగైన జర్నలిజాన్ని ప్రజలకు అందించేందుకు,వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఎఐ సోషల్ మీడియా జర్నలిస్టులకు ఉపయోగపడుతుందని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్టోబర్ 12న నాగార్జునసాగర్‌లో కూడా జర్నలిస్టులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పత్రికా స్వేచ్ఛ, ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్, డిజిటల్ మీడియా,వర్కింగ్ జర్నలిస్టులు తెలుసుకోవాల్సిన ప్రధాన చట్టాలపై అవగాహన కల్పించారు. శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఎఐ వచ్చాక ప్రతి పౌరుడు జర్నలిస్టులా వ్యవహరిస్తున్నారని,ఏది నిజం, ఏది అబద్ధమో తెలిసేలా వార్తలు అందించాలన్నారు. అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి మాట్లాడుతూ ఎఐ వల్ల మంచితో పాటు చెడు కూడా జరిగే అవకాశం ఉందని, నిరాధార వార్తలు రాయవద్దని సూచించారు.ఈ సందర్భంగా టైమ్స్ ఆఫ్ ఇండియా ఎడిటర్ ఇన్వెస్టిగేషన్ ఉడుముల సుధాకర్ రెడ్డి ఎఐ పై,నరసింహస్వామి సోషల్ మీడియా పై జర్నలిస్టులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి,సమాచార శాఖ ఎడియు.వెంకటేశ్వర్లు, టియూడబ్ల్యూజే( ఐజేయు) జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి,జిల్లా ప్రధానకార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ ఓఎస్డిరహమాన్, పిఆర్ఓ, శైలేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily

హైదరాబాద్
ఆదివారం
04-10-2026
www.prajapaksham.in

"తెలుగు పరిశ్రమలో అత్యంత గౌరవంగా భావించే 'నంది' అవార్డులను పునరుద్ధరించడం తెలుగు చలన చిత్ర పరిశ్రమకు శుభపరిణామమని తెలుగు నిర్మాతల మండలి అధ్యక్షుడు సి.కళ్యాణ్, కార్యదర్శులు ప్రసన్న కుమార్, వైవిఎస్ చౌదరి విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు"

రీల్

# 'అల సెంద్రవంక' పాట ఆవిష్కరణ



నరేష్ వికె, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'క్రేజీ కల్యాణం'. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'అల సెంద్రవంక' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. సురేష్ బొబ్బిలి బ్యూటిఫుల్ మెలోడీ ట్యూన్‌తో ఈ పాటను కంపోజ్ చేయగా జి.వెంకన్న ఆకట్టుకునే లిరిక్స్ అందించారు. అనురాగ్ కులకర్ణి అందంగా పాడారు. 'అల సెంద్రవంక' లిరికల్ సాంగ్ ఎలా ఉందో చూస్తే 'అందం మురిసే, గంధం కురిసే పిల్లా నీ మేని సొగసులనే చూసి, వేకువలోనా వెన్నెల కాసి, పిల్లా నీ పెదవులపై నవ్వె పూసే, నీ అడుగులతోనే అవనే పులకించే, నీ తనువును తాక మేఘం తలవంచే, సింగిడి రంగులతో పొంగే ఆకాశం, నీ ఒంటికి చీరై నిగనిగా మెరిసిందా..' అంటూ ఆకట్టుకు నేలా సాగుతుందీ పాట నరేష్ వికె, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉడ్డె మారి, తదితరులు నటించారు. ఈ చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్ జె.గాయత్రి దేవి, ఆర్ట్ డైరెక్టర్ సాయి కదిర, ప్రొడక్షన్ డిజైనర్ శ్రీపాల్ మాచర్ల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అఖిల్ సాయి శ్రీమూర్తి, కొరియోగ్రాఫర్ ఈశ్వర్ పెంటి, యాక్షన్ డ్రాగన్ ప్రకాష్ ,లిపాటలు గోరటి వెంకన్న, చైతన్య ప్రసాద్, కాసర్ల శ్యామ్, ఎడిటర్ శ్రావణ్ కటికనేని, డిఒపి శ్యామ్ దూపాటి, మ్యూజిక్ సురేష్ బొబ్బిలి.



# 'రణబాలి' థర్డ్ ఎపిసోడ్ 'ది మెన్ వి ఫర్ గాట్' విడుదల

విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 16న విజయదశమి పర్వదినం సందర్భంగా 'రణబాలి' సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.'రణబాలి' నెవర్ ఫర్ గెట్ ది ట్రూత్ పేరుతో రూపొందించిన 4 ఎపిసోడ్స్ డాక్యుమెంటరీ సిరీస్‌లో థర్డ్ ఎపిసోడ్ 'ది మెన్ వి ఫర్ గాట్' ఈ రోజు యూట్యూబ్‌లో స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. తమ మాతృభూమి కోసం పోరాడిన కొందరూ రాయలసీమ చారిత్రక వీరుల స్ఫూర్తితో రణబాలి పాత్రను క్రియేట్ చేసినట్లు దర్శకుడు రాహుల్ సంకృత్యన్ ఈ ఎపిసోడ్‌లో తెలిపారు. డైరెక్టర్ రాహుల్ సంకృత్యన్ మాట్లాడుతూ ఎందరో వీరులను కన్న గడ్డ రాయలసీమ. బుడ్డా వెంగళరెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, గడేకల్ బొబ్బిలి నాగిరెడ్డి వంటి సీమ పాలెగాళ్ల వీర గాథలు ఇప్పటికీ బుర్రకథలుగా చెప్పుకుంటారు. రాయల సీమ గ్రామాలకు వెళ్తే అక్కడి ప్రజలు వీరి గొప్పదనం గురించి మాట్లాడుతుంటారు. గడేకల్ బొబ్బిలి నాగిరెడ్డి గురించి విన్నప్పుడు నాకు ఈ కథ ఆలోచన కలిగింది. ఆయన గుర్రం స్వారీ చేస్తూ వెళ్లేవారు. దేవుళ్లతోనూ మాట్లాడుతారని ప్రతీతి. అనంతరం కుట్రలు చేసి ఆయనను హత్య చేశారు. అప్పటి కరువు కాలం గురించి పరిశోధన చేస్తున్నప్పుడు బుడ్డా వెంగళరెడ్డి గురించి తెలుసుకున్నాను. కరువు కాలంలో ఆయన తన ఆస్తులన్నీ అమ్మి గంజి కేంద్రాలను ఏర్పాటు చేసిన వేలాది మంది ప్రజల ప్రాణాలు కాపాడారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడి వారికి సింహస్వప్నంలా నిలిచారు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి. నేను రాయలసీమ గడ్డ నుంచి వచ్చినవాడినే. ప్రజలకు మంచి చేసేందుకు ఇలా ధీరత్వం ప్రదర్శించే ఎంతోమందిని నా చిన్నతనంలో చూశాను. ఈ వీరులంతా మంచి శరీర ధారుడ్యంతో ధైర్య సాహసాలు ప్రదర్శించేవారు. వారందరినీ స్ఫూర్తిగా తీసుకుని రణబాలి పాత్రను డిజైన్ చేసుకున్నాను. అన్నారు. నాలుగో ఎపిసోడ్ 'ది లాస్ట్ లోడ్ స్ట్రీమింగ్ డేట్‌ను త్వరలో మేకర్స్ ప్రకటించనున్నారు.

# హిలేరియస్ అడ్వెంచర్ 'చంద్రయాన్'

## దర్శక, నిర్మాత వేణు ఊడుగుల

'రాజు వెడ్స్ రాంబాయి సూపర్ హిట్ తర్వాత నిర్మాత వేణు ఊడుగుల తన సమర్పణలో 'చంద్రయాన్' టైటిల్‌తో మరో ఇంట్రెస్టింగ్ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ చిత్రంలో శివకుమార్ ధీకొండ, స్వప్న ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేష్, బలగం సత్యనారాయణ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సింబ స్క్రీన్ స్టోరీస్ బ్యానర్‌పై ప్రవీణ్ మొలక నిర్మిస్తున్నారు. శ్రీనాథ్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. హిలేరియస్ అడ్వెంచర్ స్టోరీతో తెరకెక్కిన 'చంద్రయాన్' సినిమా 30న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోం ది. ఈ చిత్ర గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌ను ప్రముఖ ఆస్ట్రలాజర్ వేణు స్వామి అతిథిగా హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూవీ ప్రెజెంటర్ వేణు ఊడుగుల మాట్లాడుతూ ఈ సినిమా చూసిన తర్వాత ఈ చిత్రంలో నేను పార్ట్



కావాలని అనిపించింది. ఈ టీమ్ అంతా చాలా కాలంగా నాకు పరిచయం. ఈ టీమ్ నిజాయితీగా, ప్యాషన్‌తో ఒక మంచి ప్రయత్నం చేస్తున్నారని నమ్మాను. ఇది రెగ్యులర్ రొటీన్ సినిమా కాదు. ఒక అర్థవంతమైన సినిమా. అలాగే ఈ చిత్రాన్ని కమర్షియల్ ఇంపాక్ట్ ఉన్న ట్రీమ్ మెంట్‌తో రూపొందించారు. వీళ్ల ప్రయత్నం అద్భుతంగా అనిపించింది. అమాయకులైన ఒక నలుగురు యువకులు రాకెట్ తయారు చేసుకుని స్పేస్‌లోకి వెళ్లడం అనే పాయింట్ ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. సైన్స్ తెలియకుండా, పెద్దగా చదువుకోకుండా ఏదో సాధించాలనే తపనతో నలుగురు యువకులు రాకెట్ తయారుచేయడం, స్పేస్ లోకి వెళ్లడం వంటి అంశాలు ప్రేక్షకులకు కొత్త ఫీల్ కలిగిస్తాయి. స్పేస్‌లోకి వెళ్లేందుకు రాకెట్ తయారుచేసి స్పేస్ లోకి లాంఛ్ చేసే క్రమంలో చాలా ఫన్ క్రియేట్ అవుతుంది. ఈ జర్నీలో వాళ్లు ఎదుర్కొన్న ఇబ్బందులు, తెలుసుకున్న విషయాలను అద్భుతంగా తెరకెక్కించారు దర్శకుడు. 30న ఈ సినిమా థియేటర్స్‌లోకి వస్తోంది. మీరంతా సక్సెస్ చేయాలని కోరుకుంటున్నా అన్నారు. ఆస్ట్రలాజర్ వేణు స్వామి మాట్లాడారు. ఈ ఈవెంట్ లో సంగీత దర్శకుడు హర్ష ప్రవీణ్, నటుడు లోకేష్ , నటుడు రవి శివతేజ , హీరోయిన్ స్వప్న ప్రియదర్శిని , నిర్మాత డా.పూజారి నాగేశ్వర రావు , హీరో శివకుమార్ ధీకొండ , డైరెక్టర్ శ్రీనాథ్ చంద్రశేఖర్ , చిత్ర నిర్మాత ప్రవీణ్ మొలక పాల్గొన్నారు.

# 'మొహబ్బత్' టీజర్ రిలీజ్



సంతోష్ రాజా, శ్రేయాస్ సేన్ జంటగా రూపొందుతున్న చిత్రం 'మొహబ్బత్' ఎబిఎస్ ప్రొడక్షన్స్ పతాకంపై మ్యాక్ దర్శకత్వంలో అఫ్రోజ్ షేక్ నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హీరో నవదీప్, దర్శకుడు కరుణకుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సలీమ్ షేక్, దర్శకుడు మ్యాక్, సినిమాటోగ్రఫర్ వైఎస్ కృష్ణ, రచయిత కలాం, నటులు ఈశ్వర్ సాయి, మనోజ్, సాత్విక్, శ్రేయాస్ సేన్, సంతోష్ రాజా, అజయ్ ఘోష్, సంతోషి, దుర్గ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవదీప్ టీజర్‌ను ఆవిష్కరించారు. నవదీప్ మాట్లాడుతూ నిర్మాత అఫ్రోజ్ అమెరికాలో జాబ్ చేసి...వాళ్ల సొంత ఊరిలో స్కూల్ కట్టించడం.. ఇప్పుడు తన డ్రీమ్ సినిమాను నిర్మిస్తున్నారు. హీరోయిన్ శ్రేయాస్ సేన్, సంగీత దర్శకుడు సునీల్ కాశ్యప్ మాట్లాడారు. ఈ చిత్ర నిర్మాతలు ఎక్కడా కూడా కాంప్రమైజ్ కాకుండా ఖర్చు పెట్టి ఈ సినిమా నిర్మించారు. ఈ సినిమాలో మంచి పాటలు ఉంటాయి' అన్నారు. నటుడు అజయ్ ఘోష్ మాట్లాడుతూ నిర్మాతలు అమెరికాలో ఉద్యోగం చేసి.. 25 సంవత్సరాల తరువాత సినిమా నిర్మించాలనే కలను నెరవేర్చుకుంటున్నారు. నిర్మాత అఫ్రోజ్ షేక్, దర్శకుడు మ్యాక్, హీరో సంతోష్ పాల్గొన్నారు.

# 'నంది'ని పునరుద్ధరించడం శుభపరిణామం

## నిర్మాతల మండలి అధ్యక్షుడు సి. కళ్యాణ్

తెలుగు పరిశ్రమలో అత్యంత గౌరవంగా భావించే నంది అవార్డులను పునరుద్ధరించడం తెలుగు చలన చిత్ర పరిశ్రమకు శుభపరిణామమని తెలుగు నిర్మాతల మండలి అధ్యక్షుడు సి.కళ్యాణ్, కార్యదర్శులు ప్రసన్న కుమార్, వైవిఎస్ చౌదరి విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్, 2017 2024 సంవత్సరాలకు గాను నిలిచిపోయిన 'నంది ఫిల్మ్ అవార్డుల'ను తిరిగి పునరుద్ధరించినందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ కి, సినిమాటోగ్రఫీ మంత్రి కె. దుర్గేష్ , ఎమ్మెల్యే ప్రముఖ సినీ నటులు నందమూరి బాలకృష్ణకి, ఎ.పి. రాష్ట్ర ఫిల్మ్, టీవీ అండ థియేటర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ పి. భరత్ భూషణ్ కి , మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు. ఎ.పి. ఎఫ్డిసి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వారు సమర్పించిన లేఖలోని అభ్యర్థనను పరిశీలించి, బంగారు నంది, వెండి నంది మరియు కంస్య నంది (గోల్డెన్, సిల్వర్ అండ్ బ్రాంజ్ నంది) అనే మూడు కేటగిరీలలో నంది అవార్డులను పునరుద్ధరించడానికి అంగీకరించినందుకు ధన్యవాదాలు తెలియజేసారు. అలాగే, 2017–2024 సంవత్సరాలకు గాను 'ఎన్.టి.ఆర్. జాతీయ ఫిల్మ్ అవార్డు'ను కూడా పునరుద్ధరించడంపై పరిశీలించినందుకు వారు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు. 1964 సంవత్సరం నుండి స్థాపించిన నంది ఫిల్మ్ అవార్డులు అనేది తెలుగు చలనచిత్ర పరిశ్రమకు మరియు తెలుగు ప్రజల సంస్కృతికి ఒక భావోద్వేగంతో కూడుకున్న విషయం. మన సంస్కృతిని గౌరవించడం ఎల్లప్పుడూ ప్రకృతిని కాపాడుతుంది, అది తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి తోడ్పడుతుంది. అందువల్ల, నంది ఫిల్మ్ అవార్డుల ద్వారా కళాకారులను, సాంకేతిక నిపుణులను సత్కరించడాన్ని అందరూ అభినందిస్తున్నారని వారన్నారు.



# కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రెండు రోజుల తెలంగాణ పర్యటన అనివార్య కారణాల వల్ల చివరి నిమిషంలో రద్దయింది. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 3, 4 తేదీల్లో ఆయన రాష్ట్రంలో పర్యటించాల్సి ఉంది. తూప్రాన్ పరిధిలోని ఉర్జా ఇండస్ట్రియల్ పార్కులో 'సబర్ డెయిరీ ప్రాజెక్ట్ మిల్క్ ప్లాంట్' శంకుస్థాపనతో పాటు, కరీంనగర్‌లోని ప్రతిమ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. దీనికి సంబంధించి అధికారులు భద్రతా ఏర్పాట్లను కూడా పూర్తి చేశారు. ఢిల్లీలో ముందే నిశ్చయించిన ముఖ్యమైన ఉన్నత స్థాయి సమావేశం ఉన్నందున ఈ పర్యటనను వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది.

# ఎఐటియుసి పోరాటాల ఫలితం

## హమాలీలకు రేట్ల పెంపు.. రూ.2 లక్షల మెడికల్ ఇన్సూరెన్స్: ఎస్.బాల్‌రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎఐటియుసి ఆధ్వర్యంలో హమాలీ కార్మికులు సాగించిన పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం హమాలీ రేట్లను పెంచుతూ సర్క్యులర్ నెం.183/ఇడిఎస్/టిఎస్ జారీ చేసిందని సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ తెలిపారు. 2026 జనవరి 1 నుంచి క్వింటాల్‌కు రూ.33 చొప్పున హమాలీ రేటు పెంపు వర్తిస్తుందని, పెరిగిన రేట్ల బకాయిలను కూడా చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. హమాలీలకు దసరా స్వీట్‌కు రూ. 1 వెయ్యి, యూనిఫాం కోసం రూ.1,600, స్వీపర్లకు రూ.400, యూనిఫాం కుట్టుకూలీ, గన్నీ బ్యాగ్ బేల్ బండిల్‌కు చెల్లింపును రూ.50 నుంచి రూ.100కు పెంచినట్లు తెలిపారు. హమాలీ కార్మికుడు మృతి చెందినప్పుడు దహన సంస్కారాల కోసం ఇచ్చే మొత్తాన్ని రూ.20 వేల నుంచి రూ.30 వేలకు పెంచినట్లు చెప్పారు. రూ.2 లక్షల మెడికల్ ఇన్సూరెన్స్ సదుపాయాన్ని హమాలీలు, స్వీపర్లకు కల్పించడం పట్ల బాల్‌రాజ్ హర్షం వ్యక్తం చేశారు. అలాగే ప్రావిడెంట్ ఫండ్ సదుపాయాన్ని 2026 నుంచి కొనసాగించేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. సివిల్ సప్లయిస్, జెసిసి గోడౌన్‌లలో పని చేసే హమాలీలు, స్వీపర్లందరికీ ఈ సౌకర్యాలు వర్తిస్తాయని తెలిపారు. 2026 జనవరి 1 నుంచి అక్టోబర్ వరకు పెరిగిన హమాలీ రేట్ల బకాయిలను వెంటనే చెల్లించనున్నట్లు కమిషనర్ ప్రకటించారని బాల్‌రాజ్ వెల్లడించారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లోని అన్ని సౌకర్యాలు కార్మికులకు అందేలా జిల్లా మేనేజర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారని తెలిపారు. హమాలీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించినందుకు పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కమిషనర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ఆటో కార్మికుల కోసం త్వరలో సంక్షేమ బోర్డు

**కిలోమీటర్‌కు రూ.14కు ఛార్జీ పెంపు.. రూ.1.50 లక్షల సబ్సిడీతో బ్యాటరీ ఆటోలు**
**మానవీయ కోణంలో సమస్యల పరిష్కారం: డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆటో కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రవాణా రంగ కార్మికుల న్యాయమైన సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. శనివారం రాత్రి ప్రజాభవన్‌లో హైదరాబాద్ ఆటో డ్రైవర్ల సంఘాల జెఎసి నాయకులకు భట్టి విక్రమార్క ఆత్మీయ విందు ఇచ్చారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్‌సి అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఆటో డ్రైవర్ల విజ్ఞప్తి మేరకు కిలోమీటర్‌కు రూ.11గా ఉన్న ఛార్జీని రూ.14కు పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిందని భట్టి తెలిపారు. రవాణా రంగంలో దాదాపు 20 లక్షల కార్మిక కుటుంబాలు ఉన్నాయని, వారి సంక్షేమ బోర్డు ఏర్పాటుపై ఇప్పటికే కేబినెట్‌లో చర్చించామని చెప్పారు. అవసరమైన నిధులు కేటాయించి త్వరలో బోర్డును ఏర్పాటు చేస్తామన్నారు.

**బ్యాటరీ ఆటోలకు రూ.1.50 లక్షల సబ్సిడీ..**

కాలుష్యాన్ని తగ్గించేందుకు డీజిల్ ఆటోల స్థానంలో బ్యాటరీ ఆటోలను ప్రోత్సహిస్తున్నామని భట్టి తెలిపారు. 'రాజీవ్ యువ వికాసం' కింద రూ.200 కోట్లు కేటాయించామని, ఒక్కో ఆటోకు రూ.1.50 లక్షల వరకు సబ్సిడీ అందిస్తున్నామని చెప్పారు. భవిష్యత్‌లో సోలార్, బ్యాటరీ, సిఎన్‌జి ఆటోలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ప్రజల అవసరాలే అజెండాగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఆటో జెఎసి అధ్యక్షుడు బి.వెంకటేశంతో పాటు పలు ఆటో సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యార్థికి మంత్రి అడ్లూరి అభినందనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సంకల్పం, క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవచ్చని తెలంగాణ గిరిజన గురుకుల విద్యార్థి ఇస్లావత్ బన్నీ నిరూపించారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని 6,027 మీటర్ల ఎత్తైన మౌంట్ తరంగ్2 శిఖరాన్ని సెప్టెంబరు 22న అధిరోహించి, తొలి భారతీయ బృందంలో భాగస్వామిగా నిలిచారు. సెప్టెంబరు 30న సురక్షితంగా తిరిగి వచ్చారు. కామారెడ్డి తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో బికాం చివరి సంవత్సరం చదువుతున్న బన్నీని శనివారం సచివాలయంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శాలువాతో సత్కరించి అభినందించారు. బన్నీ విజయం ఇతర గురుకుల విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని మంత్రి పేర్కొన్నారు. సాహస క్రీడలు, క్రీడల్లో విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, గురుకుల సంస్థలు సహకరిస్తాయని తెలిపారు. మౌంట్ తరంగ్2ను అధిరోహించిన తొలి భారతీయ బృందంలో బన్నీ భాగస్వామిగా నిలవడం గర్వకారణమని టిజిటిడబ్ల్యుఆర్ఇఐఎస్ కార్యదర్శి కె. సీతాలక్ష్మి అన్నారు. బన్నీని సొసైటీ అధికారులు, కళాశాల సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు.



# భారత్‌దే 'గోల్డ్'

(మొదటి పేజీ తరువాయి)

పసిడి పట్టేసింది. నిరుడు ఆసియా కప్ టైటిల్ పోరులో అర్ధ శతకంతో దాయాది ఆశల్ని ఆవిరి చేసిన తిలక్ వర్మ(51).. ఈసారీ టీమిండియా హీరో అయ్యాడు. 19 పరుగుల తేడాతో గెలుపొందిన మెన్ ఇన్ బ్లూ టీ20 ఫైనల్లో పాకిస్థాన్‌పై హ్యాట్రిక్ విజయాలు నమోదు చేసింది.

**వరల్డ్‌కప్‌తో మొదలు..**

పద్దెనిమిదేళ్ల క్రితం పొట్టి ప్రపంచకప్ ఫైనల్లో పాకిస్థాన్‌ను భారత జట్టు చిత్తు చేసింది. ఉత్కంఠ పోరులో మిస్బాహుల్ హక్(43) క్యాచ్ను శ్రీశాంత్ అందుకోగా తొలి ఎడిషన్ ఛాంపియన్‌గా అవతరించింది ధోనీ సేన. నిరుడు టీ20 ఫార్మాట్లో జరిగిన ఆసియా కప్‌లోనూ దాయాదులు ఫైనల్లో ఢీకొన్నాయి. పాక్ నిర్దేశించిన 147 పరుగుల ఛేదనలో 20కే మూడు కీలక వికెట్లు పడినవేళ క్రీజులోకి వచ్చిన ఈ లెఫ్ట్ హ్యాండర్ జట్టును గెలిపించే బాధ్యత తీసుకున్నాడు. సంజూ శాంసన్(24), శివం దూబే(33)లతో కీలక భాగస్వామ్యం నెలకొల్పిన తిలక్.. హ్యారిస్ రవుఫ్ వేసిన 19వ ఓవర్లో సిక్సర్‌తో జట్టు విజయాన్ని ఖాయం చేశాడు. చివరి ఓవర్లో రింకూ సింగ్ బౌండరీతో టీమిండియా ఐదు వికెట్లతో పాక్‌ను చిత్తు చేసి తొమ్మిదోసారి ఛాంపియన్‌గా నిలిచింది.

ఇప్పుడు జపాన్ వేదికగా ఆసియా క్రీడల్లోనూ టీమిండియా పంచ్‌కు పాక్ తోక ముడిచింది. తొలుత ఓపెనర్ అభిషేక్ శర్మ(61), తిలక్ వర్మ(69 నాటౌట్)లు హాఫ్ సెంచరీతో మెరిశారు. ఆపై 212 పరుగుల ఛేదనలో హసన్ నవాజ్(96) రాణించినా దూబే, సుందర్, అక్షర్ పటేల్‌లు రెండేసి వికెట్లు తీయడంతో పాక్ 192కే పరిమితమైంది. అంతే.. అంతర్జాతీయంగా మూడు టీ20 ఫైనల్స్‌లోనూ జయభేరి మోగించిన భారత్.. పాక్‌పై ఈ ఫార్మాట్లో వరసగా పదో విజయంతో తమ ఆధిపత్యాన్ని ఘనంగా చాటుకుంది.

# అదుపుతప్పి బస్సు బోల్తా

(మొదటి పేజీ తరువాయి)

ఓ ట్రావెల్స్ బస్సులో (ఎపి 03టిసి 8295 నెంబర్) బయలుదేరారు. ఈనేపథ్యంలో బస్సు వేగంగా వెళ్తూ అనంతగిరి ఘాట్ రోడ్డు మూల మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు ప్రాణాలు కోల్పోయారు. మృతులను బిరగుడం పద్మమ్మ (50), ప్రేమిల (52), అంతిరెడ్డి ఇద్దరు భార్యలు పద్మమ్మ, యాదమ్మగా గుర్తించారు. ఈ ప్రమాదంలో మరో 16మందికి పైగా తీవ్రంగా గాయపడడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. సంఘటన స్థలంలో డిఎస్‌పి అంజయ్య , సిఐ రఘుకుమార్ సందర్శించి సహక చర్యలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి, జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా, పతాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆనంద్, డిసిసి అధ్యక్షుడు ధారసింగ్ తదితరులు ఘటనపై ఆరా తీశారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను జిల్లా ఇన్‌చార్జ్‌మంత్రి శ్రీధర్‌బాబు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారిని వికారాబాద్ జిల్లా ఆసుపత్రిలో పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ బస్సు ప్రమాదంలో నలుగురు మృతి చెందడం అత్యంత బాధకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, క్షతాగాత్రులకు లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రకటించారు.

**సిఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి**

అనంతగిరి ఘాట్ రోడ్డులో ప్రైవేటు బస్సు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు సిఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించాలని అధికారులను సిఎం సూచించారు. మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్‌లు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాద వివరాలను జిల్లా కలెక్టర్, ఎస్‌పిని ఫోన్‌లో అడిగి తెలుసుకున్న మంత్రి సహాయక చర్యలు, క్షతగాత్రులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# బాయిలర్‌లో పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇంకొకరికి తీవ్ర గాయాలయ్యాయి. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురూ మరణించారు. మృతులను చెరివి గ్రామానికి చెందిన చిన్నమస్తానయ్య (47), తడ పట్టణానికి చెందిన వాసు (37), తమిళనాడు నాయుడు కుప్పంకు చెందిన మోహన్ రాజ్ (19), మాదరపాకం చెందిన రమేష్ (32), పశ్చిమ బెంగాల్‌కు చెందిన గౌరభ్ (36) గా శ్రీసిటీ పోలీసులు పేర్కొన్నారు. మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటన చోటు చేసుకోవడంతో టాబ్లెట్ కంపెనీ ప్రాంతమంతా కార్మికుల ఆర్తనాదాలతో మిన్నంటింది. బాయిలర్ పేలుడు ప్రమాద సమాచారాన్ని అందుకున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడు, శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, సూళ్లూరుపేట ఆర్డీవో దేవేందర్ రెడ్డి, టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి, ఏపీఐఐసీ జెడ్ఎం విజయ్ భరత్ రెడ్డి తదితరులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద ఘటనపై ఆరా తీయడంతో పాటు దీనిపై కంపెనీ ప్రతినిధుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# రిజిస్ట్రేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

పూర్తికాక రెవెన్యూ రికార్డుల్లో వ్యవసాయ భూమిగానే కొనసాగుతున్న కారణంగా 22ఎ జాబితాలో నమోదైన నివాస పట్టా భూముల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి దరఖాస్తులను రెవెన్యూ రికార్డులు, భూమి హక్కులు, క్షేత్రస్థాయి పరిస్థితుల ఆధారంగా పరిశీలించి నిబంధనల మేరకు నాలా, ఇతర రుసుములు వసూలు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించినట్లు చెప్పారు. అర్హత ఉన్న దరఖాస్తులను పారదర్శకంగా, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా చూడాలని అధికారులకు సూచించామన్నారు. అమలు పురోగతిపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో ఏళ్లుగా తమ ప్లాట్లను విక్రయించుకోలేక, రుణాలు పొందలేక ఇబ్బందులు పడుతున్న సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఊరట లభిస్తుందన్నారు. శనివారం రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షలో 22ఎ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల అమలుపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని మంత్రి ఆదేశించారు. ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అధికారులు చిత్తశుద్ధితో అమలు చేయాలని సూచించారు. గత నెల 16న శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల మేరకు 22ఎ కు సంబంధించిన సమస్యలను ఫాస్ట్‌ట్రాక్‌లో పరిష్కరిస్తున్నామన్నారు. ఇప్పటికే జి.ఓ.118, జి.ఓ.76లకు అనుగుణంగా స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయడంతో పాటు, జిహెచ్‌ఎంసి, హెచ్‌ఎండిఎ, డిటిసిపి, మున్సిపల్ అనుమతులు పొందిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇచ్చామని చెప్పారు. అలాగే దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ దరఖాస్తుల పరిష్కారానికి కూడా చర్యలు చేపట్టామని, తాజాగా నాలా పూర్తికాని పట్టా భూముల సమస్యకు కూడా పరిష్కారం చూపేలా తాజా మెమో జారీ చేశామన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com